

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 128 పేజీలు: 8+16 వెల: 6.50




ఉమన్స్ ర్యాపిడ్ చెస్ టోర్నీ ఛాంపియన్‌గా వైశాలి

ఆటతో



## వంటింట్లో గ్యాస్ మంట!

సిలిండర్ ధర పెంపు

రూ. 29 పెంచిన ఓఎంసిలు

5

పెంపుపై ఖర్గే మండిపాటు

సమర్థించుకున్న కేంద్రం



మృగశిర కార్తె ప్రారంభం వేళ..

## చేపమందు పంపిణీ

3

ప్రారంభించనున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

నేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో

రాత్రి 9 గంటలకు మొదలు

దేశం నలుమూలల నుంచి తరలి వచ్చిన అస్తమారోగులు

భారీ ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

# మెట్రో రైలు విస్తరణకు కేంద్రమంత్రి అడ్డు



తెలంగాణ ప్రతిపాదనకు ఢిల్లీలో మోకాలడ్డు

బిజెపిలో ఉండి కెటిఆర్‌కు సహకరిస్తున్నారు

విపక్ష నేతల తీరుపై సిఎం రేవంత్ ఆరోపణలు

పరిపాలన సౌలభ్యం కోసమే జిహెచ్ఎంసి విభజన

మల్కాజ్‌గిరి అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తాం

ఉప్పల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ

రూ.1511 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్ (ఉప్పల్), జూన్ 7 ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించడంలేదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భాజపాలోనే ఉండి.. కేటీఆర్‌కు సహకరిస్తున్నారని వారి పార్టీ నేతలే చెబుతున్నారన్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఉప్పల్ భగాయత్‌లో రూ.1511 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఉప్పల్‌లో 10 ఎకరాల్లో రూ.98 కోట్లతో నిర్మించే మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణంతోపాటు, రూ.960 కోట్లతో ఏఓసి సెంటర్ లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రూ.416 కోట్లతో టీకేఆర్ కళాశాల 6 లేన్ల ఫ్లైఓవర్ నిర్మాణం, రూ. 37.50 కోట్లతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. >>2



ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ సభకు హాజరైన ప్రజలు



ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## నేను ఎవరో తెలంగాణ ప్రజలకు తెలుసు

12 పార్టీలు తిరిగి వచ్చిన వ్యక్తి కాదు..

నాకు రేవంత్‌రెడ్డి సర్టిఫికేట్ అవసరం లేదు

21న పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోడీ యోగా డే

మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** 'నేను ఎవరో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. నేను పన్నెండు పార్టీలు తిరిగి ఈ పార్టీలోకి వచ్చిన వ్యక్తిని కాదు. నేను భారతీయ జనతా పార్టీలోనే పుట్టాను, భారతీయ జనతా పార్టీలోనే రాజకీయ జీవితం ప్రారంభించాను, ఇందులోనే కొనసాగుతాయన్నారు అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరిస్తున్నాం. నా గురించి ఆయన చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, తెలంగాణకు నేను చేసిన సేవలకు రేవంత్ రెడ్డి సర్టిఫికేట్ అవసరం లేదన్నారు. శనివారం ఆయన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.. కేంద్రంలో మంత్రిగా తెలంగాణ కోసం నేను తీసుకొచ్చిన ప్రాజెక్టులు, నిధులు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు బాగా తెలుసునన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కొండలు కోటలు దాటుతున్నా, ఆయన ప్రభుత్వ పనితీరు మాత్రం సెక్రటేరియట్ గేటు కూడా దాటడం లేదు. ఆయనలో రాజకీయ నిరాశ, నిస్పృహలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రతిపంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ >>2



## గ్రీన్ కార్డ్ ఆశావహులకు శుభవార్త

ట్రంప్ ఆదేశాలు చట్టవిరుద్ధం

యుఎస్‌సిఐఎస్ విధానాలు సరికాదు

ఫెడరల్ కోర్టు కొట్టివేత... కీలక తీర్పు

**దరఖాస్తుదారులకు ఊరట**

**వాషింగ్టన్, జూన్7:** అమెరికా గ్రీన్ కార్డుకోసం కలలు కంటున్న ఆశావహులకు శుభవార్త. దాదాపు 39 దేశాలకు చెందిన వలసదారుల గ్రీన్ కార్డ్‌లు, వర్క్ పర్మిట్‌లు, ఆశ్రయం, పౌరసత్వ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేస్తూ ట్రంప్ ప్రభు త్వం గతంలో ప్రవేశ పెట్టిన కఠినమైన విధానాలను >>2



## మైనింగ్ అక్రమాలపై కేంద్రం నజర్

రాష్ట్రానికి కేంద్ర బృందాల తనిఖీలు

పలు గ్రానైట్ ఫైళ్లు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన గ్రానైట్ అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ అక్రమ వ్యవహారాలపై సీఐడీ విచారణకు ఆదేశించగా, ఇప్పుడు కేంద్ర బృందాలు కూడా రాష్ట్రంలో తనిఖీలు చేస్తున్నాయి. రెండున్నరేళ్లుగా ఈ అక్రమ దందాలు, వేల కోట్ల >>2



## మరో 2 రోజుల్లో భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

పిడుగుపాటుకు మహిళ మృతి

రోహిణికార్తెలో 3 జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు

వారంలో రాష్ట్రంలోకి రుతుపవనాలు

**హైదరాబాద్,జూన్7,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ళలో ఆదివారం పిడుగుపాటుకు ఒక మహిళతోపాటు రెండు ఎడ్లు మృత్యువాతపడ్డాయి. చేవెళ్ళ మండలంలోని కేసారం గ్రామంలో పిడుగుపడి మహిళ చనిపోయారు. చేవెళ్ళ మండలం గుండాల >>2


# ఫీ'జులుం' తప్పదా!

ఫీజు నియంత్రణ చట్టంపై స్పష్టత కరవు

వారం రోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాలలు

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

తెలంగాణ విద్యావిధానం రూపొందించిన తర్వాతే ఫీజుల నియంత్రణ చట్టం: అధికారులు వెల్లడి



**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 7:** తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ఏడాది కూడా ఫీజుల భారాన్ని మోయక తప్పదు. వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండగా ఇప్పటి వరకు ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేదు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజు నియంత్రణ చట్టం వస్తుందని ఆశతో ఎదురు చూడటం.. తీరా విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ చట్టం ఈ ఏడాది 2026-27 వచ్చేలా లేదు. ఫీజు నియంత్రణ చట్టం ఇప్పటి వరకు రాకపోవడంతో ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని సుమారు 11వేల ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్న సుమారు 32 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లక్షల్లో ఫీజులను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ప్రైవేటు స్కూల్స్‌కి సంబంధించి ఫీజుల వసూలులో హైదరాబాద్ నగరం దేశంలో రెండో >>2



## రేవంత్‌కి హిట్లర్ ఆదర్శం అందుకే ఇంత అరాచకం

మాకు అంబేద్కర్, గాంధీ, జయశంకర్ ఆదర్శం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్7:** ప్రపంచంలోనే అత్యంత క్రూరడైన నియంత హిట్లర్ ఆదర్శం కాబట్టే రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అరాచకాలు చేస్తున్నారని బిఆర్ఎస్ >>2

# 'పవర్' ప్లానింగ్

భవిష్యత్తు డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

కరెంట్ పోని రాష్ట్రంగా తెలంగాణ

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్: డి. సిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కావలసిన విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో ప్రణాళికలకు రూపొందించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అందులో భాగంగా సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సాంప్రదాయేతర ఇంధన వనరుల వైపు ప్రభుత్వం బలమైన అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో పాకబండలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 2030 నాటికి 20 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిని సాధించాలనే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పైలట్ ప్రాజెక్ట్ కింద దాదాపు 85 గ్రామాలను సంపూర్ణ సౌరవిద్యుత్ గ్రామాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో రెండుమండలాల్లో ఇంటి పైకప్పుల పైన వ్యవసాయ పంపు సెట్లకు 100శాతం సోలరైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాంకేతికంగా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ, వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన >>2




ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డి.సిఎం భట్టి

ప్రమాదంలో పడ్డ రుతుపవనాలు

నైరుతి రాక ఇప్పటికే ఆలస్యం

అత్యంత బలమైన ఎల్ నినోగా మారొచ్చు

యూరోపియన్ వాతావరణ నిపుణుల అంచనా




# ఎల్ నినో మొదలు..

పసిఫిక్‌లో పరిమితి దాటిన ఉష్ణోగ్రతలు

గాడ్జిల్లా ఎల్ నినో రికార్డులను బద్దలు కొట్టొచ్చు

**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రతి జూన్‌లో, భారతదేశం అదే శబ్దం కోసం ఎదురుచూస్తుంది. రేకుల పైకప్పుపై పడే మొదటి భారీ చినుకులశబ్దం. వేల సంవత్సరాలుగా వస్తున్న విధంగానే రుతుపవనాల రాక. ఒక కొత్త అంచనా ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో వస్తున్న ఒకపెద్ద మార్పు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్(ఇసిఎండబ్ల్యూఎఫ్) తాజా నివేదిక ప్రకారం ఉష్ణ మండల పసిఫిక్ మహా సముద్రం అధికారికంగా ఎల్ నినో ప్రారంభాన్ని సూచించే కీలకమైన ఉష్ణోగ్రత పరిమితిని దాటింది. పసిఫిక్ మహాసముద్రంలో ఇప్పుడు రూపుదిద్దుకుంటున్న ఎల్‌నినో, ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చు. సినిమాల నుండి తీసుకున్న 'గాడ్జిల్లా ఎల్ నినో' అనే మారుపేరు దీనికి ఇప్పటికే వచ్చింది. >>2



ఏపిలో సత్యసాయి జిల్లాలో ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వెనిజులా అధ్యక్షురాలు డెల్సీ ఎలోయినా రోడ్రిగెజ్ గోమెజ్

## దేశాన్ని విడదీయొద్దు.. రేవంత్‌కు రిజిజు కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్7:** ప్రధానమంత్రి, రాష్ట్రపతి నార్త్ ఇండియన్లేనని,సౌత్ నేతలకు ప్రాధాన్యం లేదంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్ ఇచ్చారు. 'మీ లీడర్(రాహుల్ గాంధీ)లా నార్త్,సౌత్ అంటూ ఇండియాను విడగొట్టడానికి ప్రయత్నించొద్దు. అందరం భారతీయులమే అని పేర్కొన్నారు. ఒడిశాకు చెందిన రాష్ట్రపతి (ద్రౌపది ముర్ము)ది ఈస్ట్ ఇండియా, గుజరాత్‌లో పుట్టిని ప్రధానమంత్రి (నరేంద్రమోడీ) వెస్ట్ ఇండియాకు చెందిన వారు, తమిళనాడు నుంచి వచ్చిన ఉపరాష్ట్రపతి (రాధాకృష్ణన్)ది సౌత్ ఇండియా' అని ట్వీట్ చేశారు.

## 2 రోజుల్లో భారీ వర్షాలు

>> గ్రామంలో యాలల మల్లారెడ్డికి చెందిన ఎడ్లు పిడుగుపాటకు మృతి చెందాయి. వీటి విలువ లక్షా ఎనభైవేల ఉంటాయని బాధిత రైతు తెలిపారు. రోహిణికార్తే ఆరంభం నుంచి తెలంగాణలో వర్షాలు పడుతుండటంతో వేసవి తాపం తగ్గింది. తెలంగాణలో జూన్7నాటికి 1.9సెం.మి వర్షపాతం సాధారణంగా నమోదు కావాల్సి ఉండగా 1.24సెం.మి వర్షపాతం నమోదైంది. భద్రాద్రికొత్తగూడెం,కామారెడ్డి కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు కురువాల్సి నదానిక ంటే అత్యధిక వర్షాపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెంలో 2.03సెం.మి వర్షాపాతం సాధారణంగా నమోదు కాల్సి ఉండగా 3.15సెం.మి వర్షపాతం 55శాతం అధికంగా నమోదైంది. కామారెడ్డిలో 1.9 సెమికిగాను 2.65సెం.మి నమోదైంది.కామారెడ్డిలో కురువాల్సి వర్షం కంటే 39శాతం కరీంనగర్‌లో 21శాతం, జనగామాలో 12శాతం అధికంగా వర్షపాతం తొలి పదిహేను రోజుల్లో నమోదైంది. ఇదిలా ఉంటే నైరుతి రుతుపవనాల ప్రభావంతో రానున్న వారం రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ విభాగం పేర్కొంది.

## అందుకే ఇంత అరాచకం

>> వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరులో జరిగిన ఓ కాంక్లేవ్‌లో సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కెటిఆర్ ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు, దాని పనితీరుకు జర్మనీ నియంత ఆడాల్ఫ్ హిట్లర్ చర్యలే స్ఫూర్తి అని ముఖ్యమంత్రి బహిరంగంగా ఒప్పుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం ఇప్పుడు దేశం మొత్తానికి అర్థమైందని అన్నారు. మీరు నియంతలను పూజిస్తారు, పేదల ఇళ్ల కూల్చివేతలను గొప్పగా చెప్పుకుంటూ మురిసిపోతారని, తెలంగాణ ప్రజలకు మీ నియంత నైజం ముందే తెలుసు అని, ఇప్పుడు మీ నోటితోనే మీ ఫాసిస్ట్ ఆలోచనలను దేశం మొత్తానికి స్పష్టం చేసినందుకు ధన్యవాదాలు అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. తమ పదేళ్ల పరిపాలనను తాము డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితో, మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గంలో, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ కన్న కలల ఆశయాల ప్రాతిపదికన నడిపించామని తెలిపారు.

## ఫీ'జులుం' తప్పదా!

>> స్థానంలో ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ తరువాత ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లకు లక్షల్లో డొనేషన్లను వసూలు చేస్తుండటమే కాకుండా.. ఏడాది ఫీజు సైతం లక్షల్లో ఉంటుంది. ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఉద్యోగస్తులు తాము సంపాదిస్తున్నదాంట్లో సగానికిపైగా వారి పిల్లల ఫీజులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణ కోసం 2017లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతి రావు ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది. తిరుపతి రావు కమిటీ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. వాటిల్లో 10 శాతం లోపు ఫీజులను యాజమాన్యాలు పెంచుకోవడానికి ప్రతిపాదించగా.. 15 శాతం కంటే ఎక్కువ అయితే ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉంటుందని ప్రతిపాదిస్తూ కమిటీ తన నివేదికను 2020లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలపై అప్పటి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ పార్టీ 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులు భారీగా ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఫీజుల నియంత్రణ అంశంపై 2024 జూలైలో మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం తెలంగాణ విద్యా కమిషన్.. తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు-2025ను ప్రభుత్వానికి సమర్పించింది. ఫీజు నియంత్రణ కోసం విద్యా శాఖ కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. రెండేళ్లకోసారి 8 శాతం ఫీజులను పెంచుకోవడానికి స్కూల్ యాజమాన్యాలకు అనుమతి ఉండాలని.. అంతకంటే ఎక్కువగా.. అంటే 9% అంతకంటే ఎక్కువ ఫీజులను పెంచుకోవాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం ఉండాలని ప్రతిపాదించింది.ఫీజులనిర్ధారణలోనూ పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపాదనల్లో విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు.ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. కానీ ఇప్పటి వరకు అందుకు సంబంధించిన ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం తేవాలంటే తెలంగాణ విద్యా విధానంతో లింక్ ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యా శాఖ నుంచి డ్రాఫ్ట్‌ను సిద్ధం చేయగా.. దానిపై న్యాయపరమైన చిక్కులు రాకుండాచర్యలు తీసుకోవాలనేఅంశాలపై చర్చ జరుగుతున్నట్టు విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. విద్యా విధానం రూపొందిన తరువాతనే ఫీజుల నియంత్రణ చట్టం వస్తుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. వారంలో పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఫీజుల భారాన్ని ప్రజలు మోయక తప్పనిపరిస్థితి నెలకొంది.

## గ్రీన్ కార్డ్ ఆశావహులకు శుభవార్త

>> ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. పూర్తి లేదా పాక్షిక ప్రయాణ నిషేధాల కింద ఉన్న 39 దేశాల జాతీయుల ఆశ్రయం, పని అనుమతి, గ్రీన్ కార్డ్, పౌరసత్వ దరఖాస్తులను నిలిపివేసిన లేదా ఆలస్యం చేసిన నాలుగు యుఎస్‌సిఐఎస్ విధానాలను కొట్టివేశారు. ఆ ఏజెన్సీకి చట్టబద్ధమైన అధికారం లేదని, వలస, పరిపాలనా చట్టాలను ఉల్లంఘించిందని, వలస వ్యతిరేక భావాలను కప్పిపుచ్చే 'సాకు'గా జాతీయ భద్రతా ఆందోళనలపై ఆధారపడిందని రోడ్ ఐలాండ్‌లోని ఫెడరల్ కోర్టు చీఫ్ జడ్జి జాన్ మెక్‌కానెల్ కీలక తీర్పునిచ్చారు. ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన ఈ నిబంధనల వల్ల ఎంతో మంది వలసదారుల జీవితాలు చట్టపరమైన సందిగ్ధతలో పడిపోయాయని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) తన పరిధిని దాటి, చట్ట విరుద్ధంగా దరఖాస్తులను నిలిపివేసిందని కోర్టు పేర్కొంది. దరఖాస్తుదారులు అందరూ అమెరికా కాంగ్రెస్ రూపొందించిన చట్టాలను, నిబంధనలను సరిగ్గా పాటించినప్పటికీ కేవలం వారు పుట్టిన దేశాల ఆధారంగా వారి ప్రక్రియను నిలిపివేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ కోర్టు తీర్పుతో గత కొంతకాలంగా నిలిచిపోయిన గ్రీన్ కార్డ్, వర్క్ పర్మిట్ దరఖాస్తుల పునఃపరిశీలన ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది. ముఖ్యంగా ఆయా దేశాల నుండి వచ్చి చట్టబద్ధమైన నివాసం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విదేశీయులకు, వారిపై ఆధారపడిన కుటుంబాలకు ఈ నిర్ణయం ఎనలేని ఊరటనిచ్చింది.

ఫెడరల్ కోర్టు తీర్పు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారికంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. డిహెచ్ఎస్ జనరల్ కౌన్సెల్ జేమ్స్ పెర్సివాల్ బహిరంగ వ్యాఖ్యలలో ఈ తీర్పును విమర్శించారు, అయితే పరిపాలనకు ఫస్ట్ సర్క్యూట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ట్రంప్ హయాంలోని ఇలాంటి వలస చర్యలను ఈ సర్క్యూట్ గతంలో కూడా విమర్శించిందని వలసదారుల హక్కుల కార్యకర్తలు పేర్కొన్నారు

## వారం - వర్జ్యం

08-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
అష్టమి రా.3.22, శతభిష ఉ.9.07
వర్జ్యం : మ.3.38-సా.5.16
దు.మ.12.02-మ.1.24,
(2) మ.3.09-సా.4.01
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** స్థిరాస్థి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు అవుతాయి.

**వృషభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడుతాయి. వాహన సౌఖ్యం.

**మిథునం:** వివాదాలకు దూరంగా ఉండండి. అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసి వస్తాయి.

**కర్కాటకం:** అందరిలోనూ ప్రత్యేకాకర్షణగా నిలుస్తారు. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**సింహం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు.

**కన్య :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వైద్య పారిశ్రామిక రంగాల వారికి అనుకూలమైన కాలం.

**తుల :** దూరప్రాంతాల నుండి అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. క్రీడారంగం యందు ఆసక్తి కలిగి వుంటారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఈ రోజు ఉల్లాసముగా గడుపుతారు.ప్రయాణాలు.

**మకరం:** సంఘంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** సంతాన విద్యా విషయంలో పట్ల శ్రద్ధ కనబరుస్తారు. మీ సహాయ సహకారాలు అందిస్తారు.

**మీనం:** సమస్యలు కొంతవరకు తీరి ఊరట చెందుతారు. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మెట్రో రైలు విస్తరణకు కేంద్రమంత్రి అడ్డు

>> ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేయాలని, మిగిలిన సమయంలో అభివృద్ధి గురించి మాట్లాడాలన్నారు. గుజరాత్‌లో సబర్మతి రివర్‌ంట్, ఢిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారని, యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని అక్కడి సీఎం యోగి చెప్పుకుంటున్నారని,. ప్రధాని మోదీ నదులను ప్రక్షాళన చేశారని భాజపా నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారని, కాని. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనుల కోసం గత రెండున్నర ఏళ్లలో 50 సార్లు ఢిల్లీ వెళ్లానని, ఐదు సార్లు ప్రధాని మోడీని కలిసినట్లు తెలిపారు. ఈ నెల 15.. తర్వాత మా కార్యాచరణ మారుతుందని, మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో.. రాష్ట్రంలో మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరో.. ఆర్ఆర్ఆర్‌కు నిధులు ఎందుకు ఇవ్వరో.. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తామని హెచ్చరించారు. తెలంగాణలో 75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కేంద్రం తీసుకుంటుందని, మిగిలిన ధాన్యం ఏమి చేయాలని ఆయన ప్రశ్నించారు. నగర శివారులోని ఓఆర్ఆర్ లోపలే దాదాపు ఒక కోటి 34 లక్షల మంది ప్రజలు ఉన్నారని, ఈ స్థాయి జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదని ఆయన పేర్కొన్నారు.. పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించామని, కానీ.. రాజకీయ లబ్ధి కోసమే విభజించామని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.. ప్రజల సౌలభ్యం కోసం ఉప్పల్‌లోనే మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాజకీయంగా కిందపడిన నన్ను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలే అన్నారు. కేంద్రం సహకారం లేకపోవడంతో అప్పుడు ఎంపీగా అనుకున్న పనులు చేయలేకపోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తానని, మెట్రో విస్తరణతో సహా అన్ని పనులకు మంజూరు చేస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతల ప్రభుత్వం అన్నారు.

**త్వరలోనే నాగోల్ నుంచి గౌరెల్లి మూసీ ప్రక్షాళన పనులు**

మూసీ ప్రక్షాళన పేజ్ -2 పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, నాగోల్ నుంచి గౌరెల్లి వరకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ఇక్కడి భూయజమానులతో మాట్లాడి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఉప్పల్‌లో మూసీ బెడద లేకుండా చేస్తామన్నారు. ఉప్పల్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**క్యూర్ యాప్ ఆవిష్కరణ**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యూర్ యాప్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మున్సిపల్, పోలీస్, విద్యుత్, ట్రాఫిక్ తదితర విభాగాలకు చెందిన పిర్యాదులు,బిల్లుల చెల్లింపులు కూడా ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనరసింహా, ఎమ్మెల్సీ వేం నరేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, శ్రీగణేష్, మైనంపల్లి హనుమంతరావు, మల్‌రెడ్డి రాంరెడ్డి, వజ్రేష్ యాదవ్, మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఎం.సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శి జయేష్ రంజన్, ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టర్ మనుచౌదరి, పలువురు అధికారులు, పార్టీల నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు తెలుసు

>> ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత కేవలం సన్న వడ్లకే ఇస్తామని మాట మార్చిందన్నారు. కానీ వాస్తవంగా సన్న వడ్లకూ లేదు, దొడ్డు వడ్లకూ లేదు.. రైతులకు ఎక్కడా రూ.500 బోనస్ అందలేదు. రైతులకు రూ.15 వేల ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలను కూడా నెరవేర్చలేదు. రైతులను నడిరోడ్డుపై అరకొరగా వదిలేసి, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాలు, రుణాల ఆధారంగానే కాంగ్రెస్ ప్రభుత్వం రోజువారీ పాలన కొనసాగిస్తుందన్నారు. రేవంత్ రెడ్డి సర్టిఫికేట్ కాదు... తెలంగాణ ప్రజల తీర్పే మాకు అసలైన సర్టిఫికేట్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న కోసం ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వివిధ దేశాల ప్రభుత్వాధినేతలు, ప్రముఖులతో పాటు అంతర్జాతీయంగా ఉన్న భారత రాయబార కార్యాలయాలు, ప్రవాస భారతీయ సంఘాలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి యోగాను అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించిన గత 12 ఏళ్లుగా పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ స్థాయిలో దీన్ని నిరక్ష ్యం చేశారు. గత ప్రభుత్వాల వ్యతిరేక వైఖరి వల్ల అక్కడ యోగాకు ప్రాధాన్యత దక్కలేదు. కానీ ఇప్పుడు అనుకూలమైన వాతావరణం ఉండటంతో, ఈ యేడాది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ బెంగాల్‌లో జరిగే ప్రధాన యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. గత యేడాది ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిందన్నారు.

**హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో "24 గంటల కౌంట్‌డౌన్" వేడుకలు**

గత ఐదారు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో దక్షి ణ భారతదేశంలోనే అతిపెద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది కూడా హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో "24 గంటల కౌంట్‌డౌన్ టు యోగా డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. జూన్ 20న కౌంట్‌డౌన్ కార్యక్రమం ప్రారంభం కాగా, జూన్ 21 ఉదయం 7 గంటలకు ప్రధాన యోగా కార్యక్రమం నిర్వహించబడుతుంది. యోగా అనేది రాజకీయాలకు అతీతమైనది. ఆరోగ్యం, క్రమశిక్షణ, భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ యోగా మహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి పాల్గొనాలని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## మైనింగ్ అక్రమాలపై కేంద్రం నజర్

>> స్వాహా చేశారనే ఫిర్యాదులకు సంబంధించిన ఫైళ్ల గుట్టు విప్పేందుకు కేంద్ర బృందాలు రంగంలోకి దిగాయి. సీబీఐ, ఈడీ, విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏకకాలంలో రాష్ట్రంలోని వివిధ గ్రానైట్ సంస్థలపై దాడులు చేస్తున్నాయి. 2014 నుంచి ఇప్పటి వరకు గ్రానైట్ సంస్థలు జరిపిన ఉత్పత్తి, ఎగుమతులు, స్థానికంగా చేసిన అమ్మకాలు, కేంద్రానికి, రాష్ట్రానికి చెల్లించిన పన్నులు, జరిపిన లావాదేవీలపై సమగ్ర పరిశీలన చేస్తున్నాయి. రెండు రోజులుగా కేంద్ర బృందాలు గ్రానైట్ ఉత్పత్తి క్వారీ సంస్థలు, పాలిషింగ్ యూనిట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో పలు రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా ఎనిమిది గ్రానైట్ ఎగుమతి సంస్థలు ఫెమా చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా రూ.124.94 కోట్ల విలువ చేసే గ్రానైట్‌ను తప్పుడు కొలతలు చూపించి ఎగుమతి చేశారని అధికారులు గతంలోనే గుర్తించారు. ఇందుకు ఆరు రెట్లు ఫెనాల్టీ విధించి రూ. 749.66 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. అయితే గ్రానైట్ వ్యాపారులు ఫెనాల్టీ చెల్లించి క్వారీలు నడుపుకుంటామని, వాయిదాల వారీగా మిగతా సొమ్ము చెల్లిస్తామని కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకొని మళ్లీ లావాదేవీలు ప్రారంభించారు. ఆమేరకు రూ.124.94 కోట్ల ఫెనాల్టీకి గాను, కేవలం రూ.11.08 కోట్లు మాత్రమే చెల్లించి ఎనిమిదేళ్లుగా మిగిలిన సొమ్మును చెల్లించ లేదు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో ఉన్న వందలాది పాలిషింగ్ యూనిట్లలో కూడా ఈ వ్యవహారం కొనసాగుతున్నదని అనుమానిస్తున్న కేంద్ర బృందాలు తనిఖీలు నిర్వహించి పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. మిగతా సంస్థల్లోనూ ఇలాంటి దందా కొనసాగుతున్నట్లు గుర్తించిన బృందాలు ఇప్పుడు అన్ని పాలిషింగ్ యూనిట్లు, గ్రానైట్ క్వారీలు, ఎగుమతి సంస్థల వ్యవహారాల రికార్డులను పరిశీలించి అక్రమ వ్యవహారం గుట్టు తేల్చే పనిలో ఉన్నారని తెలియవచ్చింది.



ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా పాట్నాలో నిర్వహించిన 'ఫిట్ ఇండియా సైక్లోథాన్'లో పాల్గొన్న ప్రజలు

## 'పవర్' ప్లానింగ్

>> విద్యుత్‌ను అందించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిందన్నారు. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగినప్పటికీ, ఎక్కడా ఎలాంటి కోతలు, అంతరయాలు లేకుండా సరఫరా చేశామని చెప్పారు. విద్యుత్ డిమాండ్ పెరగడాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఒక సూచికగా భావించవచ్చని చెప్పారు. ఉత్పాదక రంగాలన్ని విద్యుత్‌తోనే ముడిపడి ఉంటాయని చెప్పారు. డిమాండ్ పెరుగుతోందంటే ప్రజల కొనుగోలు శక్తి, ఉత్పత్తి పెరుగుతున్నట్లని పేర్కొన్నారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట విద్యుత్ డిమాండ్ కేవలం 15,000 మెగావాట్లు మాత్రమే ఉండేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్లకే పీక్ డిమాండ్ 18,548 మెగావాట్లకు చేరుకుందన్నారు. కేవలం రెండున్నర సంవత్సరాలలోనే 3,500 మెగావాట్లకు పైగా గరిష్ట విద్యుత్ వినియోగం పెరిగిందని వెల్లడించారు. వ్యవసాయ రంగాన్ని, సంక్షేమాన్ని ప్రభుత్వం వదిలిపెట్టలేదని తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఉచిత విద్యుత్ అందించడం కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతి నెల రూ.1,150 కోట్లు రైతుల పక్షాన విద్యుత్ శాఖకు చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ రంగానికే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 53 లక్షల నిరుపేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను అందిస్తున్నామని వెల్లడించారు. ఈ 53 లక్షల కుటుంబాలు వాడుకునే విద్యుత్ బిల్లు మొత్తాన్ని కూడా ప్రభుత్వమే ప్రతి నెల లెక్కగట్టి ఆయా శాఖలకు చెల్లిస్తోందన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి వినియోగదారునికి చేరే లోపు ఎక్కడా కూడా సరఫరా నష్టాలు లేకుండా చూస్తున్నామని అన్నారు. రైతులకు మీటర్లు పెట్టే పరిస్థితి వస్తే తాము ఎన్నికల్లో పోటీ చేయమని, రైతులకు ఎవరికీ మీటర్లు పెట్టకుండా, ఉచిత విద్యుత్‌ను భవిష్యత్తులో ఇలాగే ఇస్తామని తేల్చిచెప్పారు. రైతన్నలకు ఉచితంగా కరెంట్ ఇవ్వడం అనేది కాంగ్రెస్ పేటెంట్ హక్కుగా పేర్కొన్నారు.

## దార్శనిక దేవాలయాలుగా సమీకృత గురుకులాలు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్మిస్తున్న సమీకృత సంక్షేమ గురుకులాలు కేవలం భవనాలు కావని, రేపటి తరాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఆదివారం ఆయన లక్ష్మీపురం సమీకృత గురుకుల భవనాల నిర్మాణం పనులను పరిశీలించారు. సైన్స్, మ్యాథ్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల నిర్మాణ నాణ్యతపై కీలక సూచనలు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అలాగే జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్ విభాగాలు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు వేదికలుగా నిలిచే మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ ల్యాబ్ భవనాల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనల ప్రకారం అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చెప్పారు. పనులను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి కేవలం వ్యయం కాదు, అది రాబోయే భవిష్యత్ తరాలను శక్తివంతంగా నిర్మించడం కోసం పెట్టే అద్భుతమైన పెట్టుబడి అని పేర్కొన్నారు. గడువులోగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## ఎల్ నినో మొదలు

>> నైరుతి రుతుపవనాలు, కనీసం, వచ్చేశాయి. అవి మూడు రోజులు ఆలస్యంగా, జూన్ 4న కేరళ తీరాన్ని చేరుకుని, ఇప్పుడు ఉత్తరం వైపు నెమ్మదిగా కదులుతున్నాయి. ఎల్ నినోను కచ్చితంగా అంచనా వేయడం కష్టం. శాస్త్రవేత్తలు అత్యంత నిశితంగా గమనించే జలభాగం, ఎల్ నినో పరిస్థితులను నిర్వచించే గీతను దాటి ఇప్పటికే వేడెక్కింది. యూరోపియన్ వాతావరణ నిపుణులు ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థలు ఇప్పుడు అధికారికంగా ఎల్ నినో ఆరంభాన్ని ప్రకటించాయి, సెప్టెంబర్ నాటికి పరిస్థితులు గణనీయంగా బలపడతాయని భావిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇప్పటికే అంచనా వేసింది. ఆశించిన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతంగా ఉంటుందని తెలిపింది.

**ఎల్ నినో అంటే ఏమిటి?:**

ఎల్ నినో అనేది ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ (ఇఎన్ఎస్ఓ) అని పిలువబడే ఒక భారీ వాతావరణ డోలనంలో ఒక భాగం. ఉష్ణమండల పసిఫిక్‌ను ఒక ఊయలలా ఊహించుకోండి. ఒక వైపు వెచ్చని దశ, ఎల్ నినో. మరో వైపు చల్లని దశ, లా నినా. సాధారణంగా, వాణిజ్య పవనాలు అని పిలువబడే స్థిరమైన గాలులు వెచ్చని ఉపరితల నీటిని పసిఫిక్ మీదుగా ఆసియా వైపు నెడతాయి. ఎల్ నినో సమయంలో, ఆ గాలులు బలహీనపడతాయి. వెచ్చని నీరు తిరిగి తూర్పు వైపుకు జారుతుంది. సముద్రం తన వేడిని నిల్వ చేసుకునే ప్రదేశాన్ని మార్చుకుంటుంది. శాస్త్రవేత్తలు దీనిని మధ్య పసిఫిక్‌లోని నినో 3.4 ప్రాంతం అని పిలువబడే ఒక ప్రదేశంలో పర్యవేక్షి స్తారు. అక్కడ వారపు ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే సుమారు 0.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా పెరిగాయి, ఇది ఎల్ నినోను సూచించే 0.5డిగ్రీల స్థాయిని దాటింది.

**ఎల్ నినో ఎంత బలపడుతుంది?**

ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ అయిన ప్రపంచ వాతావరణ సంస్థ, ఎల్ నినో ఆరంభాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఈ వేడెక్కడం దాని గమనాన్ని కొనసాగిస్తున్నందున, 2026 మిగిలిన కాలమంతా ఈ సంఘటన బలపడేందుకు 80 నుండి 90 శాతం సంభావ్యత ఉందని ఆ సంస్థ ఇప్పుడు అంచనా వేస్తోంది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ అంచనా ప్రకారం, నినో 3.4 ప్రాంతం డిసెంబర్ నాటికి సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది, కొన్ని అంచనాలు 4 డిగ్రీల సెల్సియస్‌ను కూడా తాకుతున్నాయి. అది 19971998, 2015-2016 సంవత్సరాల ఉమ్మడి రికార్డులను అధిగమిస్తుంది. గత ఎల్ నినో కారణంగా 2024 సంవత్సరం, ఇప్పటివరకు నమోదైన అత్యంత వేడి సంవత్సరంగా నిలిచింది.

**భారత వ్యవసాయ రంగంపై పెనుప్రభావం**

భారతదేశానికి, ఎల్ నినో సాధారణంగా ఒకే విషయాన్ని సూచిస్తుంది. బలహీనమైన రుతుపవనాలు. దానికి కారణం సముద్రంపై ఉన్న గాలిలో ఉంది. పసిఫిక్ మహాసముద్రం వేడెక్కినప్పుడు, ఈ ప్రాంతానికి నీరందించే పైకి లేచే గాలి, భారీ వర్షాల పట్టీ భారతదేశానికి దూరంగా తూర్పు వైపుకు కదులుతుంది. రుతుపవన గాలులు వాటి వేగాన్ని కొంత కోల్పోతాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. 1971 నుండి 2020 మధ్య 50 సంవత్సరాల వర్షపాత డేటా ఆధారంగా తీసుకున్న దీర్ఘకాలిక సగటు (లాంగ్ పీరియడ్ యావరేజ్)లో ఇది సుమారు 90 శాతంగా ఉంటుంది. వర్షపాతం లోటుగా ఉండే సీజన్‌కు 60 శాతం అవకాశం ఉందని అది పేర్కొంది. కొన్నిసార్లు బలహీనపడుతున్న రుతుపవనాలను కాపాడగల ఒక ప్రత్యేక సముద్ర నమూనా అయిన ఇండియన్ ఓషన్ డైపోల్, ఈ సంవత్సరం తటస్థంగా ఉంటుందని అంచనా. రుతుపవనాలు కేవలం వాతావరణం మాత్రమే కాదు. భారతదేశ వార్షిక వర్షపాతంలో సుమారు 70 శాతాన్ని ఇది అందిస్తుంది. దేశంలోని సగానికి పైగా వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యం లేదు. 2015 నుండి 2016 వరకు వచ్చిన చివరి పెద్ద ఎల్ నినో సమయంలో, భారతదేశం తన సగటు వర్షపాతంలో కేవలం 86శాతాన్ని మాత్రమే పొంది కరువులోకి జారిపోయింది.

దాదాపు 60 శాతం మంది రైతులు తమ వేసవి పంటల కోసం ఈ వర్షాలపై ఆధారపడి ఉన్నందున, బలహీనమైన రుతుపవనాల ప్రభావం మొదట నేలలో, ఆ తర్వాత వెంటనే ఆహార ధరలలో కనిపిస్తుంది. ఒక పూట భోజనం ధరను ఇప్పటికీ వర్షాలే నిర్ణయించే దేశానికి, బలహీనమైన రుతుపవనాల ప్రభావం కేవలం చార్టులోని ఒక సంఖ్య మాత్రమే కాదు. అది ఒక మంచి సంవత్సరానికి, ఒక కష్టమైన సంవత్సరానికి మధ్య ఉన్న తేడా.

## నిమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 7, ప్రభాతవార్త:** నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్ నగరి బీరప్ప మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో డాక్టర్ రాహుల్ దేవ రాజ్‌ను డైరెక్టర్‌గా నియ మిస్తూ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తు ఆదేశాలు జారీ చేశారు. పాల మూరు ప్రాంతానికి చెం దిన ఆయన మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నా రు. డాక్టర్ రాహుల్ దేవరాజ్ నిమ్స్‌లో యూ రాలజీ విభాగాధిపతిగా ఉన్నారు. కిడ్నీ మార్పి డిలో చికిత్సలలో ఆయన ప్రత్యేక నిపుణుడు. నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటివరకు జరిగిన దాదాపు 2వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఆయన ఆద్వర్యంలోని వైద్య బృందం ఎంతో కీలక పాత్ర పోషించింది. దీనికితోడు ప్రభుత్వ రంగంలో దక్షిణాదిలో మొదటి రోబోటిక్ కిడ్నీ మార్పిడి చేసిన వైద్యుడిగా గుర్తింపు సాధించారు. నిమ్స్‌లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న క్రమంలో నిమ్స్ సమస్యలు, పరిష్కారాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది.



డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప

## అర్ధరాత్రి సింగిల్‌గా పబ్‌లోకి డిసిపి రితిరాజ్

### అసాంఘిక కార్యక్రమాలను డైరెక్ట్‌గా స్పై ఆపరేషన్

### కూకట్‌పల్లిలోని కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్‌పై పోలీసుల దాడులు

### పబ్ మేనేజర్ సహా 10 మంది అదుపులోకి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** అర్ధరాత్రి సమయంలో సింగిల్‌గా పబ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి డేరింగ్ ఆపరేషన్ చేసింది. అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను షూట్ చేసి ఆ పబ్‌ను నిర్వహిస్తున్న వారిని కటకటాల్లోకి నెట్టేసింది. ఆమెనే డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితిరాజ్. సెక్యూరిటీని తప్పించుకుని పబ్‌లోకి ప్రవేశించి, అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను ప్రత్యక్షంగా గమనించారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్‌లో డిసిపి రితిరాజ్ స్వయంగా పబ్ యాక్టివిటిని చిత్రీకరించి, వెంటనే లోకల్ పోలీసులను పిలిపించారు. పోలీసుల తనిఖీల సమయంలో పబ్‌లో పలు నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించారు. నిర్ణీత సమయానికి మించి పబ్‌ను నిర్వహిస్తున్నందుకు పబ్ మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, కస్టమర్లను ఆకర్షించేందుకు యువతులతో చాటింగ్ చేయించడం, పబ్‌లో డాన్స్ ఫ్లోర్ ఏర్పాటు చేసి న్యూసెన్స్‌కు కారణమవుతున్నారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. పబ్‌లో కస్టమర్లను ఆకర్షించేందుకు గలీజ్ దందా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం సోదాలు నిర్వహించి పబ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. సోదాల్లో మొత్తం 10 మంది యువతి, యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరితోపాటు పబ్ సిబ్బంది, కస్టమర్లు ఉన్నట్లు సమాచారం. కాగా పబ్‌లో జరుగుతున్న కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరపాలని ఆపరేషన్ స్వయంగా పర్యవేక్షించిన డిసిపి.. అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై కింగ్స్ అండ్ క్వీన్స్ పబ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసిన కెపిహెచ్‌బి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## డిస్కం ఏర్పాటు విప్లవాత్మక నిర్ణయం

### రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** వ్యవసాయం తదితర ఉచిత పథకాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం విప్లవాత్మక నిర్ణయమని రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎం కోదండరెడ్డి తెలిపారు. అయితే మోటార్లకు మీటర్లు బిగించబోతుందనేది ప్రతిపక్షాల అపోహ మాత్రమేనన్నారు. రైతుల సమస్యలను రాజకీయం చేయడం సరైందికాదని ప్రతిప క్షాలను కోరారు. హైదరాబాద్‌లోని బీఆర్‌భవన్‌లో రైతు కమిషన్ రూపొందించిన పంటల మార్పిడి నివేదికను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అన్ని పంటలకు మద్దతు నిర్ణయించడం, వాటిని కొనడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే పంటల మార్పిడి అనివార్యమని చెప్పారు. కేరళ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అధ్యయనం చేసి పంటల మార్పిడిపై నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాలు అందుబాటులోకి రాకముందు వర్షాధార, సాంప్రదాయ పంటల సాగు అధికంగా ఉండేదని, కాలక్రమేణా రైతులు వరి, పత్తి పంటల వైపు మొగ్గుచూపారని తెలిపారు. వరి, పత్తి పంటలకు కేంద్ర ప్రభుత్వమే మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, పత్తి కొనుగోళ్లలో అమలు చేసిన యాప్ విధానం, పంటపై విధించిన ఆంక్షలు, ఎకరానికి ఏడు క్వింటాళ్ల పరిమితి వంటి నిర్ణయాలను తప్పుపట్టారు. రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటల సాగు తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. కోతుల బెడద కారణంగా పలు పంటల సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి సోలార్ ఫెన్సింగ్, కోతుల కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. వరి, పత్తి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. దేశవ్యాప్తంగా 23 పంటలకు మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ, కేంద్రం వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లకే పరిమితమవుతోందని విమర్శించారు.

# మృగశిర కార్తె ప్రారంభవేళ.. చేప మందు పంపిణి

### నేడు నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో రాత్రి 9 గంటలకు ప్రారంభం

### దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన ఆస్తమా రోగులు

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 7, ప్రభాతవార్త:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం కోసం వచ్చే ఆస్తమా రోగులకు ఎలాంటి ఇబ్బం దులు కలుగ కుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మృగ శిర కార్తె మారడంతో చేప ప్రసాదం పంపిణి చేసే బత్తిని సోదరులు ఆస్తమా రోగులకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేసిన శిబిరంలో ఆస్తమా రోగులకు ఈ నెల 8వ తేదిన రాత్రి 9గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కలిసి చేప ప్రసాదాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి యేటా మృగశిర కార్తె జూన్8వ తేదిన ప్రారంభ మవుతుందని వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు చేప ప్రసాదం కోసం తరలి రావడం కనిపించింది. రాత్రి 9గంటలకు ప్రారంభించి 9వ తేది రాత్రి 9గంటలకు వరకు చేప ప్రసాదం కొనసా గుతుందని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్‌గౌడ్ తెలిపారు.

ప్రతి యేటా మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 8, 9 తేదిల్లో జరుగనున్న చేప ప్రసాదం పంపిణికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. భారత దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలందరూ(ఆస్తమారోగులు)తమ వంతు వచ్చే వరకు క్యూలైన్లలో వేచి ఉండి ప్రశాంతంగా ప్రసాదం స్వీకరించి సురక్షితంగా తిరిగి వెళ్లే విధంగా వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సమీక్షించారు. పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బి. వాటర్ వర్ క్స్, మత్స్య, సమాచార, విద్యుత్, వైద్య, జిహెచ్ఎంసి, అగ్నిమాపక, జలమండలి, ట్రాఫిక్ తదితర శాఖల సమన్వయంతో రోగులకు ఎటువంటి ఇబ్బంది అసౌకర్యం కలుగ కుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యంగా పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజ్ వేస్తూ తగు చర్యలు తీసుకునేందుకు ప్రజలకు తగు సూచనలు అందించేందుకు వీలుగా పోలీసు సమాచార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కంట్రోల్ రూంను ఏర్పాట్లు చేశారు. ఇందులో తెలుగు, హిందీ, ఉర్దూ తదితరభాషలో ప్రజలకు సూచనలు ఇచ్చేందుకు అనౌన్సర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బ్యారి కేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సూచికలు, మంచినీరు, షెడ్లు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేశారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్సలు అందించడానికి వీలుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో ఆరోగ్య శిబిరాలు 4, అంబులెన్స్ 4, సర్వీసులు, కూడా సిద్దం చేశారు. మత్స్య శాఖ ద్వారా ఇప్పటికే లక్షకు పైగా చేపపిల్లలు సిద్దం చేశారని, 34 టోకెన్ కౌంటర్లు, 34 చేప పిల్లల కౌంటర్లు ఏర్పాటు చేశారు. తెలిపారు. జలమండలి ద్వారా మంచి నీటి ట్యాంకర్లు త్రాగునీటి ప్యాకెట్లు సిద్ధం చేసినట్లు చేశారు.



**75 చోట్ల సిసి కెమోరాలు ఏర్పాట్లు**

నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగే చేపప్రసాదాన్ని తిలకిచేందుకుగాను సమాచారశాఖ తో పాటు పోలీసులు విభాగం ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి కదలికను తెలుసుకు నేందుకు గాను 75సిసి కెమెరాలు ఏర్పాట్లు చేశారు. చేప ప్రసాదం ముగిసే వరకు కొన సాగుతుంది. చేప ప్రసాదం కోసం వాహనాదారుల కోస ం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అఫ్జల్‌గంజ్‌వైపునుంచి వచ్చే వాహనాలను ఎంజె మార్కెట్ చౌరస్తానుంచి అబిడ్స్‌వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా నాంపల్లివైపునుంచి గాంధీభవన్ వైపు వచ్చే వాహనాలను బషీర్‌బాగ్ జగ్జీజీవన్ రాం విగ్రహం నుంచి అబిడ్స్‌వైపు మళ్లించనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎక్‌మినార్ వైపు ట్రాఫిక్ రద్దీని బట్టి తగ్గిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చేపప్రసాదం కోసం వచ్చేవారు తమ వాహనాలను ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కళాశాల, గగహన్ వివహార్, గృహ కాంప్లెక్స్, గాంధీభవన్ టిఎన్‌జి భవన్ ముందు పార్కింగ్ చేసుకో వచ్చునన్నారు. చేప ప్రసాదం కోసం విధులకు వచ్చే అధికారులు తమ వాహనాలను భీమ్‌రాంబాడాలో పారి ్కంగ్ చేసుకోవాలన్నారు.

**34 కేంద్రాల ద్వారా ప్రసాదం టోకెన్‌ల పంపిణి**

ఎగ్జిబిషన్ గ్రౌండ్ అజంతా గేట్ వద్ద ఏర్పాటు చేసిన 34 భారీ కేడ్‌లలోవెళ్లే ఆస్తమా రోగులు అర కిలో మీటర్ తరువాత గాంధీదర్శన్ ముందు 34 కేంద్రాల ద్వారా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన చేప ప్రసాద టోకెన్‌లను కౌంటర్‌లలో తీసుకు వలసి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి తొక్కి సలాటకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు చేశారు. 50 రూపాయలు చెల్లించి టోకెన్ తీసుకున్న తరువాత నేరుగా భారీ కేడ్‌ల వెంబడి మరో అరకిలోమీటర్ వెళ్లి ఆస్తమా రోగులు కమలా నెహ్రూపాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చేపపిల్లలను

తీసుకుని కొద్ది దూరంలో చేపప్రసాదాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. అక్కడే నేరుగా చేపిల్లల ద్వారా ప్రసాదాన్ని అందించే బత్తిని సోదరులు ఉచితంగా కార్తె ప్రసాదాన్ని అందచేస్తారు.

# స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

### 15న పాఠశాలలు పునఃప్రారంభం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు మరో మూడు రోజు లు పొడిగింపబడ్డాయి. 2026-27 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కావల్సి ఉన్నందున .. ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తుల మేరకు పాఠశాలలను ఈ నెల 12 నుంచి కాకుండా ఈ నెల 15 నుంచి పునః ప్రారంభించాలని నిర్ణయించినట్టు పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత ఈ నెల 12న తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. పాఠశాలల పునః ప్రారంభ తేదీని పునః పరిశీలించమని కోరుతూ వివిధ భాగస్వాముల నుండి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందాయి. ఈ నెల 13 రెండోవ శనివారం, 14 ఆదివారం వస్తున్నందున, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల12కు బదులుగా ఈ నెల 1న తిరిగి తెరవాలని నిర్ణయించనట్టు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం వాయిదా పడటం వలన కోల్పోయిన విద్యా సమయాన్ని భర్తీ చేయడానికి 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనా దినాలను ఖచ్చితంగా పాటించేలా చూసేందుకు, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జుల నెలో రెండవ శనివారం అయిన (11.07.2026)ను సాధారణ పనిదినంగా పరిగణించాలని నిర్ణయించినట్టు డైరెక్టర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని శాఖాధిపతులు, హైదరాబాద్, వరంగల్ పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాధికారులందరూ తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. రాష్ట్రంలో 24,672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. సుమారు 11వేల వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

## కార్యకర్తలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

### పదాధికారులతో సమీక్ష నిర్వహించిన

### రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, తివారి, రాంచందర్‌రావు



**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మరింత మమేకమై వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా కార్యాచరణ రూపొందించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు నేతలకు దిశానిర్దేశనం చేశారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన రాష్ట్ర కార్యాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ రాష్ట్ర స్థాయి పదాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో పాటు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు, పదాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, సంస్థాగత కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిరక్ష ్యం, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నెలకొన్న సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి కార్యాచరణ రూపకల్పన చేశారు.

# స్త్రీ రైడ్ పథకం అమలుకు సర్కారు నిర్ణయం

### మహిళా ప్రయాణికులకు మరింత భద్రత

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారి కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఉద్దేశించిన స్త్రీ రైడ్ పథకం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సర్కారు నిర్ణయించింది. మహిళా భద్రతా విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు), రవాణా శాఖలు సం యుక్తంగా చేబట్టిన ఈ పథకం శనివారం హైదరాబాద్‌లో మొదలవడం తెలిసిందే. మొదటి విడతగా గ్రేటర్ పరిధిలో ఇది అమలవగా త్వరలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో దీనిని అమలు చేయనున్నారు. వాస్తవానికి ఈ పథకానికి అంకురార్పణ చేసింది డబ్ల్యుఎస్‌డబ్ల్యు. ఈ విభాగం డిజి చారు సిన్హా ఇందుకోసం ఎంతో శ్రమించారు. ఈ పథకం అమలు కోసం స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోగా వారి ఆధ్వర్యంలో మొద ట పెద్ద సంఖ్యలో డ్రైవింగ్ మెళకువలు తెలిసిన మహిళలు హాజరయ్యారు. నాలుగు నెలల క్రితం అంబర్‌పేట్‌లో ఈ పథకం అమలుకోసం మ హిళా డ్రైవర్ల ఎంపిక కసరత్తు మొదలయ్యింది.

అనంతరం ఈ పథకం కోసం ఎంపికైన వారికి కఠిన శిక్షణ ఇచ్చి ప్రొఫెషనల్ డ్రైవర్లుగా తీర్చిది ద్దారు. గ్రేటర్ పరిధిలో లక్షల సంఖ్యలో మహిళా ఉద్యోగులు నిత్యం క్యాబ్‌లలో రాకపోకలు సాగిస్తుండడం, ఇదే సమయంలో వేల సంఖ్యలో మహిళలు ఒంటరిగా విమానాలు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు సాగిస్తుండడంతో వారి భద్రతకు మరింత భరోసా ఇచ్చేందుకు స్త్రీ రైడ్‌ను అ మలు చేయాలని డబ్ల్యుఎస్‌డబ్ల్యు భావించింది. అయితే ఈ పథకం అమలు అంత ఆషామాషీగా అమలు కాలేదు. డబ్ల్యుఎస్‌డబ్ల్యుతో పాటు మ హిళల సాధికారత, అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు ఈ విషయంలో తమ వంతు సహకారం అందిం చాయి. దీని తరువాత మొదటి విడతగా 55 మంది స్త్రీ రైడ్‌కు అర్హత సాధించారు. వీరిలో ద్విచక్ర వాహనాలు నడిపేందుకు 50 మంది, ఆ టోలు నడిపేందుకు నలుగురు, కారు నడిపేందుకు ఒకరు అర్హత సాధించారు.

వాస్తవానికి 70 మంది మహిళలు డ్రైవింగ్‌కు ఎంపికైనా డ్రైవింగ్ విషయంలో రవాణా శాఖ ప్రమాణాలను 55 మంది మాత్రమే అందుకోగలిగారు. జంట నగరాలలో క్యాబ్ సర్వీసులతో పాటు ద్విచక్ర వాహనా ల ద్వారా ప్రయాణీకులను తరలించే ర్యాపిడో సర్వీసులు అందుబాటులో వున్నా వీరిలో మహిళా రైడర్లు ఎక్కడా కానరారు.

ఢిల్లీ సహా పలు న గరాలలో క్యాబ్‌లతో పాటు ర్యాపిడోలలో మహిళా డ్రైవర్లు పెద్ద సంఖ్యలో వుండడం గమనార్హం. జంట నగరాలలో మహిళా డ్రైవర్లున్న క్యాబ్ స ర్వీసులు లేవని చెప్పాలి. అయితే పోలీసు శాఖ అమలు చేసిన స్త్రీ రైడ్‌తో ఈ కొరత తీరిందని చెప్పాలి. ర్యాపిడో సర్వీసులో ఇక ముందు మహి ళా రైడర్లు రానున్నారు. ఒంటరి ప్రయాణం సాగించే మహిళలు, విధులకు వెళ్లే మహిళలకు వీరి రాక మంచిదని డబ్ల్యుఎస్‌డబ్ల్యు అధికారులు చె బుతున్నారు.

మహిళా డ్రైవర్లున్న వాహనాలలో మహిళల ప్రయాణం మరింత సాఫీగా సాగుతుందని వారంటున్నారు. మొదటి విడతగా 50 మంది మహిళా టూ వీలర్ రైడర్లు రాగా త్వరలో వీరి సంఖ్య మరింత పెరుగుతుందని వారంటున్నారు. మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ సంస్థల తో పాటు ప్రైవేటు సంస్థల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో వారి భద్రతకు సర్కారుతో పాటు ఆయా సంస్థలు చర్యలు తీసుకు ంటున్నా ప్రయాణాల సమయంలో వారి భద్రత అనేకమార్లు ఇబ్బందిరంగా మారుతోంది. స్త్రీ రైడ్ పథకం ఈ సమస్యను తీరుస్తుందని డబ్ల్యు ఎస్‌డబ్ల్యు అధికారులంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు సర్కారు నిర్ణయించింది. ముందుగా అ వసరం వున్న పట్టణ ప్రాంతాలలో అమలు చేసి, ఆ తరువాత ఇతర ప్రాంతాలకు విస్తరించాలని సర్కారు నిర్ణయంగా కనిపిస్తోంది.

## ప్రతి రోజూ 5 నిమిషాలు యోగా, మెడిటేషన్

### నిరంతరం గేమ్స్, స్పోర్ట్స్ నిర్వహించాలి

### ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినం

### 227 పనిదినాలతో 2026-27 అకడమిక్ క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రతి రోజూ పాఠశాలలో 5 నిమిషాలపాటు యోగా, మెడిటేషన్‌ను చేయించాలని, ఉదయం ప్రార్థనా సమయంలో గానీ లేదంటే క్లాస్ రూమ్‌లో గానీ అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. అలాగే ప్రతి రోజూ గేమ్స్, స్పోర్ట్స్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. 227 రోజులతో 2026-27 విద్యా సంవత్సరం కొనసాగనుంది. జూన్ 15న ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరం ఏప్రిల్ 24, 2027తో ముగియనుంది. 51 రోజుల వేసవి సెలవుల అనంతరం జూన్ 14, 2027లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన 2026-27 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. 10వ తరగతి విద్యార్థులకు జనవరి 10లోపు సిలబస్‌ను పూర్తి చేయాలని, 1 నుంచి 9 తరగతులకు ఫిబ్రవరి 28 లోగా సిలబస్ పూర్తి చేయాలంది. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు 13 రోజులపాటు కొనసాగనున్నాయి. సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు 5 రోజులుంటాయని తెలిపింది. ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినంగా, ఏప్రిల్ 24 నుంచి జూన్ 13, 2027 వరకు సమ్మర్ హాలిడేస్ ఉంటాయని అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ)-1ను జూలై 31 లోపు, ఎఫ్‌ఏ-2ను సెప్టెంబర్ 21 లోపు, సమ్మేటీవ్-1 పరీక్షలను అక్టోబర్ 1 నుంచి 9 వరకు, ఎఫ్‌ఏ-3ను డిసెంబర్ 10 లోపు, ఎఫ్‌ఏ-4ను 10వ తరగతి వారికి జనవరి 27 లోపు, 1 నుంచి 9వ తరగతుల వారికి ఫిబ్రవరి 15 లోపు నిర్వహించాలి. 10వ తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 28 లోపు నిర్వహించాలని ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలను మార్చి 2027లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఎస్ఏ-2 పరీక్షలను 1 నుంచి 9వ తరగతుల వారికి ఏప్రిల్ 9 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు, క్రిస్మస్ సెలవులు మిషనరీ పాఠశాలలకు డిసెంబర్ 23 నుంచి 27 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు ఉంటాయని ప్రకటించింది. జూన్‌లో 14 రోజులు, జులైలో 26, ఆగస్టులో 22, సెప్టెంబర్‌లో 23, అక్టోబర్‌లో 15, నవంబర్‌లో 23, డిసెంబర్‌లో 24, జనవరిలో 20, ఫిబ్రవరిలో 23, మార్చిలో 21, ఏప్రిల్‌లో 16 రోజులు కలిపి మొత్తం 227 పనిదినాలతో 2026-27 విద్యా సంవత్సర అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి మూడో శనివారాన్ని నో బ్యాగ్ డేగా అమలు చేయాలని నిర్ణయించారు. 10 మూడో శనివారాలను అమలు చేయాలని సూచించారు. ప్రతి రోజూ 30 నిమిషాలు పఠనానికి కేటాయించాలి. అందులో పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, వార్తాపత్రిక, మ్యాగజైన్ మొదలైనవి చదివించాలి. దీనిని ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ స్వయంగా పర్యవేక్షించాలి.

# ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కేపిటల్‌గా హైదరాబాద్

### ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ విదేశీయులకు వైద్యసేవలు

### ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కాపిటల్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్రభుత్వ హాస్పిటల్స్ లోనూ విదేశీయులకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకుప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమి, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీరప్పలను నియమించింది.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అమలుకు సంబంధించిన వివిధ అంశాలను కమిటీ పరిశీలించనుంది. సనత్‌నగర్ టిమ్స్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్ ఏర్పాటుపై అధ్యయనం చేయడంతోపాటు, విదేశీ రోగులకు అందించే వైద్య సేవలు, వాటికి తగిన ప్యాకేజీలు, ధరల విధానాన్ని సూచించనుంది. భాషా అనువాద సేవలు, పేషెంట్లకు అందించే ఆహారం తదితర అంశాలపై కమిటీ సిఫార్సులు చేయనుంది. తెలంగాణ మెడికల్ అండ్ వెల్‌నెస్ టూరిజం ప్రమోషన్ బోర్డుతో సమన్వయం చేస్తూ ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన ప్రచార, మార్కెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై కూడా కమిటీ సూచనలు చేయనుంది. నెలరోజుల్లో కమిటీ తన నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# పాలిసెట్ మొదటి విడతలో 25,137 సీట్ల కేటాయింపు

### మొత్తం సీట్లలో 77 శాతం కేటాయించిన అధికారులు

### సీటు పొందిన విద్యార్థులు 9 లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో మొదటి విడత సీట్ల కేటాయింపు చేశారు. మొదటి విడతలో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 25,137 సీట్లను కేటాయించినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2026 ఫలితాలు వెలువడిన తరువాత మే 27 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను మొదటు పెట్టారు. పాలిసెట్‌లో 81,307 మంది అర్హత సాధించగా.. వారిలో 29,229 మంది మొదటి విడతలో సీట్ల కోసం వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం 7,11,823 ఆప్షన్లను విద్యార్థులిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 25,137 మంది సీట్ల కేటాయింపు చేశారు. 112 ప్రభుత్వ, పాలిటెక్నిక్ కాలేజీల్లో 32,813 సీట్లు 2026-27 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్నాయి. 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,284 సీట్లు ఉండగా వాటిలో మొదటి విడతలో 16,777 సీట్లను కేటాయించారు. మరో 1507 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్త సీట్లలో 92 శాతం సీట్లను మొదటి విడతలోనే కేటాయించారు. 53 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,529 సీట్లు ఉండగా వాటిలో 8360 సీట్లను కేటాయించారు. మరో 6169 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

మొత్తం సీట్లలో 58 శాతం సీట్లనే మొదటి విడతలో కేటాయించారు. రాష్ట్రంలోని 112 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 32,813 సీట్లకు గానూ 25,137 సీట్లను కేటాయించారు. మరో 7676 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో మొదటి విడతలో 77 శాతం సీట్లను కేటాయించారు. 802 ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను కేటాయించారు.

సీట్లు పొందిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, ఈ నెల 8, 9 తేదిల్లో ఆయా కాలేజీల్లో నేరుగా చేరాలని సూచించారు. కాలేజీల్లో 9లోపుగా చేరకపోతే విద్యార్థి పొందిన సీట్లు రద్దవుతుందని సాంకేతిక విద్య కమిషనర్ ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లామా కోర్సుల్లో చేరేందుకు పాలిసెట్-2026 కౌన్సెలింగ్‌ను మే 27 నుంచి 31 వరకు నిర్వహించారు. ఆయా తేదిల్లో విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. మే 29 నుంచి జూన్ 1 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించగా, మే 29 నుంచి జూన్ 3 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆదివారం సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు 9 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 15న ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో భాగంగా స్లాట్ బుకింగ్‌కి అవకాశం కల్పించారు. జూన్ 16, 17 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. జూన్ 20న సీట్ల కేటాయింపు చేస్తారు.

జూన్ 20 నుంచి 22 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. జూన్ 22, 23 తేదిల్లో కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి. జూన్ 24న విద్యార్థులు కాలేజీల్లో అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూలై 1న స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయనున్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 5 కొత్త కోర్సులను ప్రారంభించారు. కొత్త కోర్సుల్లో అదనంగా 2220 సీట్లను భర్తీ చేయనున్నారు.

వార్త

నిలబడి గడగడా మాట్లాడేందుకే కాదు,
కూర్చొని వినేందుకూ ధైర్యం కావాలి.
- క్వింటన్

# 'హిట్' సరిపోతుందా?

పొద్దుట లేస్తే ఏ ఇల్లాలూ వంటింట్లో బొద్దింకను సందర్శించకుండా బయటకు వస్తున్నారంటే నమ్మలేం. తాజాగా కాక్రోచ్ జనతాపార్టీ 'జెన్‌జీ' ఉద్యమాన్ని నడిపిస్తుండడంతో ఇండియాలోగానీ, వేరే ఏ ఇతర దేశంలో కానీ 'బొద్దింక' లేని చర్చోపచర్చలు సాగే పరిస్థితి లేదు. 'కాక్రోచ్' పేరెత్తకుండా నడిచే పరిస్థితి లేదు. ఇతర దేశాల్లో 'జెన్‌జి' ఉద్యమం తారాస్థాయికి వెళ్లి ప్రభుత్వాలను మార్చేసిన యువతలోని అసమ్మతితో భారతదేశంలో 'కాక్రోచ్' ఉద్యమంగా వెల్లువెత్తుతున్న ఉద్యమం ఉనికిని కాదనే పరిస్థితి లేదు. ఈ భూమ్మీద బొద్దింకలెన్ని ఉన్నాయంటే అసంఖ్యాకమనే చెప్పాలి. అలాగే 'కాక్రోచ్' పేరు ఎలా పుట్టినా, ఎవరు నామకరణం చేసినా, ఎవరు ఉద్యమించాలని సంకల్పించినా ఆ ఉద్యమంలో పాల్గొనే ఉద్యమకారుల సంఖ్య కూడా అసంఖ్యాకమే. ఇప్పుడు 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందిన శనివారం పెద్దఎత్తున న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పోలీసుల అనుమతితో బహిరంగ ప్రదర్శనకు కూడా అనుమతి పొందగలిగారంటే దానికి కారణం అనూహ్య జనాదరణ పొందబట్టేనని అర్థమవుతోంది. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే అనే వ్యక్తి అమెరికాలో ఉద్యోగి. భారత దేశంలో ఏవైనా తామరతంపరగా వెలుస్తుంటే వాటిని అక్కడికక్కడే అశేషంగా పుట్టుకొచ్చే పుట్టగొడుగుల్ని గుర్తుకు తెచ్చుకోవడం పరిపాటి. ఏమైతేనేం అమాయక నిరుద్యోగుల్లో కాస్త చైతన్యం పెల్లు బికింది. నిజానికి దేశ నిరుద్యోగుల్లో ఉపాధి ఉద్యోగాల్లేక, అధికారం ఎవరి చేతుల్లో ఉన్నా తమ బతుకులిం తేననే నిరాశానిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారే ఇప్పుడు ఈ దేశ సుభిక్షానికే తామున్నట్లు ఎలుగెత్తుతూ ఈ 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతుగా కదలివస్తున్నారు. న్యూఢిల్లీ వీధుల్లో యువత దాదాపు కదం తొక్కినట్లే ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. యువత ఆకాంక్షలను ప్రతిఘటించడం మంచిది కాదనే ధోరణిలో ప్రభుత్వం కూడా ఎక్కడా యువతను నిరోధించే ప్రయత్నం చేయలేదు సరికదా సెంట్రల్ ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాము శాంతియుతంగానే జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం చేపడతామని నిర్వా హకులు ప్రకటించినప్పటికీ ఉద్యమాలు తప్పుదారి పట్టి వ్యతిరేకుల చేతిలో ఆటబొమ్మలుగా మిగలకూడదనేభావనతో, ఎలాంటి అవాంఛనీయ ధోరణులు ప్రబల కుండా నిఘా మాటున ఉద్యమ పర్యవసానాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. యువతరం గళమెత్తితే ప్రభు త్వాలు కూకటివేళ్లతో కదలిపోతాయి. నవతరం మార్పు దిశగా పయనిస్తుంది. ఎంతో సున్నితమైన అంశం ఇప్పు డు తెరపైకి వచ్చింది. యువతలో గూడుకట్టుకున్న నిరాశ ఒక్కసారిగా పెల్లుబికే సమయం ఆసన్నమైంది. ఆగ్రహావేశాలు నివురుగప్పిన నిప్పులైతే ఇక చేసేదేముంది. అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. 'కాక్రోచ్' ఏ పాటిదైనా సైబర్ ప్రపంచపు ఛాయల్లోనే పుట్టిందని చెప్పకతప్పదు. కేంద్ర ప్రభుత్వ పాలనలో ఎన్ని వర్గాలు ఏయే సందర్భాల్లో నిరసన గళమెత్తినా, ఈసారి నిరుద్యోగులు ఏకమైతే దేశమేగతి మారుతుందో అంచనా వేసుకుంటూముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలో ఒకపక్క అవినీతి, లంచగొండి తనం పెరిగిపోయాయి. ఏ రంగానికీ మినహాయింపు లేదు. ఏలిన వారికి తమ ముందున్న అష్టదరిద్రాలను కడుపులో పెట్టుకుని కాపాడుకోవడం తప్పలేదు. దేశరాజధాని నగరంలోనూ మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శతాధిక బిలియన్ల నిరుద్యోగుల తిరుగుబాటు ఈ దేశానికి మంచిది కాదు. వారిలోని అసంతృప్తిని, తిరుగుబాటును నిరోధించడం కన్నా వారికి ఉపాధి, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై దృష్టిసారించడం కేంద్రానికి శిరోధార్యం కావాలి. ఈ మధ్య వెలువడిన 'నీట్' పరీక్షల్లో ప్రశ్నాపత్రాల వెల్లడి వంటి అన్ని అంశాలపై ప్రశ్నించబోయిన సిజెపి తెగువను అభినందించాల్సిందే. గతంలో నేపాల్, బంగ్లాదేశ్‌లలో 'జెన్‌జి' ఉద్యమాలు సఫలీకృతమయ్యాయి. కాగా ఈ ఉద్యమ పర్యవసానంగా ఏర్పడిన ప్రభుత్వాలు వాటినినడిపే ప్రభుత్వాల నిర్వాకాలు చర్చించదగినవే. వెల్లువెత్తిన ఉద్యమాల నేపథ్యంలో 'పాలనలో మార్పు' ఒక్కటే పరిష్కారంచూపదు. పాలించే తీరులోని మార్పుతోనే సత్ఫలితాలు సాధించగలుగుతాయి. ఇటీవల విద్యార్థుల అభిశంసనకు గురైన 'నీట్' విద్యావ్యవస్థను ప్రక్షాళన కోరుతూ ఆన్‌లైన్‌లో సిజెపి పెట్టిన వినతిపత్రంలో 8 లక్షలకుపైగా డిజిటల్ సంతకాలు వచ్చి చేరాయి. 'జెన్-జడ్' తరం పరిధిని దాటిపోయిన ఈ ఉద్యమానికి ప్రసిద్ధ సామాజిక కార్యకర్త సోనమ్‌వాంగ్ చుక్ వంటి వారి మద్దతు లభిస్తోంది. మరెందరు క్యూలో ఉన్నారో ఉంటారో. దేశంలో విద్యా వ్యవస్థకు పట్టిన దుర్దశను ఎత్తి ప్రశ్నించడానికేనా అన్నట్లు తాజా 'కాక్రోచ్' ఉద్యమ స్వరూపం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుత డిమాండ్ 'నీట్‌పరీక్షా నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 'జెన్ జీ'ల తొలిఅడుగు పడినప్పటికీ మలి అడుగు, మరో ఉధృతరూపానికి అవకాశమివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన బాధ్యత కేంద్రం తీసుకోవాలి. అత్యున్నత విద్యా ప్రవేశాల పరీక్షల పేపర్ లీక్, డేటా లీక్‌తో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన కోరుకోవడం సబబే! ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సిందే.

రెండు వర్గాల మధ్య పోరాటం
జయాపజయాలకు దారి తీస్తుంది.
ఒకే వర్గం మధ్య పోరాటం ఆ వర్గ
నాశనానికి దారితీస్తుంది.



బిఆర్ అంబేద్కర్

వివేకవంతులతో గడిపిన
సమయం మెరుగైనదైనట్లే,
మంచి పుస్తకాలతో గడిపిన
వయసు మెరుగైనదవుతుంది.



జాకబ్ బ్రౌనోవిస్కీ

## ప్రజావాక్కు

### ఆర్థిక నిబంధనలకు విరుద్ధం

నోటిఫికేషన్ పడటం, పరీక్ష రాయడం, చివరికి సెలెక్ట్ అవ్వడం ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికి తీసుకుని డ్యూటీలో చేరి జాయినింగ్ రిపోర్ట్ మీద సంతకం చేయడం మరో ఎత్తు. ఆ సంతకం పెట్టే వరకు వారు కేవలం 'అభ్యర్థులు' మాత్రమే, 'ఉద్యోగులు' కారు. అసలుసిస్టమ్‌లో ఉద్యోగిగా ఎంటర్ అవ్వకముందే, వారికి ఆ ఉద్యోగ సంబంధిత హక్కులు (పాత పెన్షన్) వర్తిస్తాయని చెప్పడం పాలనాపరంగా కరెక్ట్ కాదు. కట్ ఆఫ్ తేదీకి ఉన్న విలువప్రభుత్వం ఒక విధానాన్ని మార్చినప్పుడు ఒక స్పష్టమైన కట్‌ఆఫ్ తేదీని ప్రకటిస్తుంది. ఆ తేదీ నాటికి ఎవరైతే ఉద్యోగంలో ఉన్నారో వారికి పాత రూల్, ఆతర్వాత జాయిన్‌అయ్యే వారికి కొత్త రూల్ అని చట్టంచేసిన తర్వాత, 'మాకు నోటిఫికేషన్‌ముందే ఇచ్చారు కదా' అని మినహాయింపులు ఇస్తూ పోతే.. అసలు ఆ కట్‌ఆఫ్ తేదీకి, ప్రభుత్వ విధానాలకు అర్థమే లేకుండా పోతుంది. ఖాతా కూడాతెరవడానికి వీల్లేని సమయంలోని సర్వీసును ప్రామాణికంగా తీసుకుని ఓల్డ్ పెన్షన్ లెక్కించడం ఆర్థిక నిబంధనల ప్రకారం చాలా విరుద్ధం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### యువతకు అవకాశం కల్పించాలి

ఎన్నికల షెడ్యూల్‌వెలువడటమే తరువాయి పోటీ చేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కాకా పడుతూ వారిచుట్టుతిరిగేవారు ఇలాంటి రాజకీయ నాయకులు ఈరోజుల్లో చాలామంది ఉన్నారు. వీరు వయసులో చిన్న వారు కారు, చట్టసభలకు ఎన్నిక అవని వారూ కాదు. సీనియర్లు ఎంతో కాలంగా పార్టీకి సేవ చేస్తున్న వారు కదా అని అధిష్టానం వీరికి ఎన్నో సార్లు అవకాశం ఇచ్చింది. అయినా వీరికి తృప్తి ఉండటం లేదు. ఒక్కసారి కూడా అవకాశం రాని వారికి టికెట్ ఇవ్వాలి.

- కె.రామరాజు, హైదరాబాద్

### ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఎలిమెంటరీను హైస్కూల్ నుండి వేరుచేయడం, ఇంటర్మీడియట్ విద్యను హైస్కూల్ ప్లస్‌గామార్చడం ఆహ్వానించదగ్గ మార్పు. విద్యాశాఖ సీనియర్లకు జూనియర్ల కంటే తక్కువ వేతనం రావడానికి ప్రధాన కారణం అన్వేషించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పింది. అప్రెంటిస్ కాలం పూర్తిచేసిన నేపథ్యంలో ఇవ్వబడిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వారు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి అమలు చేయాలి.

- బి. మేఘనాథం, విజయనగరం

### భారత్‌లో గోప్యత ఎక్కడ?

డిజిటల్ యుగంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా మారిపోతున్నది. నగదు లావాదేవీల స్థానంలో డిజిటల్ చెల్లింపులు ప్రాముఖ్యత పొందుతున్నాయి. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు సాధారణ ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వ నజర్ పెరగడం సహజమే. అయితే ఇది ప్రజల ప్రయోజనాలకు ఎంతవరకు అనుకూలం? లేదా వ్యక్తిగత గోప్యతకు ముప్పుకలిగించే అంశమా? అనే ప్రశ్నలు ప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారాయి. మొదటగా, ప్రభుత్వ నజర్ వెనుక ఉన్న ఉద్దేశాన్నిపరిశీలిస్తే, ఆర్థిక పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. డిజిటల్ లావాదేవీలు ట్రాక్ చేయగలిగినవిగా ఉండటంవల్ల నల్లధనం నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది. పన్ను ఎగవేతను తగ్గించడంలోకూడాఇది కీలకపాత్ర పోషిస్తుంది. డిజిటల్ లావాదేవీలు దేశ అభివృద్ధికి కీలకంగా మారిన ఈ కాలంలో, వాటిపై ప్రభుత్వ నజర్ అనివార్యం. అయితే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా, వారి గోప్యతను కాపాడే విధంగా ఉండాలి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

### పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈ మధ్య సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. రూ. మూడువందల కోట్ల గ్లోబల్ సైబర్ ఫ్రాడ్ సిండికేట్ గుట్టురట్టు కావడం సంచలనం సృష్టించింది. ఈ నేరగాళ్ల ఎంతటి సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారు. ఈనేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిప్రజలను వంచించారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈ మాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోయారు. ఇటువంటి దోపిడీలను అరికట్టడానికి వ్యవస్థలో మార్పులు రావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆక్రమణలను సుమోటోగా స్వీకరించాలి

ఆంధ్ర రాష్ట్రంలో దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నారు. హైకోర్టు వారు ఈ ఆక్రమణలను కూడా సుమోటోగా స్వీకరించి కూల్చివేసేందుకు ఆదేశాలు ఇవ్వాలి. దాదాపు 25 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాములను తన్ని తరమి వేయాల్సిన అధికారులు, దొంగబాబాల ప్రలోభాలకు, వత్తిళ్లకు లొంగిపోయారు.

-ఎన్.వేంకటేశ్, ప్రకాశంజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పిడుగు పడితే మరణ ఘంటికలే!

**అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడుగులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్ల ద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణువిద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు.**

డి. చంద్రభాను

ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కురిసిన అకాల వర్షాలు ఊహించని రీతిలో పిడుగుల బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. పొలాల్లో కష్టపడుతూ, చెట్ల కింద తలదాచుకున్న రైతులు, కూలీలు పిడుగుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు వందలాది మూగజీవాలు, పాడి పశువులు కూడా అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లాలో చెట్టు కింద నిలబడిన మహిళా కూలీలు, తెలంగాణలో పొలాలకు వెళ్లిన గొర్రెల కాపరులు, కాడెద్దులు ఇలా పిడుగుపాటుకు బలవుతున్న ఘటనలు ప్రకృతి తీవ్రతను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం వర్షాకాలంలో మాత్రమే వినిపించే ఉరుములు, ఇప్పుడు నడివేసవిలోనే పల్లెలపై మృత్యు గంటల్లా మోగుతున్నాయి. నేడు ఆకాశం నల్లబడితేనే ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఈ పరిస్థితిని కేవలం ప్రకృతి సహజ ప్రక్రియగా భావించి పక్కన పెట్టలేం. ఈ ప్రకృతి హెచ్చరికల వెనుక మానవ తప్పిదాల పాత్ర ఎంత ఉందన్న ప్రశ్నను కూడా సమాజం ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది. పిడుగులు ఏర్పడటానికి ప్రధాన కారణం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చెరువులు, నదులు, నేలలోని తేమ వేడెక్కి నీటి ఆవిరిగా మారుతుంది. ఈవేడి గాలి వేగంగా పైకి ఎగసి, ఎత్తులో ఉన్న చల్లనిగాలిని తాకినప్పుడు భారీ క్యూములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. ఈ మేఘాల లోపల నీటి బిందువులు, మంచు కణాలు బలమైన గాలుల ప్రభావంతో ఒకదానికొకటి ఢీకొంటుంటాయి. దాంతో విద్యుత్ శక్తి ఏర్పడుతుంది. అది ఒక దశలో ఒక్కసారిగా మేఘాల నుంచి భూమివైపు విడుదలవుతుంది. అదే పిడుగుపాటు. వాతావరణంలో వేడి ఎంత ఎక్కువగా ఉంటే ఈ ప్రక్రియ అంత తీవ్రంగా జరిగే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితి ఎంత ఆందోళనకరంగా మారిందో ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ మే 2026లో విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలోప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన మొత్తం మరణాల్లో 35.7 శాతం మరణాలు పిడుగుల వల్లే నమోదయ్యాయి. 2024లో దేశ వ్యాప్తంగా పిడుగుపాటు కారణంగా 2,825 మంది మరణించారు. ఇది అంతకు ముందటి ఏడాదితో పోలిస్తే 10.4 శాతం ఎక్కువ. మధ్యప్రదేశ్ (577), బీహార్ (360), ఉత్తర ప్రదేశ్ (275), ఒడిశా (249), ఛత్తీస్‌గఢ్ (241) రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం సగటున 86నుంచి 95 మంది, తెలంగాణలో కూడా దాదాపు అదే స్థాయిలో ప్రజలు పిడుగుల బారిన పడుతున్నారు. భూతాపం కారణంగా ప్రతి ఒక డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు పిడుగుల తీవ్రత 8 నుంచి 10 శాతం వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ మరణాల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల వారే కావడం మరింత ఆందోళన కలిగించే విషయం. పిడుగులు పెరగడానికి కేవలం ప్రకృతినే నిందించలేం. దీని వెనుక మనుషుల పాత్ర కూడా స్పష్టం



గా కనిపిస్తోంది. అడవులను విచ్చలవిడిగా నరికివేయడం, పట్టణాలు విస్తరించడం వల్ల పచ్చదనం తగ్గి భూమి నేరుగా సూర్యరశ్మిని గ్రహించి మరింత వేడెక్కుతోంది. దాంతో పిడుగులకు కారణమయ్యే మేఘాలు చాలా వేగంగా తయారవుతున్నాయి. ఇదే కాకుండా వాహనాలు, పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య వాయువులు, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్నాయి. ఇవి మేఘాల్లో చేరినప్పుడు మంచు కణాల మధ్య ఘర్షణ మరింత పెరుగుతుంది. అంటే మనమే సృష్టిస్తున్న కాలుష్యం మేఘాలను ప్రమాదకర విద్యుత్ కేంద్రాలుగా మార్చేస్తోంది. పర్యావరణాన్ని పాడు చేస్తూ తీసుకునే ప్రతి తప్పు నిర్ణయం ఇప్పుడు పిడుగు రూపంలో మనముందుకు వస్తోంది. పిడుగుల నుంచి ప్రజలను, ముఖ్యంగా రైతులను కాపాడేందుకు మన దేశం ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధస్సును సమర్థంగా ఉపయోగిస్తోంది. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన 'దామిని' మొబైల్ యాప్ ఫోన్ జీపీఎస్ ఆధారంగా పనిచేస్తుంది. మనం ఉన్న ప్రాంతానికి 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో వచ్చే 40 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉందేమో ముందుగానే హెచ్చరిస్తుంది. అంతేకాకుండా పుణేలోని వాతావరణ పరిశోధన సంస్థ దేశవ్యాప్తంగా వందలాది మెరుపు గుర్తింపు పరికరాలను ఏర్పాటు చేసింది. ఇన్‌శాట్3డి, ఇన్‌శాట్ 3 డిఆర్ ఉపగ్రహాలు, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని డాప్లర్ రాడార్లు మేఘాల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. ఐఐటీ సంస్థలు కూడా పిడుగులను ముందే అంచనా వేసే కొత్త సాఫ్ట్‌వేర్‌లను తయారు చేస్తున్నాయి. అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడుగులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్లద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణు విద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు. పిడుగులు ఎక్కువగా ఎత్తైన వస్తువులపైనే పడతాయి. కాబట్టి ఉరుములు వచ్చినప్పుడు చెట్లకింద నిలబడటం చాలాప్రమాదకరం. బయట బహిరంగ ప్రదేశంలో ఉన్నప్పుడు పిడుగు పడే పరిస్థితిఉంటే నేలపై పూర్తిగా పడుకోకుండా, మోకాళ్లపై వంగి తలను కిందికి పెట్టుకుని కూర్చోవాలి. అలాగే ఉరుములు వచ్చినప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, టీవీలు, ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర నిలబడటం చేయకూడదు. ఇనుప వస్తువులు, పంపుల దగ్గర కూడా ఉండకూడదు. పిడుగుపాటు అనేది కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రకృతి మనకు ఇస్తున్న గట్టి హెచ్చరిక కూడా. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలపరచడం, గ్రామాల్లో ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించడం ఎంత అవసరమో భూతాపాన్ని, వాయు కాలుష్యాన్ని తగ్గించడం కూడా అంతే అవసరం. మానవ ప్రాణాల రక్షణేలక్ష్యంగా పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చినప్పుడే ఆకాశం నుంచి వచ్చే ఈ ప్రమాదం నుంచి మన సమాజాన్ని కాపాడుకోగలం. ●

# ఉపాధ్యాయుల్లో 'టెట్' గందరగోళం

నల్ల రవి కుమార్

భారతదేశ పాఠశాల విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాల పెంపుదల కోసం ఉద్దేశించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రస్తుతం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులలో తీవ్ర ఆందోళనకు, చర్చకు దారితీసింది. ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు 'సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టెట్ పాస్‌కావాల్సిందే' అని స్పష్టంచేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ2009)లోని సెక్షన్ 23(1) ప్రకారం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు కనీస అర్హతలు ఉండాలని నిర్దేశించారు. దీనిని అనుసరించి జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఆగస్టు23, 2010న ఉపాధ్యాయ నియామకాలకు 'టెట్'ను తప్పనిసరి చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, చట్టం అమలులోకి రాకముందు, అనగా 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటనే దానిపై సుదీర్ఘ న్యాయపోరాటం నడిచింది. వివిధ ఉపాధ్యాయ సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని, కాబట్టి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులైనా సరే టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేసింది. కానీ, ఆచరణలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను, విధానపరమైన లోపాలను పరిశీలిస్తే ఈ నిర్ణయంలోను, టెట్ నిర్వహణ తీరులోను అనేక అసంబద్ధతలు స్పష్టమవుతాయి. చట్టాలు సాధారణంగా భవిష్యత్తు నియామకాలకు వర్తిస్తాయి తప్ప వెనుకటి తేదీల నుండి అమలు కావు. ఎప్పుడో పదిహేను నుండి ఇరవై ఐదు ఏళ్ల క్రితం నాటి నిబంధనల ప్రకారం ఎంపికై, ప్రస్తుతం 55 ఏళ్ల వయసులో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను ఇప్పుడు 'టెట్' రాయమనడం, అది కూడా చట్టం రాకముందు చేరినవారికి వర్తింపజేయాలనుకోవడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్న ఉదయిస్తుంది. దశాబ్దాల బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని కేవలం ఒక అర్హత పరీక్షతో కొలవాలనుకోవడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేఅవుతుంది. ఉపాధ్యాయులు తమ దైనందిన బోధనకు సంబంధం లేని సబ్జెక్టులను కూడా టెట్లో భాగంగా రాయాల్సి రావడం మరో విడ్డూరం. ఇది బోధనా ప్రమాణాల మెరుగుదలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో అర్థం కాని పరిస్థితి. మరో ప్రధాన అసంబద్ధత టెట్ మార్కులకు ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి/డిఎస్‌సి)లో 20వెయిటేజీ ఇవ్వడం. ఉన్నత విద్యా రంగంలో లెక్చరర్ అర్హత కోసం నిర్వహించే నెట్, ఎపి సెట్ వంటి పరీక్షల మార్కులను కేవలం అర్హతగానే పరిగణిస్తారు తప్ప, నియామకాల్లో వాటికి ఎలాంటి వెయిటేజీ ఇవ్వరు. కానీ పాఠశాల విద్యలో మాత్రం టెట్ స్కోరును వెయిటేజీతో ముడిపెట్టడం వల్ల, నిరుద్యోగ అభ్యర్థులు తమ స్కోరును పెంచుకోవడం కోసం ప్రతి ఆరు నెలలకోసారి పరీక్షలు రాస్తూ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక అర్హత పరీక్షను కేవలం స్క్రీనింగ్ టెస్ట్‌గా ఉంచకుండా, ర్యాంకింగ్ నిర్ణయించే సాధనంగా మార్చడం విద్యా విధానంలోని లోపమే. అలాగే, సాధారణంగా ఏ పరీక్షలోనైనా ఉత్తీర్ణత మార్కు35లేదా40గా ఉంటుంది. పోటీ పరీక్షలలో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు, వేర్వేరు కట్‌ఆఫ్ మార్కులుండటం సహజం. కానీ కేవలం ఒక అర్హతపరీక్షకు సామాజిక వర్గాల వారీగా 40,50,60 మార్కులను క్వాలిఫైయింగ్ మార్కులుగా నిర్దేశించడం విచిత్రమైన పరిణామం. అర్హతఅనేది అభ్యర్థి కనీస నైపుణ్యాన్ని సూచిస్తుంది, అందులో ఇలాంటి వ్యత్యాసాలు హేతుబద్ధంగా లేవనే వాదన బలంగా వినిపిస్తోంది. అసలు ఎన్‌సిటిఇ ఏర్పడిన తర్వాతే దేశంలో ఉపాధ్యాయ శిక్షణ ప్రమాణాలు పడిపో యాయనే విమర్శలున్నాయి. నేడు ఉపాధ్యాయ విద్యను బోధించడానికి సరైన అర్హతలు, నైపుణ్యాలున్న అధ్యాపకులే ఆయా ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో లేరు. పునాది స్థాయిలోనే శిక్షణ సరిగాలేనప్పుడు, కేవలం 'టెట్'అనే ఒక పరీక్షనునిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను సాధిస్తామనుకోవడం పూర్తి అసంబద్ధత. వ్యవస్థలోని అసలు లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇప్పుడు'టెట్' అనే అస్త్రాన్ని ఉపాధ్యాయులపై రుద్దడం ఎంతవరకు సమంజసం? ప్రస్తుత గందరగోళాన్ని తొలగించి, ఉపాధ్యాయులలో నెలకొన్న ఆందోళన పోగొట్టడానికి తక్షణమే పరిష్కారమార్గాలను అన్వేషించాల్సి ఉంది. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో చట్ట సవరణ చేసి, 2011కంటే ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులందరికీ ఈ పరీక్ష నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలి. ●

# మానవీయ నదులలో మన యమున



డా పి. జగన్నాథరావు

పుణ్యపరంపరలు కల ఏ నదిని చూసినంత మాత్రానే కోటి జన్మలలో చేసిన పాపాలు శమిస్తాయో అటువంటి నదీమతల్లి యమునానది. **'నమామి సుకృతశ్రేణీం యమునా తరంగిణీమ్ యద్వీక్షణం కోటి జన్మకృత దుష్కర్మశిక్షణమ్?'** బృహస్పతి పుష్కరునిలో కలిసి కర్కాటకంలో ప్రవేశించినది మొదలు 12 రోజులు యమునా నదిలోస్నానం చేసినంత మాత్రము చేతనేఏడుతరాల పాపాలు నశించిపోతాయి. భూమి మీద ఎన్ని తీర్థాలైతే ఉన్నాయో అవన్నీ కూడా యమునా నదిని ఆశ్రయించి ఉంటాయి. బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు, ఋషులు పితృదేవతలు అందరూ యమునా నదియందే నివసిస్తారు. ఈ కాలమునందు చేసిన స్నానము దానము పితృకార్యా లు అన్నీ గంగానదీ దగ్గర చేసిన ఫలిస్తాయి. కోటిరెట్లు ఫలిస్తాయి. ఋగ్వేదంలో గంగానదితో పాటు యమునా నది గురించి కూడా ప్రస్తావన ఉంది. హిమాలయ పర్వ తాల్లో కాళింది పర్వతాల్లో యమునా నది జన్మస్థలం, సఢీ రూపం దాల్చిన సూర్యుడి కుమార్తె కాబట్టి సూర్యతనయ అనే పేరు యమునకుఉంది. కృష్ణుడికి బాల్యమంతా ఈ నది పరివాహక ప్రాంతంలోని సాగింది. భరతుడు, అంబరీషుడు, సంతనుడు మొదలైన చక్రవర్తులు ఈ నది ఒడ్డున ఎన్నో పుణ్యకార్యాలు నిర్వహించారు. భారతీయ సాహిత్యంలో మొట్టమొదట మనకు నదుల ప్రస్తావన వేదాల్లో కనిపిస్తుంది. ఇప్పటివరకుమనకు లభించిన రచనల్లో వేదాలు చాలా పురాతనమైనవి. వాటిలో ఋగ్వేదం మొదటిది. ప్రపంచంలోనే మొదటి సాహిత్య గ్రంథంగా ఋగ్వేదాన్ని భావిస్తారు. ఇది ప్రకృతి వర్ణనలకు రత్నాకరం, ఋగ్వేదంలో నదులకు జన్మస్థానాలైన పర్వతాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చినట్లుగా కనిపించదు, కానీ ఆ పర్వతాల్లో పుట్టిన నదులకు చాలాప్రాముఖ్యతను ఇచ్చి వాటిని దేవతలుగా ఆరాధించి, స్తుతించటం కనిపిస్తుంది. సూర్య, చంద్ర, అగ్ని, మరుత్తు, రాత్రి, పగలు భూమి, ఆకాశం వంటి ప్రకృతి దేవతలతో పాటుగా, నదులను కూడా ఆరాధించి స్తుతించారు. తైత్తిరీయ ఉపనిషత్తు, బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండివాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధలు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని వివరిస్తుంది. యమునానదీ పుష్కరాలు ఆరంభం జూన్ 2 నుండి జూన్ 13వరకు గురుగ్రహం సంవత్సరానికి ఒకసారి 12 రాశులలోకి, ఒక రాశి, నుండి మరో రాశిలోనికి మారినప్పుడల్లా, భారత దేశంలోని ఒక్కొక్క నదికి పుష్కరములు ఏర్పడతాయి. గురుడు కర్కాటకరాశిలో ప్రవేశించినప్పుడు యమునానదికి పుష్కరాలు వస్తాయి. ఆ సమయంలో, ఆ నది సకల తీర్థాలను తనలో నింపుకొంటుంది, అందువల్లే పుష్కర కాలంలో నదులకు మహా మహిమలు కలుగుతాయి అని మన పురాణాలు చెబుతున్నాయి. ఇది హిమవత్పర్వతంలోనే పుట్టింది. మంచు చరియల మధ్య ఇది పుట్టిన చోటుకు 4 మైళ్ళ తర్వాత జమునోత్రి ఆలయం ఉంది. మామూలుగా యమున ఇక్కడ నించి ఉదయించిందనిపేరు. ఇందులో యమునాదేవి విగ్రహం ఉంది. ఇక్కడనించి కదలి



చిన్న చిన్న శైల ప్రవాహాలను కలుపుకుంటూ దాదాపు 80 మైళ్ళు హిమాలయ ప్రాంతంలో ప్రయాణం చేసి ఖారా దాటిమరో 15 మైళ్ళు వెళ్ళి ఫైజాబాదు దగ్గర పెద్దనది అయింది. ఇక్కడినుంచే ఈ నదికి చాలా కాలవలు తీశారు. ఇది ఢిల్లీ, బాగ్పట్, బృందావ, మధుర, మహావన, ఆగ్రా, ఫిరోజాబాద్, ఇటావా, కల్పి, హమీర్పూర్ మొదలైన ప్రసిద్ధ ప్రదే శాల మీదుగా ప్రయాణంచేసి అలహాబాద్ దగ్గర గంగా నదితో కలిసింది. గంగా యమునల మధ్య ప్రయాగ నుంచి హరిద్వార్ దాకా ఉన్న ప్రదేశానికి బ్రహ్మావర్తమని, శశస్థలీ అనీ, అంతర్వేది అనీపేర్లు. యమున కళిందశిఖరం నించి ఉదయించటం చేత దానికి కళిందకన్య లేక కాళింది అని కూడా పేరు. వ్యాసుడు యమునలోని చిన్నద్వీపంలోనే పుట్టాడు. శ్రీకృష్ణుని జననం, విహారం యమునతో సన్నిహితమైనవి. ప్రపంచ దేశాలలో నదులు అక్కడి ప్రజలకు కేవలం భౌతిక జీవనాధారాలుగాపరిగణింపబడుతున్నాయి. కాని భారతదేశంలో అవి సాంస్కృతిక, ధార్మిక జీవనానికి ఆధారాలుగా పరిగణింపబడుతున్నాయి. భారతీయులు మన నదీనదాల మూలోత్పత్తులను, వాని వెనుకగల అధిదైవిక శక్తులను గుర్తించి పరంపరాగతంగా పరమ పవిత్రాలుగాను, తీర్థక్షేత్రాలుగాను, ముక్తిసాధనాలుగాను ఆరాధిస్తూ వచ్చారు.

**"గంగే చ యమునే కృష్ణ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"** అంటూ స్నాన సమయంలో అనేక నదులను నిత్యం స్మరిస్తారు. మన ధర్మంలో దైవచింతన, ఆధ్యాత్మికత, దేశ చింతన, సమాజ చింతన, అఖండ జాతీయతా దృష్టి అన్నీ పెనవేసుకుని వున్నాయి. పూర్ణయాత్ర అంటే ఆధ్యాత్మిక దృష్టి, యావద్దేశసందర్శనమే కదా! నిత్యం అన్ని నదులను స్మరించుకోవాలంటే అర్థం దేశం మొత్తాన్ని అందులోని అణువణువును అందులోని దైవీశక్తి సంపదను స్మరించుకోవాలనేకదా! పవిత్ర నదీనదాల ప్రశస్తి మన ఆధ్యాత్మిక సంపదకు మూలభూతం. తీర్థయాత్రలవలస సమాజంలో ప్రతివారు తమకు చేతనయినంత లోకజ్ఞానాన్ని పొందడానికి అవకాశముంది. ఈపవిత్ర భావాల స్మరణద్వారా ప్రతివాడి భావాలు సంస్కరించబడతాయి. ఆదర్శంగా ప్రవర్తించడానికి కొంత జంకు ఏర్పడుతుంది. రాజు తాను స్వయంగా తీర్థసేవ ఆచరించి ప్రజలకు మార్గదర్శి అయినాడు తనచే పాలింపబడే రాజ్యానికి సరైన న్యాయం చేకూర్చగలుగుతాడు. రాముడు మానవుడు, రాజు. సంపూర్ణ మానవత్వమనేది ఆ జీవితంలో కనిపిస్తుంది. ఆయా సందర్భాలలో రాముడు తన విధులను సామాన్యునివలె నిర్వర్తించాడు నదులవద్ద. అట్లే అర్జునుడు బలరాముడు మున్నగువారు యాత్రల ద్వారా సమాజాన్ని దర్శించి జాతీయ అవగాహన పెంపొందించుకున్నారు. భారతంలో ధర్మపక్షపరులైన ప్రతివారు ఆధ్యాత్మిక జీవితాన్ని పూర్తిగా కొనసాగించకపోయినా కొంతకాలమైన తప్పనిసరిగా దాన్ని ఆచరించి భావసంస్కారాన్ని పొందారు. రాముడు వనవాస సమయంలో భరద్వాజాశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత చిత్రకూట పర్వతం వద్దకు వెళుతూ మధ్యలో గంగా, యమునల సంగమాన్ని చూచాడు. యమునాతీరం నుండి తెప్ప సాయముతో యమునా నదిని దాటాడు. అక్కడ సీతాదేవి యమునానదికి తమవనవాసాన్ని శుభప్రదంగ ముగింపచేయమని ప్రార్థించింది. పట్టాభిషేకానంతరం మధ్యదానం, గోదానం నీ పేర చేయిస్తానని మొక్కింది. యమునానది ఒడ్డునే మాంధాత జన్మస్థలంఉన్నది. గంగా యమునల సంగమంలో వేదాలు అధ్యయనం చేయబడ్డాయి. యజ్ఞాలు అనుష్ఠింపబడ్డాయి. 60కోట్ల పుణ్యతీర్థాలు ఈ సంగమంలో కలిసుంటాయి. ఇందులో స్నానం చేసి రాజసూయ అశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందుతారు. సత్య వాదులౌతారు. గంగా, యమునా నదుల్లో స్నానమాచరించి చతుర్వేద పఠన ఫలాన్ని పొదుతారని భారతంలో ప్రశంసించబడింది. ●



## గర్భిణీల పోషకాహారంలో చచ్చిన పాము

**భోపాల్, జూన్ 7:** మధ్యప్రదేశ్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో అంగన్వాడీ ఆహారంలో చనిపోయిన పాము కనిపించింది. అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భిణీలకు అందించే పోషకాహార లడ్డూ ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం స్థానికంగా కలకలం కలిగించింది. ఈ ఘటన పాండుర జిల్లాలోని కర్వాట్ కమ్మి గ్రామంలో చోటుచేసుకుంది. వచలా బాయి ధుర్వే అనే గర్భిణీ స్త్రీకి అంగన్వాడీ కేంద్రంనుంచి పోషకాహార ప్యాకెట్ అందించారు. ఇంటికితీసుకెళ్లిన తర్వాత కుటుంబీకులు ఆ ప్యాకెట్‌ను తెరిచి చూడగా అందులో చనిపోయిన పాము పిల్ల కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగాషాక్ అయ్యారు. అయితే, ఈ ఆహారాన్ని ఎవరూ తినకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఫుడ్ శాంపిళ్లను పరీక్ష కోసం పంపారు.

## ఎఐ కంపెనీల్లో అమెరికా ప్రజలకు వాటాలు

### డొనాల్డ్‌ట్రంప్ కొత్త వ్యూహాలు

**వాషింగ్టన్,జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలకు సంబంధించి ఒక సంచలన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ప్రముఖ ఎఐ సంస్థలు అమెరికన్ ప్రజలకు తమ కంపెనీల్లో వాటాలను ఇచ్చేలా ఒక సరికొత్త విధానాన్ని తీసుకురావాలని తన బృందం యోచిస్తోందని ఆయన వెల్లడించారు. వచ్చేవారం ఎఐ రంగానికి చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో తాను సమావేశం కానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇది చాలా ఆసక్తికరమైన ఆలోచన. దీనివల్ల ఎఐ కంపెనీలకు, అమెరికా ప్రజలకు మధ్య ఒక మంచి భాగస్వామ్యం ఏర్పడుతుంది. దీనిపై మేము కచ్చితంగా ఆలోచిస్తామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భాగస్వామ్యంపై ముందస్తు చర్చలు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్పుడే కొన్ని ఎఐ కంపెనీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అమెరికా ప్రభుత్వం కొన్ని ప్రముఖ కృత్రిమమేధ సంస్థల షేర్లను కొనుగోలు చేసి, వాటిలో భాగస్వామ్యం తీసుకునే అవకాశం ఉందనే అంశం కూడా ఈ చర్చల్లో వచ్చినట్లు తెలుస్తోంది.

## జ్యూయెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్

### నలుగురు మృతి

**సూరత్, జూన్ 7:** గుజరాత్‌లోని పారిశ్రామిక నగరం సూరత్‌లోని జ్యువెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్ అయి ఓ సూపర్‌వైజర్ సహా నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం అశ్విని కుమార్ రోడ్డు పరిధిలోని జ్యువెలరీ తయారీ ప్రక్రియలో వెలువడే రసాయన వ్యర్థాలను సేకరించేందుకు ఆ ఫ్యాక్టరీ ఆవరణలో ఓ ఈటీపీ సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 2 నెలలకు ఒకసారి ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఎప్పటిలాగే ఇవాళ ఉదయం ఓ సూపర్‌వైజర్, ముగ్గురు కార్మికులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఆ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి వెళ్లింది. ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా లోపలికి జారిపడిపోయాడు. అతడని కాపాడే క్రమంలో మిగిలిన ముగ్గురు కూడా ఒకరి వెనుక ఒకరు ట్యాంక్ లోపలికి దిగారు. ట్యాంక్‌లో అప్పటికే పేరుకుపోయిన రసాయనాల వల్ల తీవ్రమైన విషవాయువులు వెలువడటంతో, ఊపిరాడక నలుగురు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయి ప్రాణాలు విడిచారు.

## మళయాల నటుడు సలీమ్‌కుమార్ కన్నుమూత



**తిరువనంతపురం, జూన్ 7:** మలయాళ చిత్ర పరిశ్రమ అద్భుత మైన నటుణ్ని కోల్పోయింది. మలయాళ సీనియర్ నటుడు, జాతీయ అవార్డు గ్రహీత సలీం కుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, కేరళలోని కొచ్చిలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించి, గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్య వర్గాలు అధికారికంగా వెల్లడించాయి. ఆయన మరణవార్త విన్న సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

# వంటింట్లో గ్యాస్ మంట!

## సిలిండర్ ధర పెంపు

### రూ. 29 పెంచిన ఓఎంసిలు

### పెంపుపై ఖర్గే మండిపాటు

### సమర్థించుకున్న కేంద్రం



**న్యూఢిల్లీ,జూన్ 7:** దేశంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై ఎన్డీయే సర్కారు భారం పెంచుతోంది. గృహిణుల వంటింటి వ్యయాలు పెంచుతూ పోతోంది. ఓవక్క పొదుపు మంత్రం పఠిస్తూనే పెట్రోడీజిల్‌తోపాటు వంటగ్యాస్‌ధరలు కూడా పెంచుతూ వస్తోంది. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకంగా వాడుకుంటున్నదని విపక్షాలు మండిపడుతున్న తరుణంలో తాజాగా రెండోసారి వంటగ్యాస్ ధరలను పెంచింది. దీనివల్ల మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై మరోసారి ధరల మరింత భారం పడింది. గృహావసరాలకు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ. 29 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంచిన ధరలు ఆదివారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా వివిధ నగరాల్లో ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 913 నుంచి రూ. 942కి పెరిగింది. గత మూడు నెలల వ్యవధిలో వంటగ్యాస్ ధరలు పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ముడి చమురు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా భారతదేశానికి గ్యాస్ సరఫరా అయ్యే కీలకమైన హార్మూజ్ జలసంధి మార్గంలో ఏర్పడిన అంతరాయాలు దేశీయ ధరలపై ప్రభావం చూపాయి. ఈ సవరణకు ముందు వరకు చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాలపై సిలిండర్‌కు సుమారు రూ. 703 వరకు నష్టాన్ని భరిస్తూ వచ్చాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ తాజా పెంపు తర్వాత కూడా అంతర్జాతీయ కొనుగోలు ధరకు, దేశీయ విక్రయ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం పూర్తిగా భర్తీ కాలేదని తెలుస్తోంది. గత మార్చి నెలలో కూడా సిలిండర్ ధరను రూ. 60 పెంచిన సంగతి తెలిసిందే. వంటగ్యాస్ మాత్రమే కాకుండా, కొన్ని వారాలుగా ఇతర ఇంధన ధరలు కూడా సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. మేనెల మధ్యస్తం నుంచి ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 7.50 వరకు పెరగ్గా, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సీఎన్జీ ధరలు కిలోకు రూ. 6 వరకు పెరిగాయి. ఇంత పెరిగినప్పటికీ, ఆయిల్ కంపెనీలు ఇంకా పెట్రోల్‌పై లీటరుకు రూ. 11, డీజిల్‌పై రూ. 33.6 చొప్పున నష్టాన్ని భరిస్తున్నట్టు సమాచారం. ఈ వరుస ధరల పెంపు దేశంలోని కోట్ల మంది గృహిణుల నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి రాయితీ జమ అవుతున్నప్పటికీ, రాయితీ లేని సాధారణ వినియోగదారులు మాత్రం ఈ భారాన్ని పూర్తిగా మోయక తప్పడం లేదు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం పైప్డ్ నేచురల్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గులు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతూనే ఉన్నాయి.

**మల్లిఖార్జున్‌ఖర్గే విసుర్లు**

ఎల్జీజీ ధరలు రెండోసారి పెంచడంపై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మండిపడ్డారు. యుపిఎ హయాంలో ఒక్కసారి ధరల సవరణ జరిగితేనే ద్రవ్యోల్బణం కట్టడిచేయలేకపోతోందంటూ వీధుల్లోకి వచ్చిన బిజెపి ఇపుడేమి సమాధానం ఇస్తుందని, పశ్చిమాసియా ఉద్రిక్తతల మాటున సామాన్య మధ్యతరగతిప్రజలపై వంటింటి భారం పెంచుతోందని విమర్శించారు. గడచిన నాలుగు నెలల్లోనే మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్పీజీ సిలిండర్లధరలను రూ.89 రూపాయలు పెంచిందని గుర్తుచేసారు. మోడీజీ పార్లమెంటులో ఇంధన వనరులను 41 దేశాలనుంచి రప్పించుకుంటున్నట్లు పార్లమెంటులోనే చెప్పారని, అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొరత ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. ఉజ్వల స్కీం కింద 5.56 కోట్ల కుటుంబాలకు సింగిల్ సిలిండర్‌కూడా పొందలేకపోయారని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకతను పెంచుకోడానికి వాడుకుంటున్నదని మండిపడ్డారు.

## మెట్రోలో సిఎం డికె శివకుమార్ ప్రయాణం



**బెంగళూరు, జూన్ 7:** కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డికె శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపురలో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డికె శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నన్ను దొడ్డనహళ్లి, శాతనూర్ కనక్‌పుర, బెంగళూరుసౌత్‌లనుంచి విధాన సౌధకు తెచ్చారని, ప్రజలు నన్ను చూడాలనుకుంటున్నారని, నేనే వారికి సమయం ఇవ్వడంలేదని, అందుకు తాను కూడా బాధపడుతున్నానని అన్నారు. అందువల్లనే తనను కలిసేందుకు రావద్దని నేనే వస్తానని చెప్పానన్నారు.

అందుకే నా మొదటి పర్యటనగా నా నియోజకవర్గంలోకి వచ్చానన్నారు. ఎన్నుకున్న ప్రజలకు నాబాధ్యతగా కృతజ్ఞతలు చెప్పాలన్న లక్ష్యంతో వచ్చానన్నారు. ప్రజలను కలుసుకునేందుకు తన నియోజకవర్గంలో 20–25 కేంద్రాలు గుర్తించానని అన్నారు. అంతేకాకుండా ప్రజలను కలిసి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను కూడా వేరుగా నియమిస్తానన్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సిఎం డికె శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సిఎం మొదటి పర్యటన కావడంతో కనకపుర తాలూకాలో ఉదయంనుంచి రాత్రివరకూ ఆదివారం పలు కార్యక్రమాలు ఏర్పాటుచేసారు.

## కోట్ల ఆస్తివివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణం

**న్యూఢిల్లీ,జూన్ 7:** ఆస్తి వివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణమని కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని శివాజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దేవేస్మితా పాల్ అనే మహిళ హత్యకు గురైంది. నగరంలోని వసుంధరా ఎన్‌క్లేవ్‌లోని తన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గత గురువారం హత్యకు గురైంది. ఈమెకు, ఒక దంపతులకు మధ్య ఒక ఫ్లాట్‌కు సంబంధించి వివాదం నడుస్తోంది. దేవోస్మితకు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఒక ఫ్లాట్ ఉంది. అది ఆమె తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చింది. అక్కడ ఆ ఫ్లాట్‌ను వారు దంపతులకు అద్దెకు ఇచ్చారు. కొన్నాళ్లుగా వారు అక్కడ అద్దెకు ఉంటున్నారు. ఆ ఫ్లాట్ బాగా నచ్చిన ఆ దంపతులు దాన్ని కొనాలనుకున్నారు. ఈ విషయం యజామాని అయిన దేవోస్మితకు, ఆమె సోదరులకు చెప్పారు. వారంతా దీనికి అంగీకరించారు. ఆ ఫ్లాట్ అమ్మాలని డిసైడ్ అయ్యారు. అది కోట్ల విలువ ఉంటుంది. ఆ కుటుంబంలో దేవోస్మిత మినహా అందరూ ఫ్లాట్ అమ్మేందుకు అంగీకరించారు. దాన్ని ఎట్టిపరిస్థితుల్లో అమ్మేది లేదని దేవోస్మిత తేల్చి చెప్పింది. తాము ఫ్లాట్ కొనడానికి ఏకైక అడ్డంకిగా ఉన్నదని ఆ దంపతులు దేవోస్మితను హత్య చేశారు. మృతురాలు దేవోస్మిత సోదరి దేవరతి పాల్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి ఫ్లాట్ తలుపులు పగలగొట్టి చూడగా, దేవోస్మిత రక్తపు మడుగులో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి సిసిటివి ఫుటేజీలను పరిశీలించారు. అందులో మాస్కులు ధరించిన ఓ పురుషుడు, స్త్రీ అనుమానాస్పదంగా మెట్లు ఎక్కి ఫ్లాట్ వైపు వెళ్లడం, దాదాపు 30 నిమిషాల తర్వాత దుస్తులు మార్చుకుని బయటకు రావడం రికార్డ్ అయ్యింది. ప్రత్యేక బృందాలు పశ్చిమ బెంగాల్ వెళ్లి నిందితులను అరెస్ట్ చేసి, తదుపరి విచారణ నిమిత్తం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తరలిస్తున్నారు. మాస్కులు ధరించి, లిఫ్ట్ వాడకుండా మెట్లమార్గంలో ఆమె ఫ్లాట్లోకి చేరుకుని, హత్య చేశారు. వారు ఫ్లాట్‌లోకి వెళ్లడం అక్కడి సీసీ కెమెరాలో రికార్డైంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపారు. నిందితులైన దంపతులను గుర్తించి అరెస్టు చేశారు.

## మోడీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా: జిల్ బైడెన్



**వాషింగ్టన్, జూన్ 7:** జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోడీ బహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోడీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్ : ఎ మెమోరియల్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్‌హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు. 2023, జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోడీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు.

విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగరానికి పొదిగించి ధరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్‌లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

## భారత్‌లో పడిపోతున్న జననాల రేటు: ఎలాన్ మస్క్



**న్యూయార్కు, జూన్ 7:** ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సిఇఒ ఎలాన్ మస్క్ భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన పునఃస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఆయన హైలైట్ చేశారు. ఈ అంశంపై మీడియా సంస్థ ఏఎఫ్ పోస్ట్ షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ ఎక్స్ వేదికగా స్పందించారు. భారత్‌లో జననాల రేటురీప్లేస్‌మెంట్ స్థాయి కంటే తగ్గింది. ఉన్నత విద్యావంతుల్లో ఈ రేటు చాలా యేళ్ల క్రితమే పడిపోయిందని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఏఎఫ్ పోస్ట్ నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పిఎ) విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025 కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి, దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది.

జననాల రేటు తగ్గుతున్నప్పటికీ, 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలువంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.



## గల్ఫ్ మిత్ర దేశాల కోసం ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

**వాషింగ్టన్, జూన్ 7:** ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకపోయినా.. అమెరికా–ఇరాన్ మధ్య పోరులో గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణానికి సాయం అందించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది, ఇందుకోసం ఇరాన్ ఆస్తులను వినియోగించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ మిత్రదేశాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒక బృందాన్ని ఆదేశించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు ఇరాన్ ఆస్తులను ఉపయోగించడాన్ని వారు పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ఈ ఆస్తులను భవిష్యత్తు పునర్నిర్మాణం, మరమ్మతుల కోసమే కాకుండా.. ఇప్పటికే భాగస్వాములకు జరిగిన నష్టానికి పరిహారంగా అందించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. అయితే, ఇరాన్‌కు చెందిన ఏ ఆస్తులను పరిగణనలోకి తీసుకున్నారనే విషయాన్ని స్పష్టం చేయలేదు.



## అభిలాషా బరాక్‌కు యుఎన్ అవార్డుపై ప్రధాని మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ,జూన్ 7:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మేజర్ అభిలాషా బరాక్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి అందించే యూఎన్ మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఆమె ఎంపిక కావడం పట్ల ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం మేజర్ బరాక్ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక బలగాలలో ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా, జెండర్ ఫోకల్ పాయింట్‌గా తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆమెకు దక్కిన ఈ గౌరవం ఆమె అసాధారణ సేవలకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఈ అవార్డు మేజర్ బరాక్ ప్రతిభను గుర్తించడంతో పాటు, ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దేశాల్లో భారతదేశం సుదీర్ఘకాలంగా అందిస్తున్న సహకారానికి దక్కిన గొప్ప గుర్తింపు అని ప్రధాని మోడీ కొనియాడారు. దేశానికి, మానవాళికి సేవ చేయాలనుకునే కోట్లాది మంది యువ భారతీయులకు, ముఖ్యంగా భారతీయ కుమార్తెలకు (మహిళలకు) ఆమె సాధించిన ఈ విజయం ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రధాని తన సందేశంలో ఆకాంక్షించారు.



## ఇది ట్రైలర్ మాత్రమే!

### కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాల్సిందే

### లేదంటే దేశవ్యాప్త ఉద్యమం: కాక్రోచ్ పార్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ,జూన్ 7:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఏడు రోజుల్లోగా మంత్రి తన పదవి నుంచి తప్పుకోవాలని, లేదంటే దేశవ్యాప్తంగా నిరసనలను ఉధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందురోజు జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో తాము చేపట్టిన శాంతియుత నిరసన ఒక చరిత్ర అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. 'బొద్దింకలు' ఏకమైతే ఏం చేయగలవో ప్రభుత్వానికి మేం చూపించిన ట్రైలర్ ఇది. నిన్నటి నిరసనలో పాల్గొన్న వారిలో చాలామందికి అదే తొలిసారి. అయినా, విద్యావ్యవస్థపై తమకున్న తీవ్రమైన కోపాన్ని, నిరాశను వ్యక్తం చేయడానికి వారు ధైర్యంగా ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా నిరసనలో పాల్గొన్న యువత, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. శాంతియుత నిరసనే మన గొప్ప బలం. ఐక్యంగా ఉన్న శాంతియుత ఉద్యమాన్ని ప్రభుత్వం ఏమీ చేయలేదు. మనం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ఒక తరానికి అన్యాయం చేశారని ఆరోపించిన ఆయన, ఈ విషయం ఇక్కడితో ముగిసిపోదని స్పష్టంచేశారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈరోజు ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో మాట్లాడతానని ఆయన తన అనుచరులకు సూచించారు.

## విదేశాల్లో కూర్చుని పార్టీలు నడిపించలేరు

### సిజెపిపై బిజెపి చీఫ్ నితిన్ నబిన్ ఘాటు విమర్శలు



**రాంచి, జూన్ 7:** కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) శనివారం జంతర్ మంతర్‌వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. నీట్ పేపర్ లీక్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఘటనపై బిజెపి చీఫ్ నితిన్ నబీన్ స్పందించారు. సిజెపిపై పరోక్ష విమర్శలు చేశారు. భారత్ యువతను డిజిటల్ ప్రచారాలతో తప్పుదారిపట్టించే ప్రయత్నాలను దేశం సహించదని అన్నారు. విదేశాల్లో కూర్చొని భారత యువతను ఆడించలేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్‌లోని రాంచీలో పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, దేశ యువతను ప్రతికూల రాజకీయాల వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత యువత సానుకూల రాజకీయాలను మాత్రమే విశ్వసిస్తుందని చెప్పారు.

# బిసిల అభివృద్ధి, పథకాల అమలుకు సమగ్ర కార్యాచరణ

## హాస్టళ్లలో అకడమిక్ ప్రొఫైల్ సిద్ధం చేయాలి
## సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీల అభివృద్ధి, పథకాల అమలుకు సమగ్ర కార్యాచరణను రూపొందించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారులను బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ నెల మూడవ వారంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సహాయ బీసీ సంక్షేమశాఖ అధికారులతో మేధో మథనం నిర్వహించనున్నట్టు తెలిపారు. బీసీ హాస్టల్స్‌లో అకాడమిక్ ప్రొఫైల్‌ను సిద్ధం చేసి, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ సంక్షేమ శాఖలో చేపడు తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, హాస్టల్‌ల పని తీరుపై మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి అమలు, బీసీల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ నెల మూడవ వారంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారులు, సహాయ బీసీ సంక్షేమ అధికారులతో మేధో మథనం నిర్వహించనున్నట్టు తెలిపారు. బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు. హాస్టళ్లు ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు అందించాల్సిన మెనూ అమలు తీరు, యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, షూస్‌తోపాటు అవసరమైన సామగ్రి పంపిణీ విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. రాబోయే విద్యా సంవత్సరంలో 500కు పైగా మార్కులు సాధించేలా గురుకులాలు, హాస్టల్స్ విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని సూచించారు.

బీసీ గురుకులాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థుల సంఖ్య పెంపుపై చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల సమగ్ర వికాసం కోసం హాస్టళ్లలో క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత ఆరోగ్య రికార్డులు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లలో ఏడాది పొడవునా నిర్వహించాల్సిన విద్యా, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలతో కూడిన అకడమిక్ ప్రొఫైల్‌ను రూపొందించాలన్నారు. రాబోయే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిళ్లలో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఫౌండేషన్ కోర్సులు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల కోసం దీర్ఘకాలిక శిక్షణ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వడ్డెర ఫెడరేషన్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తదితరులు

## లైంగిక వేధింపులు భరించలేక బాలిక ఆత్మహత్య

### నిందితులపై పోక్సో కేసు నమోదు చేయాలని తల్లి డిమాండ్

**హైదరాబాద్ (మలక్‌పేట), జూన్ 7, ప్రభాతవార్త:** హైదరాబాద్ సింగరేణి కాలనీకి చెందిన 17 యేళ్ల బాలిక నలుగురు యువకుల లైంగిక వేధింపులు భరించలేక గత నెల 28న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని బాధితురాలి తల్లి ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మలక్‌పేటలో హైకోర్ట్ న్యాయవాది రాపోల్ భాస్కర్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలి తల్లి వివరాలు వెల్లడించారు, తమ కుటుంబం నివాసముంటున్న ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు కొంతకాలంగా తన కూతురిని లైంగికంగా వేధిస్తున్నారని తెలిపారు. వారు బాలికను అసభ్యకరంగా వేధించి, బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. వారి వేధింపులు తాళలేక తన కూతురు మే 28న ఇంట్లో ఉరి వేసుకుందని కన్నీటి పర్యంతమయ్యారు. బాలిక ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్‌లో నలుగురు యువకుల వేధింపుల గురించి ప్రస్తావించిందని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తల్లి డిమాండ్ చేశారు. ఈ నెల 2న చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి కూడా ఫిర్యాదు చేసినట్టు ఆమె వెల్లడించారు. తమ బిడ్డను వేధించిన వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని, తమకు న్యాయం చేయాలని బాధితురాలి తల్లి వేడుకుంది. ఆరు నెలల క్రితమే యువకుల వేధింపులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ స్పందిస్తూ, బాలికలపై జరిగే లైంగిక నేరాల్లో పోక్సో చట్టం కింద సుమోటోగా కేసు నమోదు చేయడం పోలీసుల బాధ్యత అని, సూసైడ్ నోట్‌లో నిందితుల ప్రస్తావన ఉంటే, వెంటనే పోక్సో సెక్షన్లు జోడించి దర్యాప్తు చేయాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## కోటపల్లిలో బాలికపై అత్యాచారం

### పోక్సో కేసు నమోదు, ప్రత్యేక దర్యాప్తు

**కోటపల్లి, జూన్ 7, ప్రభాతవార్త:** కోటపల్లి మండలంలో ఒక బాలికపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్రకలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలానికి చెందిన ఒక మహిళ తన కూతురిని కోటపల్లి మండలంలోని తమ అమ్మమ్మ ఇంటికి తీసుకువచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 4న ఉదయం ఆ బాలిక గ్రామంలో ఆడుకుంటూ ఉండగా, అదే గ్రామానికి చెందిన ఒక బాలుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక తల్లి ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాజశేఖర్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యత కలిగిన కేసుగా పరిగణించినట్లు ఉన్నతాధికా రులు తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలను అత్యంత వేగవంతం చేశామని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెల్లడించారు.

## డ్రంకన్ డ్రైవ్ దాడుల్లో 422 మంది మందుబాబుల పట్టివేత

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 422 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 347 మంది ద్విచక్ర వాహనదారులు, 33 మంది ఆటో డ్రైవర్లు, 42 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నా రు. పట్టుబడ్డ వారిలో 91 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 176 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 73 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 40 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 19 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, 10 మంది 251 నుంచి 300 పాయింట్ల వరకు, 13 మంది 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వాహనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 284 మంది, మల్కాజిగిరిలో 152 మందు బాబుల పట్టివేత**

ఇదిలా ఉండగా సైబరాబాద్ పరిధిలో 284 మందు బాబులు పట్టు బడ్డారు. వీరిలో 2417 మంది ద్విచక్ర వాహనదారులు. ముగ్గురు ఆటో డ్రై వర్లు, 34 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. కాగా మల్కాజిగిరి కమిషనరేట్‌లో 152 మందు బాబులు పట్టుబడగా వీరిలో 134 మంది ద్విచక్ర వాహనదారులు. ఇద్దరు ఆటో డ్రైవర్లు, 16 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు.

## బార్‌లో గొడవ.. కేసు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 7, ప్రభాతవార్త:** బిల్లు విషయంలో పంజాగుట్టలోని ఓ బార్‌లో గొడవ చోటుచేసుకొంది. ఈ సంఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్టలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు శని వారం రాత్రి సాయిసచిన్, భీంచంద్‌తోపాటు మరో ముగ్గురు స్నేహి తులు వచ్చారు. మద్యం సేవిస్తున్న క్రమంలో వీరిలో ఇద్దరు స్నే హితులు ముందుగానే బార్‌లో నుంచి వెళ్లిపోగా మరో ముగ్గురు బార్ లోనే మద్యం సేవించగా రూ. 5వేలు బిల్ అయ్యింది.

కాగా మద్యం సేవించిన ముగ్గురు స్నేహితులు సైతం లిఫ్టు వద్దకు వెళ్లగా సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. బిల్లు కట్టకుండా ఎలా వెళ్తారంటూ ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి ఘర్షణకు దారితీసింది. తమ స్నేహితులు బిల్లు చెల్లించి ఉంటారని భావించి తాము వెళ్తు న్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై బార్‌కు చెందిన బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారవేత్త గోవర్ధన్‌రెడ్డి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాయిసచిన్, భీంచంద్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈతకు వెళ్లి వాగులో మునిగి బాలుడి మృతి

**హాజీపూర్, జూన్ 7,ప్రభాతవార్త:** ఈత సరదా ఒక బాలుడి ప్రాణం తీసింది. హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన బోగిరి సందీప్ (15) 9వ తరగతి పూర్తి చేసి ఈ సంవత్సరం 10వ తరగతి చదువుతున్నాడు. మృతుడు సందీప్ శనివారం మధ్యాహ్నం తన స్నేహితులు అభినయ్, అక్షయ్, అశ్విత్, రాంచరణ్ లు కలిసి ఈత కొట్టడానికి ముల్కల్లలోని ర్యాలీ వాగు డ్యామ్ వద్దకు వెళ్లారు. సాయంత్రం అయిన తిరిగి ఇంటికి రాలేదు. మృతుని తండ్రి కొడుకు గురించి చుట్టూ పక్కల మరియు స్నేహితుల వద్ద తెలుసుకున్న ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ముల్కల డ్యామ్ నీటిలో సందీప్ శవం కనిపించింది. శవాన్ని పోస్టుమార్టం కొరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి కీ పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

## కోస్గి ఇంజినీరింగ్ కాలేజీ జెఎన్‌టియుకు అప్పగింత!

### రెండేళ్లకే నడపలేక చేతులెత్తేసిన సర్కార్

### మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీగా గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీని రెండేళ్లు కూడా సక్రమంగా నిర్వహించలేకపోయింది. స్వయంగా ముఖ్యమంత్రి నియోజక వర్గం లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ అయిన కోస్గి ఇంజనీరింగ్ కాలేజీని నిర్వహించలేక చేతు లెత్తేయడంతో.. దాని నిర్వహణను జేఎన్‌టియుకి అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో 2013-14 విద్యాసంవత్సరం గవర్నమెంట్ పాలిటెక్నిక్‌ను ప్రారంభించింది. పాలిటెక్నిక్‌లో మూడు డిప్లమా కోర్సులను ప్రారంభించింది. డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్(డీసీఈ), డిప్లమా ఇన్ మెకానిక్ ఇంజనీరింగ్(డీఎంఈ), డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(డీఈఈఈ) కోర్సులను ప్రారంభించారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో ప్రారంభించింది. అనంతరం 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కోస్గిలో కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజినీరింగ్ కాలేజీకి అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం 2024లో నిర్ణయం తీసుకుంది. దీంతో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్‌లోని మూడు కోర్సుల్లో అడ్మిషన్లను తీసుకున్నారు. సీఎస్ఈ, సీఎస్ఈ ఏఐఎంఎల్, సీఎస్ఈ డేటా సైన్స్ మూడు కోర్సులను ప్రవేశపెట్టి.. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 180 సీట్లతో మొదటి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీగా ఏర్పాటు చేసి.. సాంకేతిక విద్యశాఖ అధ్వర్యంలో కొనసాగించింది. మొదటి సంవత్సరం 180 సీట్లకిగానూ 140 మంది చేరారు. రెండో సంవత్సరమైన 2025-26లో 180 సీట్లకి గానూ కేవలం 80 సీట్లే భర్తీ అయ్యాయి. దాంతోపాటు కాలేజీ నిర్వహించడం సాంకేతిక విద్య శాఖకు కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వం కోస్గిలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజిని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టియు) హైదరాబాద్‌కి అనుబంధంగా కొనసాగించాలని భావించింది. ఇదే విషయాన్ని సూచనప్రాయంగా ఇప్పటికే యూనివర్సిటీకి ప్రభుత్వం చేరవేసింది. 2026-27 విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ ఈ నెలాఖరులో ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే కోస్గి ఇంజనీరింగ్ కాలేజీని జేఎన్‌టియు కాన్సుయేట్ కాలేజీగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



ఉప్పల్‌లో వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్రంలో మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, లక్ష్మారెడ్డి తదితరులు

## వంజరి సంఘం భవనానికి రూ.2 కోట్ల నిధులు : మంత్రి పొన్నం

**హైదరాబాద్ (ఉప్పల్), జూన్ 7, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తగు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో వంజరి కుల ఆత్మ గౌరవ భవనం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ కేంద్ర సహాయ మంత్రి భగవత్ కరాద్, జాతీయ అధ్యక్షుడు గోవింద్ కేంద్రే, బానుక మల్లికార్జున్, తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షుడు కాలేరు సురేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కాలేరు అమరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వంజరి సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.2 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీనిని సంఘంలో పేద విద్యార్థుల చదువులకు ఉపయోగించాలని కోరారు. ఆర్థికంగా వెనుక బడిన వర్గాలను ఆదుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ వంజరి సంఘానికి రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు. సమాజ సేవలో వంజరుల పాత్ర అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి సహక రించిన నేతలను సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వంజరి సంఘం నేతలు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కోసం జులైలో జనజాగరణ యాత్ర

### ఆగస్టు 23న చలో హైదరాబాద్

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛను సాధనకైజులైలో జన జాగరణ యాత్ర చేపట్టాలని తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించింది. ఆగస్ట్ 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ తెలిపారు. ఆదివారం హైదదరాబాద్‌లో సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, 33 జిల్లాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.6 లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సుదీర్ఘ పోరాటంలో భాగంగా ముఖ్యమైన సమస్యలైన ఈహెచ్‌ఎస్, డీఏ ఎరియర్స్‌తోపాటు గత సాధారణ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పాత పింఛను(ఓపీఎస్) విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, రెండు సంవత్సరాలు దాటినా ఆ హామీ ఇంకా అమలుకు నోచుకోలేదు. కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలు చేసేలా ఉద్యమ కార్యాచరణకు రాష్ట్ర కార్యవర్గం కీలక తీర్మానం చేసిందన్నారు. జులైలో సీపీఎస్ జనజాగరణ యాత్రను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు.

## జల మండలిలో జెండా ఎగురవేశాం.. ఇక జిహెచ్‌ఎంసిలోనూ పాగా

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** జలమండలిలో ఐఎన్‌టియుసి జెండా ఎగురవేసిందని రానున్న జిహెచ్‌ఎంసి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా



ఎగురవేస్తాం అని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆత్మవిశ్వాసం వ్యక్తంచేశారు. గాంధీ భవన్‌లో ఆదివారం జలమండలి ఎన్నికల్లో ఘనం విజయం సాధించిన ఐఎన్‌టియుసి మొగుళ్ల రాజిరెడ్డి, రాజేందర్‌లకు అభినందన సభను జరుపగా అందులో టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పాల్గొని జలమండలి కార్మిక సోదరులందరికీ అభినం దనలు తెలిపారు. జలమండలిలో ఘన విజయం సాధించిన మొగుళ్ల రాజిరెడ్డి, రాజేందర్, వారి బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. జలమండలి ఎన్నికల్లో ఇంచార్జిగా సమర్థవంతంగా వ్యవహరించి పార్టీ అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి గెలుపు కోసం కృషి చేసిన బొంతు రామ్మోహన్‌ను గాంధీ భవన్‌లో శాలు వాతో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ సత్కరించారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ జలమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టియుసి సాధించిన విజయానికి బొంతు రామ్మోహన్ కృషి అభినందనీయమని ఎన్నికల నిర్వహణలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. పార్టీ బలోపేతానికి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షను వ్యక్తంచేశారు. కాంగ్రెస్ కార్యకర్తల కృషి, ఐక్యతతోనే ఈ విజయం సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. కార్మికులు, ఉద్యోగుల మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయనీ మహేష్ అనందం వ్యక్తంచేశారు. బిఆర్ఎస్ నియంత పోకడలకు విసుగుచెంది కాంగ్రెస్ గెలుపుకోసం అన్ని వర్గాలు కృషిచేయడంతో ప్రతి ఎన్నికల్లో గెలుస్తున్నామనీ ఈ విజయంతో ఉద్యోగుల అండ కాంగ్రెస్‌కు ఉందనే విషయం మరోసారి రుజువైందనీ అన్నారు.బిఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే ప్రభుత్వం స్పందించలేదనీ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మూడు రోజుల్లోనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేశారనీ ఆయన గుర్తుచేశారు. సింగరేణి, జలమండలి వంటి సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని బిఆర్ఎస్ నాయకులు కార్మికులను ఇబ్బందులకు గురిచేశారనీ ఆవేదన చెందారు. హరీష్ రావు గుప్పిట్లో బంధీ అయిన జలమండలి కార్మికులకు ఇక వారి హక్కులను కాపాడుకొనే స్వేచ్ఛ వచ్చిందని అన్నారు..కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించి తమ నాయకులను గెలిపించారనీ అన్నారు. కార్మికుల కష్టసుఖాల్లో అండగా నిలవాలని మొగుళ్ల రాజిరెడ్డి బృందానికి సూచించారు. జలమండలి ఎన్నికల విజయానికి సంజీవ రెడ్డి కృషి ఎంతో ఉందని గుర్తిస్తున్నామనీ తెలిపారు. కార్మికుల సమస్య ఏదైనాసిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామనీ హామి ఇచ్చారు.ఈ విజయం కార్మికుల ఆత్మగౌరవానికి, కాంగ్రెస్‌పై ఉన్న విశ్వాసానికి నిదర్శనమనీ రానున్న రోజుల్లో కార్మిక సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో పనిచేస్తుందనీ ఆయన హామి ఇచ్చారు. అంతకుముందుకాంగ్రెస్ పార్టీ శ్రేణులుభారీ ర్యాలీగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసిగాంంధీ భవన్‌కి మొగుళ్ల రాజిరెడ్డి చేరుకోగానే బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.

## 80 సీట్లతో మళ్లీ గెలుపు కాంగ్రెస్‌దే

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ కెటిఆర్ రాష్ట్రంలో చెపుతున్న అబద్దాలు సరిపోలేదని మలేషియా వెళ్లి అబద్దాలు చెపుతున్నాడనీ ఎంతగా అసత్యప్రచారంతో ఊదరగొట్టినా వాస్తవాలు ప్రజలకు తెలుసని కాంగ్రెస్ మళ్ళీ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్పీ మీడియా కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే చొప్పదండి మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కెసిఆర్ రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకుని అప్పులు చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసనీ అన్నారు. ధనిక రాష్ట్రంగా సోనియా గాంధీ తెలంగాణ ను ఇస్తే, పంది కొక్కుల్లా దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారనీ ఆగ్రహంవ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మీరు దిగిపోయినప్పుడు ఉన్న పరిస్థితి పైన కెటిఆర్ విదేశాల్లో స్పీచ్ లు ఇవ్వాలనీ సలహాఇచ్చారు. 25 యేళ్ల పాలన కాదు వచ్చే రెండున్నర యేళ్లు మీ పార్టీని కాపాడుకోండి చాలు తెలంగాణ లో మీ పార్టీ అవసరం లేదని ప్రజలు ఇప్పటికే పలు సార్లు సంకేతాలు ఇచ్చారనీ ఆయన హితవుచెప్పారు. ప్రతి పక్షంగా ఫైయిల్ కావడంతో పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తుక్కు తుక్కు ఓడించారనీ ఎద్దేవా చేశారు.పంచాయతీ ఎన్నికల్లో పత్తా లేకుండా పోయారు..మున్సిపల్ ఎన్నికల్లో మీ మోహం మీద ఛీ కొట్టారు.. జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వం కావాలని ప్రజలు స్పష్టంగా తీర్పు ఇచ్చారు అయినా మీలో మార్పురావడంలేదని అన్నారు.డబ్బు మదంతో ఏమైనా చేస్తామన్న అహంకారంతో దేశాలు తిరిగి తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ మీరెన్ని దేశాలు తిరిగినా తెలంగాణ ప్రజల గుండెల్లో రేవంత్ రెడ్డి ఉన్నారనీ ఆయన చెప్పారు. ప్రజల గుండెల్లో ఉన్న రేవంత్ వచ్చే ఎన్నికలలో 80సీట్లతో అధికారంలోకి వస్తారని , ప్రతి పక్ష హోదా కూడా ఈ సారి బిఆర్ఎస్ కు రాదనీ ఆయన జోస్యంచెప్పారు. తెలంగాణ ప్రజలను వానపాముల్లా చూశారనీ వారు బుసకొట్టి మిమ్మల్ని పడగొట్టారని ఇక వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు రావు అని అన్నారు. పదేళ్ల ఒక్క ఇల్లు ఇవ్వలేదనీ కనీసం రేషన్ కార్డు ఇవ్వలేదనీ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

## తెలుగు సాహిత్య సంప్రదాయానికి ప్రతీక అష్టావధానం

### విశ్రాంత ఐఎఎస్ అధికారి కె.వి.రమణాచారి

### అబ్బురపరిచిన గగన విజయం విశేష అష్టావధానం



ఆకాశవాణి అష్టావధానం ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న కె.వి.రమణాచారి, నల్లాన్‌చక్రవర్తుల సాహిత్, బి.హరిసింగ్, రమేష్, మహేష్, కామేశ్వరి తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 7, ప్రభాతవార్త :** అష్టావధానం ప్రక్రియ అనేది తెలుగు సాహిత్య సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలు, సృజనాత్మక మేథో సంపత్తికి అద్దంపడుతుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో తెలుగు సాహిత్యంపట్ల ఆశక్తి, అనురక్తిని పెంపొందించడంతోపాటు అవధానం అనే విశిష్ట ప్రక్రియ గురించి అవగాహన కలుగుతుందని తెలిపారు. గత తొమ్మిది దశాబ్ధాలుగా భారతదేశ సంస్కృతి, సాహిత్యం, సంగీతం, జానపద కళలు, విద్యా విలువలను ప్రజలకు చేరవేస్తూ చేసిన కృషికి గుర్తింపుగా ఆకాశవాణి 90 ఏళ్ల ప్రజాసేవ ప్రసారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ఘనంగా నిర్వహించిన గగర విజయం విశేష అష్టావధానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. కె.వి.రమణాచారి ఆకాశవాణి క్లస్టర్‌హెడ్ బి.హరిసింగ్, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర ప్రోగ్రామ్ హెడ్ రమేష్ సుంకసారి, న్యూస్‌హెడ్ ఎంఎస్ మహేష్, దూరదర్శన్ యాదగిరి ప్రోగ్రామ్ హెడ్ కామేశ్వరి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి గగన విజయం అష్టావధా నాన్ని లాంఛనంగా ప్రారం భించి ప్రసంగించారు. ఆకాశవాణి అనేది ఒక దేవాలయం వంటిదని, తాను చదువుకునే రోజుల్లో ఆకాశవాణి వారి అడిషన్‌కు హాజరై నాటకాల్లో కూడా పాల్గొన్నానని ఆకా శవాణితో తనకున్న అనుభవాలను పంచు కున్నారు. మారుమాముల దత్తాత్రేయశర్మ సమన్వ కర్తగా వ్యవహ రించిన ఈ కార్యక్రమంలో అష్టావ ధానిగా నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పాల్గొన్నారు. పృచ్ఛకులుగా నిషిద్ధాక్షరి డా. జి.ఎం.రామశర్మ, సమస్య కంది శంకరయ్య, దత్తపది అవుసులు భానుప్రకాష్, వర్ణన మండపాక మహేశ్వరి, న్యస్తాక్షరి అరవల్లి శ్రీదేవి, చంధోభాషణం ముత్యం పేట గౌరిశంకరశర్మ, ఆశువు చిటితోటి విజయ్‌కుమార్, అప్రస్తుత ప్రసంగం రంగి సత్యనారాయణలు సంధించిన సమస్యాపూరణ, దత్తుపది, నిషిద్ధాక్షరి, వర్ణన, అప్రస్తుత ప్రసంగం వంటి సాహిత్య అంశాలకు సముచితంగా స్పందిస్తూ తన ప్రతిభను చాటుచెప్పారు. తెలుగు సాహిత్య సంప్రదాయంలో అత్యున్నత మేథో ప్రక్రియగా గుర్తింపు పొందిన అష్టావధానం ఆశు కవిత్వం, జ్ఞాపకశక్తి, సమయ స్ఫూర్తి, భాషా పాండిత్యం, చమత్కార ప్రతిభలు తదితర అన్ని సమ్మేళనాలను మేళవించి మనస్సులోనే చంధ స్సును లెక్కిస్తూ తన అసాధారణ అమోఘ జ్ఞాపక శక్తి, ఏకాగ్రతలను నిరూపించుకుని గగన విజయం అష్టావధానం విజయవంతం చేశారు. ఈ కార్య క్రమానికి అధికసంఖ్యలో ఆకాశవాణి సిబ్బంది. శ్రోతలు, సాహిత్య అభిమానులు పాల్గొని ఆనందానుభూతిని పొందారు.

## ఎపికె ఫైల్ క్లిక్ చేయడంతో రూ.95,100 మాయం

### కామారెడ్డిలో చిరువ్యాపారికి సైబర్ నేరగాళ్ల టోకరా

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** సైబర్ మోసాలపై పోలీసులు చేస్తున్న హెచ్చరికలను కొందరు పట్టించుకోక పోవడం, సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. కామారెడ్డిలో ఓ చిరు వ్యాపారికి సెల్‌ఫోన్‌లో ట్రాఫిక్ చలాన్ పేరిట వచ్చిన ఎపికె ఫైల్‌నే వెనుకా ముందు చూసుకోకుండా క్లిక్ చేయడంతో అతని బ్యాంకు ఖాతాలోని 95,100 రూపాయలను క్షణాల వ్యవధిలో నేరగాళ్లు కాజేశారు. వివరాలు ఇలావున్నాయి కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో మజహార్ అనే చిరు వ్యాపారికి వాట్సాప్ ద్వారా ఒక సందేశం వచ్చింది. ఇది అచ్చం రవాణా శాఖ పంపే ట్రాఫిక్ చలాన్‌లా కనిపించింది. తన వాహనానికి చలాన్ పడిందేమోనని భావించిన మజహార్ వెంటనే దానికి సంబంధించిన ఎపికె ఫైల్ ను క్లిక్ చేసి తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేశాడు. ఎపికె ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసిన కొన్ని క్షణాలలోనే మజహార్ బ్యాంకు ఖాతాలోని 95,100 రూపాయలు మాయమయ్యాయి. దీనిపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు ఈ నేరానికి పాల్పడింది ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నేరగాళ్లుగా నిర్ధారణ కు వచ్చారు. బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి మాయమైన 95,100 రూపాయల నగదు తెలంగాణ సహా పలు రాష్ట్రాలలోని మ్యూల్ ఖాతాల ద్వారా అసలు నేరగాళ్ల ఖాతాలకు చేరినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో మ్యూల్ ఖాతాదారుల కోసం ఆరా తీస్తున్నారు.

# పోలవరం నుంచి కావేరికి లింక్ పెడితే తెలంగాణకు నష్టం

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నాం: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 7:** గతంలో కృష్ణా, ఇప్పుడు గోదావరి నీటిని మళ్లించేందుకు తెలంగాణను మోసం చేస్తున్నారని, పోలవరం-కావేరీ లింక్ ప్రాజెక్టు ప్రతిపాదన తెలంగాణ జల హక్కులను కాలరాయడమే అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. గోదావరి-కావేరీ అనుసంధానం పేరుతో ఏపీ ప్రభుత్వం గోదావరి జలాలపై ద్రోహం తలపెట్టే ప్రయత్నం చేస్తున్నా రని మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడి యాతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నష్టం జరిగిందంటే అక్కడి నేతలే పాలకులుగా ఉన్నారని తెలిపారు. కానీ స్వరాష్ట్రంలో పాలకుల చేతిలో అన్యాయం జరిగితే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నామని.. పోలవరం బనకచర్లతో అన్యాయం జరుగుతుందని ప్రశ్నించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నదీ జలాల దోపిడీ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఏపీ ప్రభుత్వం గతంలో చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కేవలం బీఆర్ఎస్ పోరాటంతోనే ఆగిపోయిందన్నారు. తాజాగా నదుల అనుసంధానం పేరుతో ఏపీ మరో కొత్త కుట్రకు తెరలేపిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌కు రాజకీయ ప్రయోజనాలు కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు అత్యంత ముఖ్యమని తెలియజేశారు. గోదావరి నదిలో మిగులు జలాలే లేనప్పుడు ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టు ఎలా కడుతుందని ప్రశ్నించారు. తెలంగాణకు చెందిన సమ్మక్క సాగర్ నుండి 47 టీఎంసీల నీటిని పూర్తిగా వదులుకోవాల్సి వస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మా అవసరాలు తీరిన తర్వాతే ఇంటర్ లింకింగ్ రివర్స్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించామని, ఇచ్ఛంపల్లి నుంచి నాగార్జునసాగర్‌కు లింక్ చేసేందుకు నాటి కర్ణాటక మంత్రి డీకే శివకుమార్, ఏపీ మంత్రి దేవినేని ఉమ ఒప్పుకున్నారని తెలిపారు.

**కృష్ణా, గోదావరి జలవాటాలకు అన్యాయం చేసిందే బిఆర్ఎస్:ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

రాయలసీమ రతనాల సీమను మారుస్తానని కెసిఆర్ మాట్లాడటమేంది, బేసిన్లు లేవు భేషజాలు లేవంటూ జగన్ ను ప్రగతి భవన్ కు పిలిపించి హైదరాబాద్ బిర్యానీ తినిపిస్తే హరీష్ రావు పక్కనే ఉండి మంచినీళ్లు అందించి కృష్ణాగోదావరి జలవాటాలో అన్యాయం చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు చాలని ఉమాభారతి వద్ద సంతకం పెట్టి మరణశాసనం రాసింది హరీశ్‌రావు కాదా..? అలాంటి హరీష్ రావుకు ఇప్పుడు మాట్లాడటానికి కనీసం సిగ్గుండాలని ఆయన అన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రైతులకు మరణశాసనం రాసిన హరీష్‌రావు, కెసిఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. హరీష్ రావు ఉత్తర తెలంగాణకు వరప్రధాయిని అయిన తుమ్మిడి హెట్టి పైన నోరుమెదపడం లేదనీ అడిగారు. తుమ్మిడిహెట్టి పైన మహారాష్ట్ర ముఖ్యమంత్రితో అపాయింట్‌మెంట్ ఇప్పించేలా బిజెపి ప్రజాప్రతినిధులు చొరవ



చూపించాలనీ కోరారు.కల్వకుంట్ల కవిత లక్ష కోట్ల భూదోపిడి జరిగిందని అసత్యాలు మాట్లాడుతున్నారనీ ఆమె కెసిఆర్ పాలనలో జరిగిన భూ కబ్జాల గురించి మాత్రమే మాడాలనీ ఆయన కోరారు. ప్రతి ఎన్నికలో రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కావాలి ప్రజలు తీర్పు ఇచ్చారనీ గుర్తుచేశారు సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందనీ అన్నారు.



నిరసన దీక్షలో ప్రసంగిస్తున్న కుమ్మర్ల నాయకులు

## స్వరాష్ట్రంలోనూ కుమ్మర్లకు అన్యాయమే

### అఖిల భారతీయ కుమ్మర్ శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్ నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 7, ప్రభాతవార్త:** స్వరాష్ట్రం సాధించుకుని 12 సంవత్సరాలు గడిచినప్పటికీ, స్వరాష్ట్రంలో సైతం కుమ్మర్లకు అన్యాయమే జరుగుతోందని అఖిల భారతీయ కుమ్మర్ శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మహాసంఘ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కుమ్మర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకై కుమ్మర్ల నిరసన దీక్ష పేరుతో దీక్ష చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమానికి మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు మిరుదొడ్డి శివానంద్ ప్రజాపతి అధ్యక్షత వహించగా, రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి సిలివేరు శంకర్ ప్రజాపతి, రాష్ట్ర [illegible] అధ్యక్షులు ఏలిశాల కృష్ణ ప్రజాపతి, ప్రధానకార్యదర్శి దొమ్మాట నాదం ప్రజాపతి, ఊటూరి సుదర్శన్ ప్రజాపతి, మల్లికంటి వీరన్న ప్రజాపతి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మర శాలివాహన కార్పొరేషన్ ఏర్పాటుచేసి, వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని, ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన మూడు ఎకరాల స్థలంలో తక్షణమే మూడు కోట్ల నిధులు విడుదల చేసి, భవన నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కుమ్మరులకు జీవనాధారమైన మట్టిని ఇచ్చే కుమ్మరి కుంటలు కబ్జాలకు గురికాకుండా కఠినమైన రక్షణ చర్యలు చేపట్టాలని, గ్రామదేవతల ఆలయాల్లో కుమ్మర్లకే పూజారులుగా అవకాశం కల్పించాలని, రానున్న ఎన్నికలలో రాజకీయ పార్టీలు కుమ్మర్లకు జనాభా ప్రాతిపదికన కార్పొరేటర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు కేటాయించాలని కోరారు.

## గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే ఉపసంహరించుకోవాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను తక్షణమే ఉపసంహరించుకోవాలని, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరను రూ.29లు పెంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, చమురు సంస్థలు తీసుకున్న నిర్ణయం సామాన్య ప్రజల నడ్డి విరచడమేనని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈ చర్యను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. 5 రాష్ట్రాల ఎన్నికల అనంతరం బిజెపి ప్రభుత్వం ప్రజలపై వరుసగా భారాలు మోపుతోందన్నారు. తక్షణమే పెంచిన ధరను ఉపసంహరించు కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని, ప్రజలను నమ్మబలుకుతూనే, మరోవైపు భారీ ఎత్తున భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు.

**గద్వాల ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యంతో విద్యార్థిని ఇందు మృతి దారుణం: జాన్‌వెస్లీ**

గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం కారణంగా గద్వాల జిల్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన నీట్ విద్యార్థిని ఇందు మృతి చెందడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. వైద్యుల తప్పును కప్పిపుచ్చుకోవడానికి పోస్టుమార్టం నిర్వహించకుండా, దొడ్డిదారిన అంబులెన్స్‌లో శవాన్ని తరలించడంతో ఆసుపత్రి నిర్లక్ష్యం స్పష్టమవుతోందన్నారు. ఇందు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియో ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## వరి గడ్డి కాల్చినందుకు ఎనిమిది మంది రైతులకు రూ.40 వేల జరిమానా

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వరి గడ్డిని కాల్చినందుకుగాను రైతులకు జరిమానా విధిస్తూ వ్యవసాయ శాఖ నిర్ణయం తీసుకుంది. ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఎనిమిది మంది రైతులకు రూ.40 వేల రూపాయల మేర జరిమానా విధించింది. ఈ మేరకు దీనికి సంబంధించి రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా కాతలాపూర్ మండలం రాజారామ్ తండా గ్రామానికి చెందిన రైతులు పంట వ్యర్థాలను తగలబెడుతున్న ఘటనలు వెలుగులోకి రావడంతో జీవో ఎంఎస్ 27 కింద వ్యవసాయ శాఖ అధికారులు ఈ చర్య తీసుకున్నారు. జరిమానా విధించిన రైతుల్లో రాజారాం తండాకు చెందిన భూక్య నంద్యా నాయక్, లకావత్ రాములు, లకావత్ బక్షయ్య, భూక్య సంతోష్, కున్సోత్ రాజేష్, దేగావత్ రాజు, లకావత్ తిరుపతి, భానోత్ రాజులు ఉన్నారు. రాష్ట్రంలోని పలుచోట్ల ఇలాంటి పద్ధతుల వల్ల అగ్నిప్రమాదాలు కూడా జరిగాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టడం ప్రారంభించారని, ఈ చర్య నిర్దేశిత నిబంధనల ఉల్లంఘన అని వ్యవసాయ అధికారులు తెలిపారు.

## లక్ష టన్నుల లక్ష్యంతో ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ

### వచ్చే యేడాదికి అందుబాటులో మరో 7 కర్మాగారాలు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా నర్మెటలో టన్నుకు రూ.23,852 ధరతో గంటకు 30 టన్నుల పామాయిల్ గెలలను శుద్ధి చేస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆదివారం తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీతో పాటు, రాష్ట్రంలో మరో ఏడు కర్మాగారాలు 2027 నాటికి అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది. సిద్దిపేటలో రూ.40 కోట్లతో రిఫైనరీ యూనిట్ 2027 నాటికి అందుబాటులోకి వస్తుందని వెల్లడించింది. ఆయిల్ పామ్ గెలలు టన్నుకు రూ.23,852 ధర పలికి సరికొత్త రికార్డు సృష్టించింది. ఆరు నెలల్లో టన్ను ధర రూ.4,158లు పెరగడం విశేషం. మే నెలలో టన్ను గెలల ధర రూ.23,501లు ఉండగా తాజాగా రూ.351లు పెరిగింది. దీంతో ఆయిల్ పామ్ గెలలకు టన్ను ధర రూ.23,852కు చేరిందని ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ అధికారులు తెలిపారు.

## భారత్‌లోని ఉగ్రవాద సంస్థలకు నిధుల కటకట

### ఆర్థిక సంక్షోభంతో భారీగా కోతపెట్టిన దాయాది దేశం

### నేరాల బాటపట్టిన టెర్రరిస్టులు

**హైదరాబాద్ జూన్ 7, ప్రభాతవార్త:** భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న పాకిస్తాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలకు కొత్త సమస్య వచ్చి ప డింది. ఇంతకాలం ఉగ్రవాద సంస్థలకు మహారాజ పోషక పాత్ర వహించిన పాకిస్తాన్ స్వదేశంలో తలెత్తిన తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా వీటికి భారీగా కోతపెట్టింది. ఈ కారణంగా ఢిల్లీ సహా ఉత్తరాది నగరాలలో పాక్ ఉగ్రవాద సంస్థలు నేరాల బాటపట్టినట్లు నిఘా వర్గాలు గుర్తిం చి దీనిపై ఆయా ప్రాంతాల పోలీసులను అప్రమత్తం చేశాయి. పంజాబ్‌లోని మొహాలిలో ఇటీవల ఒక డ్రైవర్ హత్య చేసి కారును దొంగిలించిన ఘటనలో జైష్ ఏ మహమ్మద్ ఉగ్రవాదులు అరెస్టవడం, కొందరు బడా వ్యాపారుల కిడ్నాప్‌కు యత్నించిన ఘటనలో వీరి పాత్ర వెలుగు చూడ డం, కాశ్మీర్‌లో పలు ఎటిఎంలపై దాడి, దోపిడీల వెనుక ఉగ్రవాదుల హస్తం రట్టవడంతో పాక్ ఉగ్ర సంస్థల నేరకలాపాలు వెలుగు చూశాయి. భారత్‌లో ఉగ్రవాద వ్యాప్తికి, అస్థిరతకు దాయాది దేశం పాక్ దశాబ్దాలుగా ప్రయత్నిస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే జమ్మూ కాశ్మీర్ సహా అనేక రాష్ట్రాలలో పాక్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు సొంతంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తుండడం విదితమే.

ఇందు కోసం పాక్ తన బడ్జెడ్‌లో కొంతమేర ప్రత్యేకంగా నిధులను దశాబ్దాలుగా కేటాయిస్తోంది. అయితే కొంతకాలంగా పాక్ ఆర్థిక పరిస్థితి దిగజారడ´ంతో అనేక రంగాలపై కోత పెడుతోంది. ఇదే క్రమంలో భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న లష్కర్ ఏ తోయిబా, జైష్ ఏ మహమ్మద్, హిజ్బుల్ ముజాహదీన్ సహా అన్ని సంస్థలకు అందచేస్తున్న నిధుల్లో 80 నుంచి 90 శాతం మేరకు కోత పెట్టినట్లు నిఘా వర్గాలకు సమా చారం అందింది. దీంతో భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్ర సంస్థలు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. దీనిపై పాక్‌లో ని తమ అగ్ర నాయకులను అడిగినా ప్రయోజనం లేక పోవడంతో ఉగ్రవాద సంస్థలు భారత్‌లో నేరాల బాటపట్టాయి. ఢిల్లీ సహా పలు ఉత్తరా ది నగరాలలో సంపన్నులను, వారి పిల్లలను కిడ్నాప్ చేపి భారీగా నిధులు వసూలు చేయడం ఇందులో మొదటిది. దీంతో పాటు బ్యాంకులను దోచుకోవడం, ఎటిఎంలలో నగదు నింపే వాహనాలను లూటీ చేయడం రెండవది. దీని తరువాత పరిస్థితులకు అనుగుణంగా దారిదోపిడీలకు పాల్పడడం. ఈ కార్యకలాపాల కోసం ఉగ్రవాద సంస్థలు తమ వద్ద పనిచేసే ఓవర్ గ్రౌండ్ వర్కర్లను (ఒడబ్ల్యుజి) కొత్తగా రంగంలో దించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. పంజాబ్‌లోని మొహాలిలో ఇటీవల ఓ కారు డ్రైవర్ హత్యకు గురికాగా అతని వాహనం చోరీకి గురైంది. దీనిపై వి చారణ చేబట్టిన పోలీసులు దీని వెనుక జైష్ ఏ మహమ్మద్ హస్తం వున్నట్లు గుర్తించి దీనికి కారకులైన వారిని అరెస్టు చేశారు. ఈ కేసులో అస లు నిందితులు ఇంకా పట్టుబడలేదు. మొహాలి పాక్‌కు సరిహద్దు ప్రాంతం కావడంతో ఇటువంటి ఘాతుకాలు మరిన్ని జరిగే వీలుందని అను మానించిన పోలీసులు వాహనాల డ్రైవర్లను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా పంజాబ్‌కు సరిహద్దులో పాక్‌కు దగ్గరగా వున్న గ్రామాలలో అప్రమ త్తం చేశారు. కాశ్మీర్‌లో వెలుగు చూసిన ఎటిఎంల దోపిడి, నగదు తరలింపు వాహనాలపై దాడుల వెనుక ఉగ్రవాదుల హస్తం వెలుగు చూడడం గమనార్హం. దీంతో పాటు దేశ రాజధాని ఢిల్లీ సహా పలు నగరాలలో సంపన్నులను వారి పిల్లలను కిడ్నాప్ చేసేందుకు ఉగ్రవాదులు కుట్ర పన్ని నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ విషయంలోనూ పోలీసులను నిఘా వర్గాలు అప్రమత్తం చేశాయి.

## జీవన నైపుణ్యాలు పెంపొందించుకునేలా విద్య ఉండాలి

### గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 7:** విద్యార్థులకు మార్కుల కోసం కాకుండా జీవన నైపుణ్యాలు, విలువలు పెంపొందిం చుకునేలా విద్య ఉండాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. ఆధునిక విజ్ఞానం, గ్లోబల్ స్కిల్స్ తో పాటు నైతిక విలువల అభివృద్ధి అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం బౌరంపేటలోని ఐఆర్ఏ యూనివర్సల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లా డుతూ, విద్యార్థులు పెద్ద లక్ష్యాలు పెట్టుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, అపజయాలు విజయానికి మెట్లు మాత్రమేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా, తల్లిదండ్రులు ప్రోత్సా హకులుగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. నైపు ణ్యం, విలువలు కలిగిన విద్యార్థులే భవిష్యత్ భారత నిర్మాణానికి పునాదిగా నిలుస్తారని ఆయన తెలిపారు. నశా ముక్త భారత్ కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ డా. జె. అనురాధ, ఐఆర్ఏ యూనివర్సల్ స్కూల్ చైర్మన్ డా. ఎం.మల్లా రెడ్డి తదితరులు హాజరయ్యారు.



## రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు బంద్

### సర్కార్ కొనుగోలు లక్ష్యం 22 లక్షల టన్నులు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణలో మొక్కజొన్న కొనుగోళ్లు నిలిపివేస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. దీంతో రాష్ట్రంలో ఆదివారం నుండి వీటి సేకరణ ప్రక్రియ బంద్ అయింది. ఓవైపు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న కుప్పలు ఉన్నాయి. రైతులు నేటికీ తమ పంటలను తీసుకొస్తున్నారు. ప్రతి రోజు 5 నుండి 10 వేల టన్నుల మధ్య కొనుగోలు చేస్తోంది. శనివారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా 7వేల టన్నులు కొనుగోలు చేసింది. ఈ పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్ ఉన్నపళంగా మక్కల కొనుగోలును బంద్ చేయాలనే నిర్ణయం తీసుకోవడం, అది వెంటనే అమల్లోకి రావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారయింది. రాష్ట్ర వ్యాప్తంగా 43 లక్షల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యాయి. ఇందులో 22 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. సర్కార్ నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు దాదాపు 14 లక్షల టన్నులకు పైబడి మాత్రమే కొనుగోలు చేసింది. ఈ లెక్కన నిర్ధారించిన లక్ష్యం కన్నా ఇంకా సుమారు 8 లక్షల టన్నులకు పైగా మొక్కజొన్న తక్కువగా కొనుగోలు చేయడంతో ఉన్న నిల్వలు ఎలా అమ్మాలా అని రైతాంగం ఆందోళన చెందుతోంది. కొనుగోలు కేంద్రాలను బంద్ చేయడంతో మిగిలిన పంటను ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలులో నిర్లక్ష్యానికి, తమకు కలుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యులని నిలదీస్తున్నారు. బహిరంగ మార్కెట్లో విక్రయిద్దామంటే కొనుగోలు చేసే దిక్కేలేదని అంటున్నారు. ఒకవేళ అమ్ముదామన్నా భారీగా కోత పెట్టి తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్మాల్సి న పరిస్థితి దాపురిందించని అంటున్నారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్లో రూ.1,700 నుండి రూ.1,900కే కొంటున్నారు. ఇలా ప్రైవేట్‌కు విక్రయించడం వల్ల రైతులు క్వింటాలుకు దాదాపు రూ.500 చొప్పున నష్టపోతున్నారు. ఇప్పటి వరకూ కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన పంటలు కాంటా పెట్టని దుర్భర పరిస్థితులు ఉన్నాయి. దీనికి తగినట్లుగా గన్నీ సంచులు, వాహనాలు, గోదాములు, హమాలీల కొరత అంటూ సవాలక్ష కారణాలతో ధాన్యం, మక్కల కొనుగోలును మార్క్‌ఫెడ్ తీవ్ర నిర్లక్ష్యం చేసిందనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో మొక్కజొన్న కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు అయోమయాన్ని ఎదుర్కొంటున్నారు.

## గాంధీ ఎబోలా ఐసోలేషన్‌లోని వారికి నెగెటివ్

### మళ్లీ శాంపిల్స్ సేకరించి నిర్ధారణ పరీక్షలు

**హైదరాబాద్ (సికింద్రాబాద్), జూన్ 7, ప్రభాతవార్త:** సికిందరాబాద్ గాంధీ ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న ఇద్దరు సూడాన్ దేశస్తులకు ఎబోలా నెగెటివ్ వచ్చినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సూడాన్ నుంచి మోకాలి చికిత్స కోసం నగరంలోని అపోలో ఆస్పత్రికి వచ్చిన అబ్దుల్ రజీమహ్మద్ (23) ఎబోలా లక్షణాలతో ఈనెల 4వ తేదీ రాత్రి గాంధీ ఐసోలేషన్ వార్డులో చేరాడు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించగా ఎబోలా నెగెటి వ్ వచ్చింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలోని పుణే వైరాలజీ ల్యాబ్ తమకు అందిన శాంపిల్లో ఎబోలా వైరస్ ఆనవాళ్లు లేవని స్పష్టం చేస్తూ శనివారం సాయంత్రం ధ్రువీకరించిందని గాంధీ సూపరింటెండెంట్ వాణి తెలిపారు. గాంధీ ఐసోలేషన్‌లో ఉన్న సూడాన్‌కు చెందిన మరోవ్యక్తి మహ్మద్ యాహ్యాయాగోబ్ అహ్మద్ (35)కు కూడా ఎబోలా నెగెటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. అబ్దుల్ మహ్మద్‌కు సహాయకుడిగా సూడాన్ నుంచి వచ్చిన 22 ఏళ్ల యువకుడిలో ఎలాంటి ఎబోలా లక్షణాలు లేనప్పటికీ ముందుజాగ్రత్త చర్యగా హోంక్వారంటైన్‌కు తరలించారు.ఐసోలేషన్లో ఉన్న ఇరువురికి ఎబోలా నెగెటివ్ రావడంతో తెలంగాణ ప్రజలతో పాటు వైద్యులు ఊపిరి తీసుకున్నట్లైంది. ఎబోలా నెగెటివ్ వచ్చినప్పటికీ 48 గంటల తర్వాత మరోమారు శాంపిల్స్ సేకరించి నిర్ధారణకు పంపిస్తారు. రెండో నివేదికలో కూడా ఎబోలా నెగెటివ్ వస్తే ఐసోలేషన్ వార్డు నుంచి డిశ్చార్జి చేస్తారు.

## కిషన్‌రెడ్డి జాతకాలు మాకొద్దు తెలంగాణకు తీసుకొచ్చే అభివృద్ధి కావాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** 'కాంగ్రెస్ పార్టీకి అడ్రస్ ఉండదు, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కారు' వంటి కిషన్ రెడ్డి జాతకాలు తెలంగాణ ప్రజలకు అవసరం లేదనీ, కేంద్ర మంత్రిగా తెలంగాణకు తీసుకొచ్చిన అభివృద్ధి ఏంటో మాకు కావాలి ఏ అభివృద్ధి చేయకపోతే ప్రజలు అడ్డుకోవడం ఖాయం అని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక దృశ్యమాధ్య ప్రకటనలో విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటనకు ఆయన స్పందిస్తూ ధాన్యం కొనుగోలుకు సహకరిస్తారా లేదా కిషన్ రెడ్డి చెప్పాలనీ కోరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి అప్పటి అధికార పార్టీతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేశారనీ విమర్శించారు. తెలంగాణను కెసిఆర్ కుటుంబం దోచుకుంటే కిషన్ రెడ్డి ఏం చేశారనీ ప్రశ్నించారు. వరి ధాన్యం,మొక్కజొన్నలు కొనమని కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడగడం తప్పు ఎలా అవుతుందనీ అన్నారు. మెట్రో ఫెజ్ 2 కు,మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకారంపై కిషన్ రెడ్డి వైఖరి తెలంగాణ ప్రజలకు చెప్పాలనీ ఆయన కోరారు. దేశాభివృద్ధికి సహకరించే ప్రగతిశీల రాష్ట్రం పరుగెత్తకుండా కాళ్ళల్లో కట్టెలు పెట్టవద్దని కిషన్ రెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి అనడం తప్పా...? ఇది తెలంగాణ ప్రజలు గమనించాలనీ అన్నారు. నన్ను ఆపే ధైర్యం ఎవరికి లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారనీ అభివృద్ధిని విస్మరిస్తే మిమ్మల్ని ఈ స్థాయికి తెచ్చిన తెలంగాణ ప్రజలు అడ్డుకొంటారని తెలిపారు.

## యూరియా యాప్ రద్దు కోసం వ్యవసాయ సహకార సంఘానికి రైతుల తాళాలు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా యాప్‌ను పలువురు రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లాలో రైతులు వ్యవసాయ సహకార సంఘానికి తాళాలు వేసి ఆందోళన చేశారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయానికి రైతులు తాళం వేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ (యూరియా యాప్) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ యాప్ ద్వారా ఎరువులు పొందే విధానంలో సర్వర్ డౌన్ సమస్యలు, సాంకేతిక లోపాలు, ఓటీపీ రాకపోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యాప్ ఓపెన్ చేయగానే చాలా సందర్భాల్లో నో స్టాక్ అని చూపించడంతో పాటు, సర్వర్ లోపాల వల్ల ఓటీపీలు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## రబీలో జొన్నల సేకరణలో ఆదిలాబాద్ జిల్లా రికార్డు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రబీ సీజన్‌కు సంబంధించి జొన్నల సేకరణలో ఆదిలాబాద్ జిల్లా రికార్డు సృష్టించింది. ఈ జిల్లాలో జొన్నల కొనుగోళ్లు అధికంగా జరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలో మొత్తం ఉత్పత్తి 16 లక్షల క్వింటాళ్లుగా అంచనా వేయబడిందని అధికారులు తెలిపారు. మెరుగైన ఉత్పత్తి మరియు కనీస మద్దతు ధర కారణంగా రైతులు అధిక దిగుబడులు, రాబడులు సాధించినట్లు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో, ఎకరానికి సగటున 25 క్వింటాళ్ల దిగుబడి నమోదైందన్నారు. పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంటలో నష్టాలు రావడంతో చాలా మంది రైతులు రెండవ పంటగా జొన్న సాగుకు మారారని వెల్లడించారు. వ్యవసాయ అధికారుల వివరాలు ప్రకారం, ఈ సీజన్‌లో ఈ జిల్లాలో 1.12 లక్షల ఎకరాల్లో జొన్న సాగు చేయగా, గత సంవత్సరాల కంటే దిగుబడి ఎక్కువగా ఉంది. కొంతమంది రైతులు తమ ఇంటి వినియోగం కోసం పంటను నిల్వ ఉంచుకోవడంతో, సుమారు 7 లక్షల క్వింటాళ్ల పంట మార్కెట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 19,889 మంది రైతుల నుంచి ఇప్పటివరకు 5.87 లక్షల క్వింటాళ్ల పంటను సేకరించినట్లు పేర్కొన్నారు. గతేడాది 56 కేంద్రాల ద్వారా 56,000 మెట్రిక్ టన్నుల పంటను సేకరించారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని సేకరణ ఏర్పాట్లను విస్తరించారు. సేకరణ కేంద్రాల సంఖ్య పెరగడం వల్ల రవాణా ఖర్చులు తగ్గి, రైతులు తమ ఉత్పత్తులను సమీపంలోని కేంద్రాల్లో అమ్ముకోవడానికి వీలవుతుందని అధికారులు తెలిపారు. మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అవుతుందని అంచనా. క్వింటాల్‌కు. రూ.3,699 కనీస మద్దతు ధరను నిర్ధారిస్తూ, చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

# మా నాయకుల జోలికొస్తే బిజెపి శక్తి చూపిస్తాం

### కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌పై సిఎం వ్యాఖ్యలు అహంకారపూరితం

### కోహెడ రైతులకు నష్టపరిహారం చెల్లించండి

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** కోహెడలో సర్వే నంబర్ 167/1లో 239 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఫ్రూట్ మార్కెట్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని, అయితే ఈ భూములు రైతులకు చెందినవి. రైతుల నుంచి భూములను సేకరించి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా సరైన నష్టపరిహారం చెల్లించకుండా బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు మండిపడ్డారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఫ్రూట్ మార్కెట్ అందుబాటులో ఉంది. అయినప్పటికీ పక్కనే ఉన్న రైతుల భూములను సేకరించి, వాటిని ఇతర ప్రయోజనాల కోసం వినియోగించే ప్రయత్నం జరుగుతుందని, ఈ భూముల సేకరణను రైతులు మొదటి నుంచే వ్యతిరేకిస్తున్నారని, రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా వారి భూములను స్వాధీనం చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనం అన్నారు. రైతుల భూములు లాక్కొని, రైతులనే అరెస్ట్ చేసి, అదే రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని బయటపెడుతుందన్నారు.

ముఖ్యమంత్రి రాకముందే ఆ ప్రాంతంలోని రైతులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. కార్యక్రమం పూర్తయ్యాక సాయంత్రం వారిని విడుదల చేశారు. రైతులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు.

గత కొద్ది రోజులుగా రైతులు ఆందోళనలు చేస్తూ రోడ్లపైకి వస్తున్నా ప్రభుత్వం వారి విన్నపాలను పట్టించుకోవడం లేదని, మా పార్టీ నాయకులు రైతులకు అండగా నిలుస్తూ ఆందోళనల్లో పాల్గొంటున్నారని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించిందని, రైతులు వ్యతిరేకిసు _న్నప్పటికీ కార్యక్రమం నిర్వహించడం ద్వారా రైతుల అభిప్రా యాలకు ప్రభుత్వానికి విలువ లేదని స్పష్టమవు తుందన్నారు. మరో అంశానికి వస్తే, నిన్న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన సభలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిపై, బండి సంజయ్ కుమార్‌పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని అన్నారు.

పొలిమేర దాటనివ్వను వంటి భాషను ఉపయోగించడం ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. మా నాయకుల జోలికి వస్తే బీజేపీ శక్తి ఏంటో చూపిస్తాం అంటూ రాంచందర్‌రావు హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తమ భాషను అదుపులో పెట్టుకోవాలన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, అన్యాయాలు చేస్తూ ప్రజల మధ్య తిరగాలని భావించడం సాధ్యం కాదన్నారు. ముఖ్యమంత్రి చర్చకు సిద్ధమైతే, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏమిచ్చింది, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఏమిచ్చింది అనే అంశాలపై బహిరంగ చర్చకు మేము సిద్ధంగా ఉన్నామన్నారు. తేదీ, సమయం నిర్ణయిస్తే సెక్రటేరియట్ గేట్ వద్ద అయినా చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేకంగా ఏ అభివృద్ధి కార్యక్రమాలు అందించారో ప్రజలకు వివరించాలన్నారు. రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతుల భూములను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరంగా ఉన్నాయన్నారు.

# 39 మంది భార్యలు.. 94 మంది సంతానం

● ప్రపంచం దృష్టిని ఆకర్షించిన జియోచానా



**ఐజ్వాల్, జూన్ 7:** చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న నినాదానికి భిన్నంగా ఒకే గూటి కింద సుమారు 200 మంది సభ్యులు కలిసి జీవిస్తున్న కుటుంబం ఇపుడు వార్తల్లోకి ఎక్కింది. ఈశాన్య రాష్ట్రమైన మిజోరాంలోని 39 మంది భార్యలు, 94 మంది సంతానంతో ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబానికి యజమానిగా గుర్తింపు పొందిన జియోనా చానా 2021లో కన్నుమూసినప్పటికీ, ఆయన వారసత్వం నేటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆ కుటుంబ సభ్యులందరూ ఇప్పటికీ అదే నివాసంలో అత్యంత సమన్వయంతో, ఐకమత్యంతో మెలుగుతున్నారు. మిజోరాంలోని బక్తావంగ్ గ్రామంలో ఉన్న ఛువాన్ థార్ రన్ అనే నాలుగు అంతస్తుల భారీ భవనంలో ఈ మొత్తం కుటుంబం నివసిస్తోంది. సుమారు 100 గదులతో కూడిన ఈ భవంతిలో ఆ కుటుంబం నివసిస్తోంది. 1945లో జన్మించిన జియోనా చానా, బహుభార్యత్వాన్ని ఆదరించే ఒక ప్రత్యేక క్రైస్తవ మత శాఖకు నేతృత్వం వహించారు. తన 17వ ఏట తొలి వివాహం చేసుకున్న ఆయన, జీవితంలో మొత్తం 39 మందిని వివాహమాడారు. ఈ కుటుంబ యొక్క దైనందిన కార్యకలాపాలు ఒక సైనిక పటాలం తరహాలో అత్యంత క్రమశిక్షణతో సాగుతాయి. సభ్యులందరూ బాధ్యతలను సమానంగా పంచుకుంటారు. వీరి వంటశాల సైతం భారీ పరిమాణంలో ఉంటుంది. ఇక్కడ నిత్యం 45 నుంచి 90 కిలోల బియ్యంతో పాటు, భారీ మొత్తంలో కూరగాయలు, పప్పు దినుసులను వండుతారు. జియోనా భార్యలు వంటశాలలోని వంట బాధ్యతలను నిర్వర్తించగా, మగపిల్లలు వారి వ్యవసాయం, ఇతర వృత్తి పనుల్లో నిమగ్నమవుతారు. జియోనా చానా తన గ్రామంలో వ్యవసాయం, పశుపోషణ, వడ్రంగి వంటి వృత్తులను ప్రోత్సహిస్తూ స్వయం సమృద్ధికి బాటలు వేశారు. ఈ కుటుంబం అనుసరిస్తున్న విశిష్ట జీవనశైలి అంతర్జాతీయ మీడియా దృష్టిని సైతం ఆకట్టుకుంది. ఈ అరుదైన జీవన విధానం వల్ల ప్రఖ్యాత రిప్లేస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్ పుస్తకంలోనూ వీరికి చోటు దక్కింది. జియోనా చానా 2021 జూన్ 13న తన 76వ ఏట కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, కుటుంబ సభ్యులు నేటికీ అదే ఐక్యతను, క్రమశిక్షణను చాటుతూ జీవిస్తుండటం గమనార్హం.



# కోట్లకు పడగలెత్తిన ఇంజినీర్

## లెక్కలేనన్ని ఆదాయానికి మించిన ఆస్తులు

**భువనేశ్వర్, జూన్ 7:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని ఆరోపణలపై ఒడిశాలో ఒక ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇళ్లపై జరిగిన విజిలెన్స్ దాడులు సంచలనం సృష్టిస్తున్నాయి. కంధమాల్ జిల్లా బాలిగూడలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లో పనిచేస్తున్న వైకుంఠ నాథ్ బెహెరా ఇళ్లు, కార్యాలయాలపై ఒడిశా విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులతో పాటు భారీగా నగదు లభించాయి. బెహెరా 1999లో కేవలం రూ. 6,000 నెలసరి వేతనంతో జూనియర్ ఇంజనీర్‌గా ప్రభుత్వ సర్వీసులో చేరారు. వివిధ నిర్మాణాలలో పదోన్నతులు పొందుతూ ఇటీవల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన నెలకు సుమారు రూ. 80 వేల జీతం పొందుతున్నారు. అయితే, ఈ 27 ఏళ్ల సర్వీసులో ఆయన సంపాదించిన అధికారిక ఆదాయానికి, ప్రస్తుతం బయటపడ్డ ఆస్తులకు ఎక్కడా పొంతన లేకపోవడంతో అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భువనేశ్వర్‌లోని ప్రత్యేక విజిలెన్స్ కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ల ఆధారంగా భువనేశ్వర్, బాలాసోర్, జాజ్‌పూర్, బాలిగూడ సహా మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. అధికారులు బెహెరా, ఆయన భార్య పేరిట ఉన్న బ్యాంక్ లాకర్ల నుంచి దాదాపు రూ. 2.04 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదును లెక్కించడానికి ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను ఉపయోగించాల్సి వచ్చింది. దాంతో పాటు దాదాపు 341 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 45 లక్షలకు పైగా బ్యాంక్ డిపాజిట్లను గుర్తించారు. భవనాలు, స్థలాల విషయానికి వస్తే భువనేశ్వర్‌లోని ప్రముఖ ప్రాంతాలలో సుమారు 17వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 5 బహుళ అంతస్తుల విలాసవంతమైన భవనాలు బయటపడ్డాయి. అలాగే భువనేశ్వర్, జాజ్‌పూర్, బరిపద ప్రాంతాలలో దాదాపు 13 నుంచి 14 ఖరీదైన ప్లాట్లను అధికారులు గుర్తించారు.

# న్యాయపోరాటంలో సుకన్యకు భారీ ఊరట

**రూ.10లక్షలు పరిహారం చెల్లించాలని సన్‌టీవీ నెట్‌వర్క్‌కు హైకోర్టు ఆదేశం**

**చెన్నై, జూన్ 7:** మూడు దశాబ్దాల సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత ప్రముఖ నటి సుకన్యకు ఊరట లభించింది. తన పరువుకు నష్టం కలిగించేలా గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌తో చేసిన ఇంటర్వ్యూను ప్రసారం చేసిందన్న కేసులో సన్ టీవీ నెట్‌వర్క్స్‌కు మద్రాస్ హైకోర్టులో షాక్ తగిలింది. సుకన్యకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 1996 ఏప్రిల్ 17న సన్ టీవీలో ప్రసారమైన నేరుక్కు నేర్ అనే కార్యక్రమంలో ఈ వివాదం మొదలైంది. తమిళ పత్రిక నక్కీరన్ ఎడిటర్ ఆర్.ఆర్. గోపాల్ వీరప్పన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వీరప్పన్ నటి సుకన్యకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమారుడితో అక్రమ సంబంధం ఉందని నిరాధార ఆరోపణలు చేశాడు. 1996 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సుకన్యకు సంబంధించిన కొన్ని వీడియోలను ఉపయోగించుకున్నారని కూడా వ్యాఖ్యానించాడు. వీరప్పన్ చేసిన ఈ వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, ఇవి సమాజంలో తన గౌరవానికి, కీర్తి ప్రతిష్టలకు తీవ్ర నష్టం కలిగించాయని సుకన్య కోర్టును ఆశ్రయించారు. ఈ ఆరోపణలు తనను మానసికంగా కుంగదీశాయని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2015లో ట్రయల్ కోర్టు సుకన్యకు అనుకూలంగా తీర్పు ఇచ్చి, రూ.10,00,500 నష్టపరిహారం చెల్లించాలని సన్ టీవీని ఆదేశించింది. దీనిపై సన్ టీవీ నెట్‌వర్క్ మద్రాస్ హైకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ అప్పీలును విచారించిన జస్టిస్ కె. కుమారేశ్ బాబు నేతృత్వంలోని ధర్మాసనం, సన్ టీవీ వాదనలను తోసిపుచ్చింది. ఇంటర్వ్యూను ప్రసారం చేసే ముందు దానిలోని అభ్యంతరకర, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలను ధ్రువీకరించుకోకపోవడంలో, వాటిని తొలగించడంలో బ్రాడ్‌కాస్టర్ విఫలమైందని కోర్టు స్పష్టం చేసింది. కార్యక్రమంపై పూర్తి ఎడిటోరియల్ నియంత్రణ ఉన్నప్పటికీ, వివాదాస్పద కంటెంట్ ఎడిట్ చేయకుండా ప్రసారం చేయడం తప్పేనని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ, సుకన్యకు నష్టపరిహారం చెల్లించాలని తుది తీర్పు వెలువరించింది. సుకన్య 1980, 90వ దశకాల్లో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి, దక్షిణాది సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన విషయం తెలిసిందే.

# ఇండియా కూటమి భేటీపై నీలినీడలు

● డిఎంకె, ఆప్ పార్టీలు దూరం ● నేడు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియాకూటమి నేతల భేటీ!



**న్యూఢిల్లీ, జూన్ 7:** ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇండియా కూటమిలోని పార్టీలకు షాక్‌లు తగులుతున్న సంగతి తెలిసిందే. ప్రత్యేకించి పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీపార్టీ టిఎంసీ ఘోరపరాజయం ఆపార్టీకి పెద్దషాక్ అనే చెప్పాలి ఈ క్రమంలో సోమవారం ఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి పార్టీల సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. తమ కూటమి ఇప్పటికీ శక్తివంతంగానే ఉందని, సమిష్టిగానే ఉందన్న సంకేతాలను పంపించేందుకు గాను ఇండియా కూటమినేతలు ఈ భేటీని ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 23 పార్టీలు సోమవారం ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశానికి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి, ఎంపి కెసి వేణుగోపాల్ స్పష్టం చేసారు. భారత్‌లాగే తమ ఇండియా జన్‌బంధన్ కూడా సమిష్టిగా సమైక్యంగా కొనసాగుతుందని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఈ కీలక సమావేశానికి డిఎంకె హాజరుకాకూడదని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ తమకు ద్రోహంచేసిందని ఆపార్టీ ఇండియా నుంచే వైదొలగాలని నిర్ణయించుకుంది. అలాగే కేరళలో బిజెపితో వామపక్షాలు కుమ్మక్కయ్యాయన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలపై సిపిఎంకూడా అసంతృప్తితో ఉంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి ఇటీవలే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకు లేఖను కూడా రాసారు. సీనియం కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూటమిలో అనైక్యతకు దారితీస్తుందని కూడా హెచ్చరించారు. విపక్ష పార్టీలమధ్య ఐక్యతను మరింత పెంచేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు కూటమి అగ్రజులు చెపుతున్నారు. అయితే ఆమ్ ఆద్మీపార్టీ అందరికంటేముందుగానే ఈ కూటమినుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. ఇదిలా ఉంటే సోమవారం నాటి ఇండియా సమావేశానికి టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీకూడా హాజరు కావచ్చుని ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్‌క్లబ్‌లో ఈ భేటీ జరగనున్నది. టిఎంసి ఎంపి డెరెక్ ఓబ్రెయిన్‌మాట్లాడుతూ ఇండియా కూటమి సమైక్యంగా ఉందన్న సంకేతాలుప్రజల్లోకి బలంగా వెళ్లాలని అందుకోసమే తమ ఐకమత్యం చాటి చెప్పేందుకు ఈసమావేశం జరుగుతుందన్నారు. కొన్ని పార్టీలు భేటీకి రాలేమని చెప్పినా వారంతా కూడా మోడీ కార్యాచరణలు, చర్యలను వ్యతిరేకిస్తూనే ఉన్నారని, వారి సొంత కారణాలపై హాజరుకాలేకపోతున్నట్లు చెప్పారని కాంగ్రెస్ జైరామ్‌రమేష్ వెల్లడించారు. సమావేశానికి ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియా, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదిపార్టీనుంచి అఖిలేష్ యాదవ్, ఆర్జేడి నుంచి తేజస్వియాదవ్, శివసేన యుబిటి ఉద్ధవ్‌థాక్రే సిపిఐ, సిపిఎం పార్టీలు కూడా హాజరు అవుతాయని కాంగ్రెస్ నేతలు వెల్లడించడాన్ని చూస్తే ఢిల్లీ ఇండియా భేటీ అత్యంత కీలకం కానున్నదని తెలుస్తోంది.



# తుదిడీల్ విఫలం అయితే ఇరాన్‌కు చావుదెబ్బ తప్పదు!

● అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూన్ 7:** పశ్చిమాసియాలో కాల్పుల విరమణపై జరుగుతున్న చర్చల్లో సహేతుకమైన డీల్‌కు రానిపక్షంలో ఇరాన్ ఆమూలాగ్రం ధ్వంసం చేయడం ఖాయమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పష్టంచేసారు. అయితే డీల్ కుదురుతుందని తనకు ఎంతో నమ్మకం ఉందని, ఒకవేళ సంప్రదింపులు విఫలం అయితే ఇక ఇరాన్‌కు నరకమేనని హెచ్చరించారు. అలాగే డీల్‌కు రానిపక్షంలో తాను ఇరాన్ ఆస్తుల స్తంభననుంచి తొలగించబోనని అన్నారు. డీల్ కుదిరిన తర్వాతనే ఇరాన్ ఆస్తులపై స్తంభన ఉత్తర్వులు తొలగించే అంశం పరిశీలిస్తానన్నారు.

అలాగే కొన్ని ఆంక్షలు కూడా ఎత్తివేయడం జరుగుతుందని డీల్‌కు రానిపక్షంలో ఇవేమీ ఉండవని హెచ్చ రించారు. అయితే ఇరాన్ సుమారు 24 బిలియన్ డాలర్ల ఆస్తులపై అమెరికా ఆంక్షలు విధించిందని, వాటన్నింటినీ ఎత్తివేసిన తర్వా తనే డీల్‌కు వస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే గల్ఫ్‌దేశాల్లో జరిగిన నష్టాన్ని భర్తీచేసేందుకు ఇరాన్ ఆస్తులనుంచే చెల్లించాలని అమెరికా ట్రెజరీశాఖ భావిస్తోంది. ఇందుకు ఇరాన్ సుతరాము అంగీకరించడం లేదు. అలా అయితే ఇరాన్‌లో ఇజ్రాయెల్ అమెరికా దాడులవల్ల జరిగిననష్టానికి పరిహారం ఖచ్చితంగా ఇస్తామని చెపితేనే డీల్‌కు వస్తామని తెగేసి చెపుతోంది. అదేవిధంగా శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ ఎక్కడ దాచిందోకూడా తమకు ఆప్రాంతం తెలుసునని ఏదో ఒకరోజు స్వాధీనంచేసుకుంటామని స్పష్టంచేసారు. మేం స్వాధీనంచేసకుని ఆ యురేనియంను ధ్వంసం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ఎన్బీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ హెజ్‌బొల్లాపై మరిన్ని మెరుపుదాడులు ఉంటాయని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా సమస్యను ఇరాన్‌తో జరిగే డీల్‌లో ఉండకూడదనే తాను చెపుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులుచేసిన సంఘటనలున్న సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాతకూడా ఇజ్రాయెల్‌కాల్పులకు తెగబడిందని లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ఆరోపించింది. హెజ్‌బొల్లాపై మరిన్ని దాడులు చేయాల్సిందేనని ట్రంప్ నొక్కిచెప్పారు. ఇరాన్ డీల్‌లో లెబనాన్‌ను చేర్చాలన్న టెహ్రాన్ షరతును అంగీకరిస్తారా అంటే ట్రంప్ లేదు కానేకాదని చెప్పారు. ఇరాన్‌డీల్ వేరు, లెబనాన్ ఇజ్రాయెల్ హెజ్‌బొల్లా సమస్యవేరని అన్నారు. ఇజ్రాయెలీ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతోజరిగిన ఫోన్ కాల్‌చర్చల్లో నెతన్యాహును తీవ్ర స్థాయిలో మందలించినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ట్రంప్ ఇపుడు హెజ్‌బొల్లా పై మరిన్ని మెరుపుదాడులు చేస్తామని చెప్పడం కాల్పుల విరమణ నిలిచినట్లేననిపిస్తోంది. మార్చి రెండవ తేదీ నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 3560 మంది లెబనాన్ ప్రజలు, జర్నలిస్టులు, చిన్నపిల్లలు చనిపోయారు. అలాగే 29 మంది ఇజ్రాయిలీ సైనికులు, ఒక కాంట్రాక్టరు కూడా చనిపోయినట్లు ఇరుదేశాలు పరస్పరం ఆరోపించుకున్నాయి. ప్రస్తుతం కాల్పుల విరమణను రెండుదేశాలు కూడా పాటిస్తున్నట్లుగా లేదు. శాంతిసయోధ్యకు మేం సిరియాను విశ్వసిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. సిరియాలో అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా మంచి నాయకుడని, అమెరికాకు మంచి మిత్రుడని ట్రంప్ పేర్కొన్నారు. సిరియా ప్రజలు ఒక మంచినేతను ఎన్నుకున్నారని ప్రశంసించారు.

# ట్రంప్ టీమ్ నుంచి తప్పకోనున్న ఎఐ సీనియర్ సలహాదారు

**వాషింగ్టన్, జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సీనియర్ సలహాదారుగా పనిచేసిన భారత సంతతికి చెందిన శ్రీరామ్ కృష్ణన్ తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నెలాఖరులో టెక్నాలజీ సలహాదారు పదవి నుంచి దిగిపోనున్నారు. ఆయన ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌లో అమెరికా ఎఐ విధానాలను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ట్రంప్‌తో కలిసి పనిచేయడం తనకు లభించిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఎఐ పోటీని తట్టుకొని దేశం మరింత ముందుకు వెళ్లడానికి అధ్యక్షుడు కీలక చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వం లేకుండా అమెరికా ఎఐ రేసులో ముందంజలో ఉండేది కాదన్నారు.

తాను అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అమెరికా అభివృద్ధి కోసం పని చేశానని శ్రీరామ్ కృష్ణన్ అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా తాను అమెరికన్ ఎఐ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, ప్రచురించడంలో సహాయపడ్డానని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కోసం నేషనల్ ఎఐ పాలసీ ఫ్రేమ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై పనిచేసినట్లు తెలిపారు. ఫ్రాన్స్, భారత్ వంటి దేశాలలో జరిగిన అంతర్జాతీయ ఫోరమ్‌లు, సదస్సుల్లో అమెరికన్ ఎఐ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించానని పేర్కొన్నారు. కొంత విరామం తర్వాత ఎఐ విషయంలో అగ్రరాజ్యం ఎదుర్కొంటున్న భారీ సవాళ్లను అధిగమించడానికి సాయం చేస్తానని తెలిపారు.

ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సలహాదారుగా శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించారు. అంతకుముందు వెంచర్ క్యాపిటలిస్ట్‌గా వ్యవహరించిన ఆయన.. అమెరికాలో కృత్రిమ మేధస్సు విధానాలు, జాతీయ ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి టెక్ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేశారు.

# టోలెడో ఫెస్టివల్‌లో కాల్పులు

## 12 మందికి గాయాలు

**టోలెడో(ఓహియో), జూన్ 7:** అమెరికాలో తుపాకి సంస్కృతి పెచ్చు మీరుతోంది. ఒహియో రాష్ట్రంలోని టోలెడో నగరంలో శనివారం సాయంత్రం జరిగిన ఓల్డ్ వెస్ట్ ఎండ్ ఫెస్టివల్ లో దుండగులు జరిపిన కాల్పుల్లో కనీసం 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, పండుగ వాతావరణంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురవడంతో జనం ప్రాణాలు చేతబట్టుకుని పరుగులు తీశారు. చారిత్రాత్మక నగరమైన టోలెడోలో 53వ వార్షిక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లైవ్ మ్యూజిక్, ఫ్యామిలీ ఈవెంట్లతో కుటుంబాలన్నీ పండుగను ఆస్వాదిస్తున్న తరుణంలో సాయంత్రం 5:37గంటల ప్రాంతంలో డెలావేర్, గ్లెన్‌వుడ్ అవెన్యూల సమీపంలో ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకరిపై ఒకరు పరస్పరం కాల్పులు జరుపుకోగా, అక్కడ గుమిగూడిన సామాన్య ప్రజలు ఈ క్రాస్‌ఫైరింగ్‌లో చిక్కుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. టోలెడో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రక్షించారు. గాయపడిన వారిలో 14 ఏళ్ల మైనర్ల నుంచి 61 ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నారని డిప్యూటీ పోలీస్ చీఫ్ జో హెఫెర్నన్ తెలిపారు. ఘటనా స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి, బాధితులను వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటన తర్వాత ఉత్సవానికి సంబంధించిన మిగిలిన అన్ని కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు స్థానిక యంత్రాంగం ప్రకటించింది. కాల్పులకు తెగబడిన నిందితులెవరూ ఇప్పటి వరకు పోలీసులకు చిక్కలేదు. ఘటనా స్థలం నుంచి పరారైనట్లు అధికారులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పండుగకు వచ్చిన వారు తమ మొబైల్స్‌లో తీసిన ఫోటోలు లేదా వీడియోలను దర్యాప్తు కోసం అందించాలని పోలీసులు కోరారు. ఈ కాల్పుల ఘటనను ఒహియో గవర్నర్ మైక్ డివైన్ తీవ్రంగా ఖండించారు.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు

## సాగు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.1,306 కోట్ల వ్యయం

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** తెలంగాణలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాత విద్యుత్ మీటర్ల స్థానంలో వీటిని దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బిల్లింగ్ నష్టాలను నివారించడానికి, ఆదాయ వసూళ్లను మెరుగుపరచడానికి వినియోగదారులు, ట్రాన్స్‌ఫార్మరు, ఫీడర్ల కోసం స్మార్ట్ మీటర్లను పెద్ద ఎత్తున అమర్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే సమయంలో పంపిణీ మౌలిక సదుపాయాలుకు సంబంధించి వ్యవసాయ ఫీడర్లను వేరు చేయడం (సౌరశక్తి కోసం పిఎంకుసుమ్‌తో అనుసంధానించడం), హై వోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (హెచ్‌విడిఎస్) ను ఏర్పాటు చేయడం, సబ్‌స్టేషన్లను బలోపేతం చేయడం ద్వారా నెట్‌వర్క్‌లను ఉన్నతీకరించడం వంటి కార్యాక్రమాలను నిర్వహించనుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 30.33 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటికి సంబంధించి మొత్తం 5.22 లక్షల డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ కు రాష్ట్ర విద్యుత్ నియంరతణ కమిషన్ నుండి (ఈఆర్‌సీ) లైసెన్స్ రాగానే ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయనుంది. ఇందుకు గాను ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై రూ.25 వేల చొప్పున వ్యయం అంవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల ఏర్పాటుకు గాను రూ.1,306 కోట్ల మేర ఖర్చవుతుందని విద్యుత్ శాఖ ప్రతిపాదించింది. ఇక ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు టెండర్లు పిలవనున్నారు. టెండర్ దక్కించుకున్న కంపెనీల ద్వారానే మీటర్ రీడింగ్, గ్రామాల్లో లైన్ల నిర్వహణ పనులు చేయించేలా విద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్ కూడా సిద్ధం చేస్తోంది. ఈఆర్‌సీ లైసెన్స్ మంజూరైన తర్వాతే ఏ ప్రణాళికతో ముందుకు వెళ్లాలనేది ఖరారు కానుంది.

# 'ఫీజులు నియంత్రించండి'

**హైదరాబాద్, జూన్ 7 ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే హక్కుగా కాకుండా, కార్పొరేట్ సంస్థలకు లాభాల వనరుగా రాష్ట్ర ప్రభుత్వ మార్చిందని బిజెపి జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారానికి గురిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం మౌనంగా ఉండటం బాధాకరమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువుల కోసం ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఫీజుల పెంపును గరిష్టంగా 8శాతానికే పరిమితం చేయాలని కోరారు.

# బెంగాల్‌లో ప్రధాన విపక్షంగా మారేందుకు కాంగ్రెస్ ఆరాటం!



**న్యూఢిల్లీ, జూన్ 7:** బెంగాల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లు మాత్రమే గెల్చుకున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో ఉన్న రాజకీయ సంక్షోభాన్ని తమ పార్టీ ఎదుగుదలకు ఉపయోగించుకోవాలని ఆరాట పడుతున్నది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా మారాలని ఆశపడుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీ, లోక్‌సభ మాజీ డిప్యూటీ లీడర్ అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) క్రమేపీ కనుమరుగవుతున్నదని, ఎందుకంటే ఆ పార్టీ కాంగ్రెస్ వ్యతిరేక భావనల మీదే బలపడిందని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలిపోయి పూర్తిగా బలహీనపడటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటానికి ఇది బంగారు అవకాశమని వ్యాఖ్యానించారు. టిఎంసి కమ్యూనిస్ట్ వ్యతిరేక భావజాలంపై పుట్టిన పార్టీ అని, దశాబ్దాలుగా పాలిస్తున్న కమ్యూనిస్టులను అధికారానికి దూరం చేయడంలో ఆ పార్టీ పూర్తిగా కృతకృత్యమైందని, ఆ పార్టీకి సైద్ధాంతిక పునాది లోపించిందని అన్నారు. గత కొన్నేండ్లుగా ఆ పార్టీ గూండాయిజం, రాజకీయ హింస, ప్రజాకర్షక ధోరణిని అవలంబిస్తున్నదని, వీటిని నమ్ముకున్న పార్టీ ఏదో ఒక రోజు కుప్పకూలక తప్పదని, ఈ విషయాన్ని తాను చాలానాళ్ల క్రితమే ఊహించానని ఆయన తెలిపారు. టీఎంసీ ఒక స్వల్పకాలిక అద్భుతమని, ఎందుకంటే దానికి రాజకీయ సిద్ధాంతం లేదని, దానిని పార్టీలా కన్నా ఒక ప్రైవేట్ క్లబ్‌లా నిర్వహించారని ఆరోపించారు. అందుకే ఎంత వెలుగు వెలిగిందో చివరకు అంతే వేగంగా మసకబారిపోయిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ పటిష్టం అయ్యేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నాయని అధిర్ రంజన్ చౌదరి తెలిపారు. తమ పార్టీకి పటిష్ఠ వ్యవస్థ లేకపోయినప్పటికీ రాష్టమంతటా ఉనికి ఉందన్నారు. కొన్ని దశాబ్దాలుగా తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా మద్దతుదారులు అంతటా ఉన్నారని తెలిపారు. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో తాము పార్టీ సిద్ధాంతాలను ఓటర్లలోకి విస్తృతంగా తీసుకుపోయి వారి విశ్వాసాన్ని పొందాలని, మెల్లగా ప్రతిపక్షం స్థానాన్ని ఆక్రమించాలని అన్నారు.

# టిఎంసి ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో నిరసన



**కోల్‌కత్తా, జూన్ 7:** టీఎంసి నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా కు చేదు అనుభవం ఎదురైంది. కమార్‌హాటీ నియోజకవర్గంలోని అరియాదయా ప్రాంతంలో కొంత గందరగోళ పరిస్థితులున్నాయనే సమాచారంతో ఆయన అక్కడకు వెళ్లారు. అప్పటికే అక్కడకు చేరుకున్న స్థానికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కొందరు ఆగ్రహంతో కోడిగుడ్లు విసరడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. దాంతో ఎమ్మెల్యే కాన్వాయ్ అక్కడి నుంచి ముందుకు వెళ్లిపోయింది. దాడి ఘటనపై మదన్ మిత్రా స్పందిస్తూ ఈ ఘటన పూర్తిగా ముందస్తు వ్యూహంతో జరిగినదేనని, బీజేపీ మద్దతుతోనే కొందరు దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే దాడి సమయంలో తాను వాహనంలో లేనని, తన డ్రైవర్‌పై దాడి జరిగిందని చెప్పారు. కాగా దశాబ్దాలుగా కట్ మనీ పేరుతో స్థానిక నేతలు తమవద్ద బలవంతంగా డబ్బులు వసూళ్లు చేశారని, వాటిని తిరిగి ఇవ్వాలని ఆటోరిక్షా, ఈరిక్షా డ్రైవర్లు చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది.

# నన్నెవరూ రాజీనామా చేయాలని కోరలేదు



**కోల్‌కత్తా, జూన్ 7:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కోసం ఎంపీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ తనను కోరినట్లు వస్తున్న వార్తలపై మాజీ క్రికెటర్, టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ వివరణ ఇచ్చారు. ఆ వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. తననెవరూ రాజీనామా చేయమని కోరలేదని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో ఒక వార్త వైరల్ అవుతోందని పఠాన్ అన్నారు. బెర్హంపూర్ లోక్‌సభ స్థానానికి తాను రాజీనామా చేస్తున్నానని, తద్వారా మమతా బెనర్జీ అక్కడ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోందని, అందులో నిజం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై మమతా బెనర్జీ తనతో ఎప్పుడూ చర్చించలేదని, పార్టీలోని ఏ ఒక్క నాయకుడు కూడా తనను రాజీనామా చేయమని అడగలేదని, ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని యూసుఫ్ పఠాన్ కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన ఈ విషయాన్ని ఓ వీడియోలో పేర్కొన్నారు.

# హామీల అమలులో బిజెపి సర్కార్ దూకుడు



**కోల్‌కత్తా, జూన్ 7:** బీజేపీ ప్రభుత్వంపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య భార్య మీరా భట్టాచార్య ప్రశంసలు కురిపించారు. రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం హామీలను వేగంగా అమలు చేస్తోందని ఆమె అన్నారు. బెంగాలీ మీడియా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం కేవలం కొన్ని రోజుల్లోనే హామీలను అమలు చేయడం ప్రశంసనీయం అని, హామీల అమలు వేగాన్ని చూస్తే సంతోషంగా ఉందని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం కోసం పనిచేస్తున్న వారు గౌరవానికి అర్హులు అని ఆమె మాట్లాడారు. సీఎం సువేందు అధికారి గురించి మాట్లాడుతూ ఆయనను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదని, కానీ బెంగాల్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తారనే ఆశాభావం ఉందని చెప్పారు. పాలన విషయంలో టీఎంసీ, లెఫ్ట్ ప్రభుత్వానికి పోలిక లేదని చెప్పారు. లెఫ్ట్ 34 ఏళ్ల పాలన, టీఎంసీ 15 ఏళ్ల పాలనకు మధ్య పోలికను తోసిపుచ్చారు. నందన్, విద్యాసాగర్ సేతు, సాహిత్య అకాడమీ, శిశు కిషోర్ అకాడమీ వంటి అనేక కీలక సంస్థలు, మౌలిక సదుపాయాలను స్థాపించిన ఘటన లెఫ్ట్ ప్రభుత్వానిది అని, వ్యవసాయంలో బెంగాల్‌ను దేశంలో అగ్రగామిగా చేసిందన్నారు. సింగూర్ వివాదాన్ని ప్రస్తావిస్తూ టాటా మోటార్స్ ఆటోమొబైల్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకించినందుకు చాలా మంది స్థానికులు ఇప్పుడు బాధపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఒక వేళ ఈ ఫ్యాక్టరీ స్థాపించబడి ఉంటే బెంగాల్ ఆర్థిక ముఖచిత్రమే మారిపోయేదని చెప్పారు. తన భర్త బుద్ధదేవ్ భట్టాచార్య విజన్ ఈ ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కల్పించడం ఆయన లక్ష్యమని చెప్పారు.

# తిరుచ్చి ఈస్ట్ నుంచి లారెన్స్ పోటీ?



## 11న క్లారిటీ ఇస్తానన్న రాఘవ

**చెన్నై, జూన్ 7:** నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ రాజకీయ అరంగేట్రంపై తమిళనాట జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం టీవీకే తరఫున ఆయన తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేయబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. స్పందించిన లారెన్స్ కూడా తన భవిష్యత్తుకు సంబంధించి ఒక అత్యంత కీలకమైన సమాచారం 11న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ స్పందన ద్వారా ఉత్కంఠను మరింత పెంచారు. ఈ ఊహాగానాలకు తెరదించడానికే ఈ ప్రకటన చేస్తున్నానని ఆయన తన నోట్‌లో పేర్కొన్నారు. తాను ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ సమర్పణలో వస్తున్న బెంజ్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, ఈనెల 10తో ముగుస్తుందని, తన ప్రకటనకు ముగింపు ఇస్తూ లారెన్స్ మరింత ఆసక్తిని రేకెత్తించారు. 11న మా అమ్మ ఆశీస్సులతో ప్రకటిస్తా అని వెల్లడించారు. అయితే లారెన్స్ నిజంగానే రాజకీయాల్లోకి వస్తారా వస్తే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారు. పొలిటికల్ ఎంట్రీ గురించే ప్రకటన చేస్తారా లేదటే మరేదైనా విషయం ప్రకటిస్తారా అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే ఈనెల 11 వరకు ఆగాల్సిందే.

# అన్నీ చెప్పేస్తున్నారా ?



**భార్యాభర్తల మధ్య ఎంత ప్రేమైనా ఉండొచ్చు. కానీ కొన్ని హద్దులు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. అవే భవిష్యత్తులో మీరు**

పెళ్లి నిశ్చయం అవగానే అతనితో ప్రతి చిన్న విషయాన్నీ చర్చించడం మొదలు పెడుతున్నారా? ఈ తీరు సరి కాదు. అప్పటికి అవి సంతోషంగా అనిపించినా తర్వాత అవే సమస్యలుగా మారతాయి. మన ఇష్టాయిష్టాలను పంచుకోవడంలో తప్పులేదు. కానీ మన గతం గురించి పూసగుచ్చినట్లు ప్రతిదీ చెబితే భవిష్యత్తులో వైవాహిక జీవితంలో సమస్యలు తలెత్తవచ్చు. మీ బలహీనతలను అవతలి వారితో విపులంగా పంచుకోవడమూ మంచిది కాదు. భవిషత్తులో అవే వారికి ఆయుధాలుగా మారతాయి. మనమధ్యలో డబ్బు ప్రస్తావన రాకూడదు లాంటి మాటలు పక్కనపెట్టి.. ఆర్థికాంశాల గురించి తప్పనిసరిగా మాట్లాడుకోవాలి. జీతం.. ఖర్చులు వంటివి ముందుగానే ప్రణాళిక వేసుకుంటే మంచిది. ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఇంటిపని పంచుకోవడం వంటివి చర్చించు కోవడం తప్పనిసరి. అవతలి వ్యక్తి వీటికి సానుకూలంగానే ఉన్నారా తెలుసుకోండి. లేదంటే పెళ్లి తర్వాత చిన్న విషయాలు అనుకున్నవే పెద్దగా మారి ఇబ్బందులు తెచ్చిపెడతాయి. ఏదో అనుకుంటాంగానీ ఇరువురి మధ్య పొరపొచ్చాలుండరాదని, ఇలాంటి విషయాలను అవతలివారు ఎలా గ్రహిస్తారో అంచనా వేసుకోవాలి.

# శివుడి అనుమతి



**సీతాపరహరణం తర్వాత** రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుంటే.. వాళ్లకో మనోహర మైన ప్రాంతం కనిపించింది. సీతమ్మ వారి జాడ తెలిసేవరకూ అక్కడే నివసించాలను కున్నాడు శ్రీరాముడు. అతడి సంకల్పాన్ని బలపరి చాడు లక్ష్మణుడు. సోదరా! నాతో ఏకీభవించినందుకు సంతోషం. అయితే ఇదెవరిదో తెలుసుకోవాలి. వారి అనుమతి లేకుండా ఉండటం భావ్యం కాదు కదా! కనుక చుట్టుపక్కల ఎవరైన ఉన్నారేమో చూడు, వారితో మాట్లాడుదాం అన్నాడు రాముడు. వెంటనే లక్ష్మణుడు పరిసరాలను పరిశీలిస్తూ కొంత దూరం వెళ్లగా.. ఉసిరి మారేడు చెట్ల మధ్యన శివాలయం కనిపించింది. కాని అక్కడెవరు లేదు. తిరిగొచ్చి సంగతి తెలియజేశాడు. అయితే ఈ ప్రాంతానికి పరమ శివుడే అధిపతి అయ్యాండు. అనుమతి తీసుకో లక్షణా అన్నాడు రాముడు. లక్ష్మణుడు శివాలయం వద్దకు వెళ్లి, శివుడి ఆజ్ఞకై అర్థించాడు. వెంటనే శివలింగం నుంచి ఉజ్వలంగా ఉన్న మూర్తి వెలువడి, అద్భుతంగా నృత్యం చేసి అదృశ్యమైంది. అలా ఎందుకు జరిగిందో దాని భావం ఏమిటో లక్ష్మణుడికి అర్థం కాలేదు. సోదరుడి వద్ద వచ్చి విషయం చెప్పాడు. రాముడు చిన్నగా నవ్వి. సోదరా శివుడి ఆజ్ఞ లభించింది. కుటీరం నిర్మించు అన్నారు.

ఆజ్ఞ ఎప్పుడు లభించింది ఆశ్చర్యంగా అడిగాడు లక్ష్మణుడు. లక్ష్మణా మితిమీరిన స్వార్థం, జివ్వా చాపల్యం, కామ వికారాలే కష్టాలకు మూలం. వీటిని గనుక నియంత్రించు కోగలిగితే..ఇక్కడే కాదు ఎక్కడైనా సుఖంగా జీవించవచ్చు. ఈ మూడింటినీ మనం నిగ్రహించుకోగలమని పరమ శివుడు గ్రహించాడు. కనుకనే నృత్యభంగిమలో దర్శనమిచ్చి తన అంగీకారాన్ని తెలియజేశాడు అంటూ వివరించాడు శ్రీరాముడు.

సౌందర్య పోషణ

# నిగ నిగల కురులు నీ కేశ సౌందర్యం



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఈ వీడియాల్లో ఎక్కువగా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది కత్రినా ఒత్తైన, నిగనిగలాడే కురులు వాటి అందాలు పొగడతరమా! సాధారణంగా ప్రసవం తర్వాత చాలా మంది మహిళలు జుట్టు రాలడం, పలచబడటం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఈ మధ్యనే ఆమె 'విహాన్'కు తల్లయ్యారు. ఐనా కత్రినా జుట్టు మాత్రం అందుకు భిన్నంగా మరింత ఆరోగ్యంగా, ఒత్తుగా, మెరుస్తూ కనిపించడంతో అభిమానులు ఆశ్చర్య పోయారు. తన జుట్టు సౌందర్యం వెనుక ఖరీదైన సెలూన్ ట్రీట్మెంట్లు గానీ, లగ్జరీ ఉత్పత్తులు గానీ లేవని కత్రినా ఎప్పుడూ చెబుతుంటారు. ఐనా వీక్షకులు కొట్టి పడేసేవారు. . తన అత్త వీణాకౌశల్ స్వయంగా ఇంట్లో తయారుచేసే హెయిర్ ఆయిలే తన ఒత్తైన జుట్టుకు కారణమని ఆమె వివరించారు ఈ నూనెలో ఉల్లిపాయ, ఉసిరి కాయ, అవకాడోలతో పాటు మరికొన్ని పోషక విలువలున్న పదార్థాలను వాడతారని కత్రినా తెలిపారు. ఈ మిశ్రమాన్ని కొన్ని గంటల పాటు తక్కువ మంటపై మరిగించి, ఆ తర్వాత నూనెను తయారు చేస్తారని తెలిపారు. ఎన్ని ఖరీదైన ఉత్పత్తులు వాడినా, చివరకు స్థిరంగా పాటించే సాధారణ పద్ధతులే ఉత్తమ ఫలితా లనిస్తాయని ఆమె స్పష్టం చేశారు. కత్రినా వాడే ఈ నూనెలోని ప్రతి పదార్థానికి జుట్టు సంరక్షణలో ప్రత్యేక స్థానం ఉంది. ఉసిరికాయ (ఆమ్లా): ఉసిరిలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి, తల మాడును ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. సాంప్రదాయ జుట్టు సంరక్షణలో ఉసిరికి పెద్ద పీట వేశారు. ఉల్లిపాయ: ఉల్లిపాయ రసం జుట్టు తెల్ల బడటాన్ని తగ్గించడంతో పాటు, చుండ్రు సమస్యను కూడా నివారిస్తుందని చాలామంది నమ్ముతారు. అవకాడో: సహజసిద్ధమైన నూనెలు, ఆరోగ్య కరమైన కొవ్వులు అవకాడోలో అధికంగా ఉంటాయి. ఇవి జుట్టుకు లోతైన తేమను అందించి, పోషణనిస్తాయి. ముఖ్యంగా పొడిబారిన, నిర్జీవమైన జుట్టుకు మేలు చేస్తుంది. అవకాడో వాడటం వల్ల జుట్టు మృదువుగా, సులభంగా చిక్కులు పడకుండా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# సైకిల్ పండుగలో ఆమె సైతం



**జైపూర్‌కు చెందిన అరవై ఏళ్ల 'వండర్ వనిత' సైక్లిస్టు గురించి ఇప్పుడు తెలుసు కుందాం.**

ఆమె గత పదిహేను ఏళ్లుగా ఎక్కడ సైక్లింగ్ ఛాలెంజ్‌లుగా వెళ్లి పాల్గొంటుంటారు. ఆమె పేరు రేణు సింఘి. 52ఏళ్ల వయసులో సైక్లింగ్ మీద ఇష్టంతో సైక్లింగ్ ఛాలెంజ్‌లను ఎదుర్కొన్నారు. మూడేళ్ల క్రితం ప్రపంచంలోనే అత్యంత కఠినతర మైన లండన్- ఎడిన్ బరో-లండన్ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొంది. ఈ సమయంలో 14,300 మీటర్ల ఎత్తును అధిగమిస్తూ సైకిల్ వేగంగా నడపాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 1900 మంది సైక్లిస్టులు పాల్గొంటారు. ఆరు రోజుల్లో సైకిల్ తొక్కి 15,40 కిలో మీటర్లు వెళ్లాలి. 2022లో ఈ సైక్లింగ్ ఈవెంట్‌లో పాల్గొని రేణుసింఘీ విజేతగా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. సైక్లింగ్ సమయం 124.32 గంటలుగా రికార్డులకెక్కింది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సంకల్ప బలం, పట్టుదల ఉంటే అన్నిటిని అధిగమించి గమ్యాన్ని చేరుకోవచ్చన్నది ఆమె ఎపుడూ చెప్పేమాట. అత్యంత కఠినమైన పారిస్- బ్రెస్ట్- పారిస్ (1,200 కి.మీ) రైడ్‌ను 92 గంటల్లో పూర్తి చేసు కొని ఘనత సాధించారు. సుదూర బ్రెవెట్ సీరిస్‌లను పూర్తి చేసి ఐదుసార్లు రాండోనూర్ హోదాను పొందారు. ఇంతవరకు ఆమె పాల్గొన్న పోటీలన్నింటిలోనూ వెరశి 1.5 లక్షల మీటర్ల సైకింగ్ చేశారంటే నమ్మండి. రెండు రోజుల క్రితం జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంలో కూడా ఈమె ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. సైక్లింగ్ అనేది సుస్థిర జీవనాన్ని, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తుందనే నమ్మకంతో ఆమె ఇప్పటికీ సైక్లింగ్‌ను వదిలిపెట్టలేదు.

# పండ్లు కడిగి తింటే పోలా!



**వేసవిలో పచ్చకాయ నుంచి మామిడి వరకూ ఎన్నో పండ్లను తింటుంటాం. త్వరగా పక్వానికి రావాలని కొన్ని రకాల మందులు వాటిపై చల్లుతుంటారు. ఒకసారి నీటితో శుభ్రం చేస్తే చాలు తినయొచ్చు అనుకుంటాం. కానీ వాటిపై ఉండే రసాయనాలు అంత తొందరగా పోవు. కాబట్టి వీటిని సరైన పద్ధతిలో శుభ్రం చేసి తినాలి.**

ఒక గిన్నెలో నీళ్ల తీసుకొని అందులో స్పూన్ బేకింగ్ సోడా వేసి పండ్లను 15 నిమిషాలు నానబెట్టాలి. తరవాత వాటిని మంచి నీటితో శుభ్రం చేసుకుంటే క్రిములన్నీ తొలగిపోతాయి. మూడు వంతుల నీటికి ఒక వంతు వైట్ వినెగర్ కలపాలి. పండ్లను ఆ మిశ్రమంలో పది నిమిషాలు ఉంచి ఆపై చేత్తో రుద్ది కడిగితే రసాయనాలు తొలగిపోతాయి. స్పూన్ ఉప్పు, చిటికెడు పసుపు కలిపిన నీటిలో పండ్లు వేసి అరగంట పాటు నానబెట్టాలి. ఆపై నీటితో చక్కగా శుభ్రం చేస్తే చాలు. వాటిపై ఉండే బ్యాక్టీరియా తొలగిపోతుంది. ఇవన్నీ చేయలేమనుకుంటే కనీసం మార్కెట్ నుంచి తెచ్చిన పండ్లను వెంటనే నీటిలో ఒక పది నిమిషాల పాటు ఉంచాలి. తరవాత మళ్లీ వేరే నీటితో శుభ్రం చేసుకుని తిన్నా మంచిదే.

# బిర్యాని ఆకు అంటే తక్కువేమీ కాదు!



బిర్యానీ.. పేరు చెబితే చాలు మన ముఖం వెలిగిపోతుంది. నోట్లో నీళ్లూరతాయి. నవాబుల హైదరాబాదీ బిర్యానీ దగ్గర్నుంచి.. కుండ బిర్యానీ వరకూ ఏదైనా సరే.. ఎప్పుడెప్పుడు తిందామా అన్నంత ఊరిస్తుంది. ఆ ఘుమఘుమలకు అసలైన కారణం బిర్యానీ ఆకు. ఇదిపేరుకు బిర్యానీ ఆకే అయినా..కిచిడీ, ఫ్రైడ్ రైస్, మసాలా కూరల్లోనూ వేసి.. వాటి రుచి మరింత పెరిగేలా చేస్తాం. ఇది సువాసనలు గుప్పించడమే కాదండోయే ఇందులో బోలెడన్ని ఔషధ గుణాలూ ఉన్నాయి. మొట్టమొదట ఆ సువాసన.. నోట్లో ద్రవాల ఎఊరించి, తినాలనిపించేలా చేస్తుంది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని పెంచుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. శ్వాసకోశ సమస్యలను, ఫంగల్ ఇన్ఫెక్షన్లను, క్యాన్సర్లను నివారిస్తుంది. సూక్ష్మ క్రిములను నశింపచేస్తుంది. జుట్టు ఎరిగేందుకు తోడ్పడు తుంది. గుండె, మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మానసిక ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. నొప్పి, వాపు, మంటలు తగ్గుతాయి. బిర్యానీ ఆకులో ఎన్ని సుగుణాలో కదూ !

తెర


# 'బాలన్ ది బాయ్' ట్రైలర్ రిలీజ్



గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కెవిఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా 'బాలన్ ది బాయ్'. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవలే 'బాలన్ ది బాయ్' మూవీ ఫ్రాన్స్‌లో జరిగే ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమై, గ్లోబల్ వేదికపై మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమైనప్పటి నుంచి ఈ సినిమా గ్లోబల్‌గా ఆడియెన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా 'బాలన్ ది బాయ్' మూవీ హిందీ ట్రైలర్‌ను హీరో అజయ్ దేవగణ్, తమిళ ట్రైలర్‌ను హీరో సూర్య, తెలుగు ట్రైలర్‌ను హీరో నాగచైతన్య, కన్నడ ట్రైలర్‌ను హీరో రాజ్ బి శెట్టి సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు.

ట్రైలర్ తమకు బాగా నచ్చిందని చెబుతూ మూవీ టీమ్‌కు ఈ స్టార్ హీరోలు బెస్ట్ విషెస్ అందించారు. హ్యూమన్ ఎమోషన్స్, మనదైన నేటివిటీతో సాగిన ఈ ట్రైలర్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. ఆసక్తి కలిగించే సస్పెన్స్, ఎమోషన్ వంటి అంశాలతో ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తోంది. ప్రమోషనల్ కంటెంట్‌తో 'బాలన్ ది బాయ్' సినిమా ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం విశేషం.

# 'సింగ్ గీతం' పదేళ్ల తర్వాత కూడా గుర్తుండే సినిమా: నిర్మాత నాగ్ అశ్విన్



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమాపై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీత' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత నాగ్ అశ్విన్ విలేకర్ల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **'సింగ్ గీతం' ప్రయాణం ఎప్పుడు మొదలైంది?** ఈ ప్రయాణం సింగీతంతోనే మొదలైంది. ఆయన ఈ కథను ఎప్పటినుంచో చేయాలని అనుకుంటున్నారు. కమల్‌హాసన్ గారిని కలిసినప్పుడు ఒక ఆసక్తికరమైన విషయం చెప్పారు. పుష్పక విమానంకు ముందే ఈ కథను ఆయన కమల్ హాసన్‌కు చెప్పారు. అయితే సంగీతంకి ఉన్న కొన్ని ప్రాజెక్టుల కారణంగా అది కుదరలేదు. ఫైనల్‌గా ఇప్పుడు మెటీరియలైజ్ అయింది. **మీరు నిర్మాతగా అనుకుంటే చాలా పెద్ద స్టార్స్‌తో ఈ సినిమా చేయొచ్చు. కానీ కొత్తవాళ్లతో తీయడానికి కారణం?** ఇది పూర్తిగా సింగీతం ఎంపిక. ఆయనకు కొత్త జనరేషన్‌తో పని చేయాలని ఉంటుంది. నటీనటులే కాదు, టెక్నీషియన్స్ కూడా ఎక్కువగా కొత్తవారే ఉండాలని భావిస్తారు. ఇది ఒక ప్రత్యేకమైన ప్రపం చంలో జరిగే కథ. పెద్ద స్టార్ నటీనటులు ఉంటే వారి ఇమేజ్ ప్రభావం పడే అవకాశం ఉంటుంది. కొత్త ముఖాలు అయితే ప్రేక్షకులు ఆ ప్రపంచాన్ని మరింత సహజంగా ఫీల్ అవుతారు. **'జాతిరత్నాలు' తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఈ సినిమాను నిర్మించారు కదా. మిమ్మల్ని ఎక్సైట్ చేసిన అంశాలు ఏమిటి?** సినిమా నిర్మించడం నా ఫస్ట్ జాబ్ కాదు. ఒక కథ నచ్చి, ఆ కథను ఇంకె వరూ చేయలేరనిపించినప్పుడే నేను నిర్మిస్తాను. జాతిరత్నాలు కూడా అలాంటిదే. ఆ సమయంలో అలాంటి సినిమా ఎవరూ చేసేవారు కాదనిపించింది. సింగ్ గీతం కూడా అంతే. ఇది చాలా ప్రత్యేకమైన సబ్జెక్ట్. సింగీతం విజన్‌పై, ఆయనపై ఉన్న ప్రేమతో ఈ సినిమాను చేశాను. **ఇది గోల్డ్‌కు సంబంధించిన బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందా?** ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. కుబేరపురంలో గోల్డ్ మైన్స్ ఉంటాయి. ఆ ఊరికి, ఆ గోల్డ్ మైన్స్‌కు ఉన్న కనెక్షన్ ఏమిటనేది సింగీతం సిగ్నేచర్ స్టైల్‌లో, ఆయన ట్రేడ్‌మార్క్ హ్యూమర్‌తో చెప్పడం జరిగింది. **సింగీతం వర్కింగ్ స్టైల్ మీకు ఎలా అనిపించింది?** రైటింగ్, రిహార్సల్ ప్రాసెస్ చాలా లాంగ్‌గా ఉంటుంది. దాదాపు తొమ్మిది నెలలు మేము రైటింగ్‌లోనే ఉన్నాం. నటీనటులు ఫైనల్ అయిన తర్వాత రిహార్సల్స్ కూడా చేశాం. సింగీతం చాలా స్పాంటేనియస్‌గా ఉంటారు. ఒకసారి ఏదైనా చెప్పి, తర్వాత ఆయనకే అది నచ్చకపోతే వెంటనే మార్చేస్తారు. "మీరే చెప్పారు కదా?" అంటే, "నేను తప్పు చేయకూడదా?" అంటారు. అలాంటి విషయాలు ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నాను. **ఒక కొత్త తరం దర్శకుడిగా మీ ఇన్‌పుట్స్ ఇందులో ఏమైనా ఉన్నాయా?** నాకు అప్పుడప్పుడు నేను కొత్త తరం దర్శకుడినా కాదా అనే డౌట్ వస్తుంది (నవ్వుతూ). కానీ సింగీతం మాత్రం 94 ఏళ్ల వయసులో కూడా కొత్త తరం దర్శకుడే. ఈ సినిమా కూడా ఒక టీనేజర్ తీసినట్టుగా ఉంటుంది. వారం రోజులు చూసి మర్చిపోయే సినిమా కాదు ఇది. పదేళ్ల తర్వాత కూడా గుర్తుండే సినిమా తీయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్ చేశాం. **మీరు, సింగీతం , దేవిశ్రీ ప్రసాద్ అందరికీ పాన్ ఇండియా ఇమేజ్ ఉంది. ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తీసుకెళ్లాలనే ఆలోచన ఉందా?** ఆలోచన అయితే ఉంది. తమిళంలో రిలీజ్ అవుతోంది. మిగతా భాషల విషయానికివస్తే ఇది చాలా కష్టమైన ప్రక్రియ. ఎందుకంటే ఇందులో డైలాగ్స్ అన్నీ పాటల రూపంలో ఉంటాయి. కాబట్టి ప్రతిభాషలోనూ వాటిని మళ్లీ సంగీతబద్ధంగా రూపొందించాలి. అయితే ఖచ్చితంగా ఇతర భాషల్లో కూడా తీసుకెళ్లాలనే ఆలోచన ఉంది. **అయాన్, అహల్య, శాలిని గురించి?** అయాన్, అహల్య చాలా టాలెంటెడ్ పెర్ఫార్మర్స్. వారికి మంచి స్క్రీన్ ప్రెజెన్స్ ఉంది. అయాన్, శాలిని తెలుగువారు. అహల్య తెలుగు నేర్చుకుంది. వీళ్లకు భవిష్యత్తులో చాలా మంచి అవకాశాలు వస్తాయి. **కల్కి 2 గురించి?** కల్కి 2 ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే నెల నుంచి కంటిన్యూగా షూటింగ్ చేసి శరవేగంగా పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నాం.

# 'తెల్ల కాగితం' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న చిత్రానికి 'తెల్ల కాగితం' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి విజయాల తరువాత హర్ష్ రోషన్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్, టైటిల్, ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ మూవీ రాబోతోందని టైటిల్, ఫస్ట్ లుక్‌ని చూస్తేనే తెలుస్తోంది. పోస్టర్‌లో హీరో హీరోయిన్లు కనిపిస్తున్న, చుట్టూ ఉన్న విజువల్స్ చూస్తే ఇదొక అందమైన ప్రేమ కథా చిత్రమని అర్థం అవుతోంది. ఆహ్లాదకరమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమా మీద అంచనాలు పెంచేశారు. నందు సవిరిగన ఈ చిత్రానికి కథ, కథనాన్ని, మాటల్ని అందించారు. లోతైన భావోద్వేగాలతో ఈ కథను రెడీ చేశారు. రమేష్ బండ్రెడ్డి ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను సరికొత్తగా మలిచి ప్రేక్షకులకు ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నిస్తున్నారు.

సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. అద్భుతమైన తారాగణంతో, గొప్ప సాంకేతిక బృందం ఆధ్వర్యంలో అందమైన ప్రేమ కథగా తెల్ల కాగితం ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'ది నైట్ ఆఫ్ ది స్టార్స్' మ్యూజికల్ ఈవెంట్



సీన్ సెటర్స్, అసెంబ్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక సంగీత వేడుక 'ది నైట్ ఆఫ్ ది స్టార్స్' జూన్ 12, 2026న హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అసెంబ్లీలో జరగనుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, ప్రముఖ నేపథ్య గాయని గీతా మాధురి, అలాగే సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి, భార్గవి తమ అద్భుతమైన సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ప్రముఖ యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహ ఈ వేడుకని ఆర్గనైజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నిఖిల్ విజయేంద్ర సింహ మాట్లాడుతూ..'మమ్మల్ని సపోర్ట్‌చేయడానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. మనం దరం చిన్నప్పటి నుంచి పాటలను మధురమైన జ్ఞాపకాలుగా, నోస్టాల్జిక్ ఫీలింగ్స్‌గా ఆస్వాదిస్తూ పెరిగాం. ఆ నోస్టాల్జిక్ పాటలను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఆలోచనతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దాదాపు 23 సంవత్సరాల తర్వాత కళ్యాణి మాలిక్ గారి ఆధ్వర్యంలో ఈ మ్యూజికల్ లైవ్ షో జరగడం చాలా సంతోషంగా ఉంది. జూన్ 12న అసెంబ్లీ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించబడు తుంది. మాకు ఈ వేదికను అందించిన శ్రీకాంత్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే కళ్యాణి మాలిక్‌కి, గీతా మాధురికి, సాకేత్‌కి, వినూత్నకి, అదితికి ధన్యవాదాలు. మీరు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై, మాతో కలిసి ఈ సంగీత వేడుకను ఆస్వాదించాలని కోరుకుంటున్నాం. టికెట్ల కోసం డిస్ట్రిక్ట్ యాప్, మేము అందించిన ఫోన్ నంబర్లను కూడా సంప్రదించలని కోరుతున్నాం' అన్నారు.

కళ్యాణి మాలిక్ మాట్లాడుతూ... 'నా మొదటి సినిమా ఐతే విడుదలైనప్పుడు ఎంత ఆనందంగా, ఉత్సాహంగా ఫీలయ్యానో, ఈ షో నిర్వహిస్తున్నప్పుడు కూడా అదే భావన కలుగుతోంది. జూన్ 12న జరిగే ఈ మ్యూజికల్ ఈవెంట్‌కు తప్పకుండా అందరూ రావాలని కోరుకుంటున్నాను. ఈ షో ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది' అన్నారు. గాయని గీతా మాధురి మాట్లాడుతూ...'కళ్యాణి మాలిక్ మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ షో గురించి నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. కళ్యాణి పాటలకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. నాకు లైవ్ మ్యూజిక్ షోలు అంటే చాలా ఇష్టం. అలాంటి ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేదిక చాలా అద్భుతంగా ఉంది. టికెట్లు డిస్ట్రిక్ట్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే నిర్వాహకులు ఇచ్చిన ఫోన్ నంబర్ల ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారాకూడా సంప్రదించవచ్చు. కళ్యాణి మాలిక్ పాటలను ఈ వేదికపై పాడబోతుండటం నాకు ఎంతో ఆనందంగా ఉంది' అన్నారు.

# తిలక్‌వర్మ, సిరాజ్‌లకు భారీ ధర

## లోకల్ స్టార్లకు ఊహించని ధర * టిజి లీగ్ ఆటగాళ్ల వేలంలో కాసుల పంట








**హైదరాబాద్, జూన్ 7(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఎ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న టీజీ 20 లీగ్ వేలంలో కాసుల వర్షం కురిసింది. టీమిండియా స్టార్ ఆటగాళ్ల తిలక్‌వర్మ, మహ్మద్ సిరాజ్‌లకు భారీ ధర దక్కింది. రామోజీ ఫిలిం సిటీ వేదికగా ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలంలో భారత టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ 33 లక్షల ధర పలికాడు. కనీస ధర 5 లక్షలతో వేలంలోకి వచ్చిన తిలక్ వర్మ కోసం ఫ్రాంచేజీలు పోటీపడ్డాయి. మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ పోటాపోటీగా బిడ్లు వేయగా, మధ్యలో నల్గొండ జట్టు కూడా రేసులోకి వచ్చింది. చివరకు హోరాహోరీ పోరులో 33 లక్షల భారీ ధరకు తిలక్ వర్మను మెదక్ ఫాల్కన్స్ సొంతం చేసుకుంది. ఇక మరో టిమిండియా ప్లేయర్ మహ్మద్ సిరాజ్‌ను దక్కించుకోవడానికి కూడా ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. చివరకు వరంగల్ వారియర్స్ జట్టు 14 లక్షలు వెచ్చించి సిరాజ్‌ను కొనుగోలు చేసింది.

లోకల్ స్టార్ ప్లేయర్లకు సైతం ఊహించని విధంగా ధర పలికారు. సీవీ మిలింద్‌ను 17 లక్షలకు అన్విత ఖమ్మం ఏసెస్, రవికిరణ్‌ను 13 లక్షలకు పాలమూరు స్ట్రైకర్, రవితేజను 12 లక్షలకు మెదక్ ఫాల్కన్స్, తనయ్ త్యాగరాజన్‌ను 11 లక్షలకు రంగారెడ్డి జట్టు, తన్మయ్ అగర్వాల్‌ను 8 లక్షలకు కరీంనగర్ డైమండ్స్, రాహుల్ బుద్ధిని 8 లక్షలకు అనురాగ్ నల్గొండ నైట్స్, రోహిత్ రాయుడును 6.5 లక్షలకు పాలమూరు స్ట్రైకర్స్ దక్కించుకున్నాయి.

ఈ లీగ్ లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటున్నాయి. 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలో జరగుతాయి. హెచ్‌సీఎలో నమోదైన ఆటగాళ్ల వేలంలో పాల్గొన్నారు. ప్రతి టీమ్‌కు 60 లక్షల పర్స్ మనీ కేటాయించగా, గరిష్టంగా 20 మంది ప్లేయర్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఇచ్చారు. ఒక్కో టీమ్ కనీసం రూ.54 లక్షలు ఖర్చు చేయడం తప్పనిసరి. గ్రామీణ ప్రతిభకు ప్రోత్సాహంగా ప్రతి టీమ్‌లో కనీసం 4 జిల్లాల ఆటగాళ్ల ఉండేలా, తుదిలో కనీసం రెండు జిల్లాల ప్లేయర్స్‌ను తప్పనిసరి చేశారు.

### టీజీ20 లీగ్‌లోని 8 జట్లు

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, ప్రణవ రంగారెడ్డి రైజర్స్, వరంగల్ వారియర్స్, మెదక్ ఫాల్కన్స్,అనురాగ్ నల్గొండ నైట్స్, కరీంనగర్ డైమండ్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్

# రెండో రోజు బౌలర్ల షో



## డెబ్యూలోనే మానవ్ అదర్స్ * ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 113-5 * భారత్ తొలి ఇన్నింగ్స్ 564-8 డిక్లేర్డ్

**న్యూచండీఘర్:** ముల్లన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా క్రికెట్ కూన ఆఫ్ఘనిస్తాన్‌ను చెడుగుడు ఆడుతోంది. తొలి రోజు బ్యాట్స్‌మెన్ వీరవిహారం చేస్తే... రెండో రోజు బౌలర్లు చెలరేగారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ రెండో రోజు ఆటముగిగేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆఫ్ఘనిస్థాన్ ఫాలోఆన్ తప్పించుకోవాలంటే ఇంకా 351 పరుగులకు పైగా చేయాలి. చేతిలో 5 వికెట్లు మాత్రమే ఉన్నాయి. పిచ్‌పై భారత బౌలర్ల గ్రిప్ చూస్తుంటే.. మూడో రోజు ఆఫ్ఘనిస్థాన్ జట్టుకి ఇంకా గండం పొంచి ఉన్నట్టే కనిపిస్తోంది.

టీ విరామానికి కొద్ది ముందు తొలి ఇన్నింగ్స్ ఆరంభించినఆఫ్ఘనిస్తాన్.. భారత బౌలర్ల ధాటికి మొదటి నుంచే తడబడింది.ఆఫ్ఘనిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను భారత పేసర్లు క్రీజ్‌లో కుదురుకోనివ్వలేదు. ముఖ్యంగా టెస్ట్ అరంగేట్రం చేసిన మానవ్ సుతార్ అద్భుతంగా స్పిన్ ఉచ్చులో పడేశాడు. ఓపెనర్ అబ్దుల్ మాలిక్(16)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. మరో ఎండ్‌లో పేసర్ ప్రసిధ్ కృష్ణ పదునైన బంతితో సాదికుల్లా(17)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 40 పరుగులకే ఆఫ్ఘన్ ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది.

చివరి సెషన్‌లోనూ భారత బౌలర్లు చెలరేగారు.ఒకవైపు సుతార్ రూపంలో స్పిన్, మరోవైపు ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో పేస్ అటాక్‌తో మూకుమ్మడి దాడి చేశారు. వీరి ధాటికి వెంట వెంటనే ఆఫ్ఘనిస్థాన్ వికెట్లు కోల్పోయింది. రహమనుల్లా గుర్బాజ్(12),అఫ్సర్ జాజాయ్(3)లను మానవ్ సుతార్ ఔట్ చేయగా... కెప్టెన్ హష్మతుల్లా షాహిది(20)ను ప్రసిద్ధ్ కృష్ణ ఎల్బీగా పెవిలియన్‌కు పంపాడు. మరో ఎండ్‌లో రహమత్‌షా కూల్‌గా ఆడుతూ క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో ఆఫ్ఘనిస్థాన్ వంద మార్కు దాటింది. రహమత్ షా 81 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్స్‌తో 43 పరుగులో క్రీజ్‌లో నిలిచాడు. డెబ్యూ ప్లేయర్ మానవ్ ఏకంగా కీలకమైన 3 వికెట్లు పడగొట్టగా,పేసర్ ప్రసిద్ధ్‌కృష్ణ 2వికెట్లు తీశాడు.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 3 వికెట్లకు 368 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన టీమిండియా... మరో 5 వికెట్లు కోల్పోయి 196 రన్స్ జోడించింది. శుబ్‌మన్ గిల్(177 బంతుల్లో 126; 15 ఫోర్లు, ఓ సిక్స్) మరో 23 పరుగులు జోడించి సలీం బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. రిషబ్ పంత్(121 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)లు కూడా తొందర గానే పెవిలియన్ చేరాడు. ధృవ్ జురెల్(20 బంతు ల్లో 19) నిరాశపరిచాడు. దీంతో లంచ్ సమయానికి 6 వికెట్లకు 475 రన్స్ చేసింది.

### వాషింగ్టన్ మెరుపు ఫిఫ్టీ

సూపర్ ఆల్‌రౌండర్ వాష్టింగ్టన్ సుందర్(68 బంతుల్లో 52; 5 ఫోర్లు,ఓ సిక్స్)మెరుపు హాఫ్ సెంచరీతో అలరించాడు. అతనికి డెబ్యూ ప్లేయర్ మానవ్ సుతార్(28), మహ్మద్ సిరాజ్(22) రన్స్ కూడా తోడవడంతో భారత్ స్కోరు 550 మార్కు దాటింది. సుందర్ టెస్ట్‌ల్లో అయిదో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత కెప్టెన్ గిల్... టీమిడియా తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగులవద్ద డిక్లేర్ చేశాడు. ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లలో సలీం సఫీ ఒక్కడే 6 వికెట్లు పడగొట్టి టీమిండియాకు కాస్త బ్రేకులు వేశాడు. మిగతా ఆఫ్ఘన్ బౌలర్లలో జియావుర్ రెహామాన్, హష్మతుల్లా షాహిదిలకు తలో వికెట్ దక్కింది.

# ర్యాపిడ్ చెస్ టైటిల్ నెగ్గిన వైశాలి

**టోక్యో:** భారత విమెన్ గ్రాండ్ మాస్టర్ వైశాలీ సరికొత్త రికార్డు నెలకొల్పింది. జపాన్‌లో జరిగిన డబ్ల్యూఆర్ విమెన్స్ ర్యాపిడ్ చెస్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ ట్రోఫీ నెగ్గఇన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. టోర్నమెంట్‌లో ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన వైశాలీ.. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ రౌండ్‌లో కజకిస్థాన్‌కు చెందిన బలమైన క్రీడాకారిణి అలువా నూర్మన్‌ను ఓడించింది. తొలి గేమ్ డ్రా అయినా, రెండో గేమ్‌లో అద్భుత ఎత్తులతో ప్రత్యర్థిని వైశాలీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇక బ్లిజ్ ఈవెంట్‌లోనూ విజయ పరంపరను కొనసాగిండంపై విశాలీ దృష్టి పెట్టింది. ఈ ఈవెంట్‌లోనూ విజయం సాధించి డబుల్ టైటిల్ సొంతం చేసుకోవాలని చూస్తోంది. కాగా నార్వే చెస్ టైటిల్ గెలుచుకున్న తొలి ఇండియన్‌గా నిలిచి ప్రజ్ఞానంద సరికొత్త రికార్డ్ సృష్టించగా, ఇప్పుడు అదే బాటలో సోదరి వైశాలి సరికొత్త చరిత్ర లిఖించారు.





# లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ గ్రాండ్ విక్టరీ

**లార్డ్స్:** నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మూడు టెస్ట్ సిరీస్‌లో 1-0 ఆధిక్యత పొందింది.254 పరుగుల లక్ష్యచేధనలో న్యూజిలాండ్ మరో సారి కుప్పకూలింది.కేవలం 138పరుగులకే రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. నాలుగో రోజు 55 పరుగులకు 5 వికెట్లతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ లంచ్ లోపే ఆలౌటైంది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో కాన్వే(41), గ్లెన్ ఫిలిప్స్(44 నాటౌట్), కేన్ విలియమ్సన్(18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఏకంగా నలుగురు బ్యాట్స్‌మెన్ గోల్డెన్ డక్ అయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో అట్కిసన్ 5వికెట్లు, రాబిన్సన్ 2వికెట్లు, జోష్‌టాంగ్ 2వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులు, రెండోఇన్నింగ్స్‌లో 226 పరుగులు చేయగా... న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 113రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... మొత్తం ఏడు వికెట్లు పడగొట్టిన ఓలీ రాబిన్సన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. ఈ సిరీస్‌లోని రెండో టెస్ట్ కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జూన్ 17న మొదలవుతోంది.



మహిళల టీ20 ప్రపంచకప్‌ను ఆవిష్కరించిన జట్ల కెప్టెన్లు. ఈ టోర్నీలో భారత్‌తో పాటు 12 జట్లు పోటీపడుతున్నాయి

# వారంలో 43 వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి

**ముంబయి, జూన్ 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లనుంచి జూన్ మొదటి వారంలో సుమారు రూ.43 వేల కోట్ల రూపాయలు వెనక్కితీసుకున్నారు.ప్రంపంచిన్వెస్టర్లు అందరూ తమపెట్టుబడి వనరులను టెక్నాలజీ, కృత్రిమమేధ కంపెనీల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నట్లు తేలింది. రూపాయి క్షీణత కూడా డాలర్ ఇన్వెస్టర్లకు కలిసొస్తోంది. ఈ మొత్తంతో ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.2.67 లక్షలకోట్లు మార్కెట్లనుంచి వెనక్కి తీసుకున్నారు. అదే గత ఏడాది మొత్తంగా చూస్తే 1.66 లక్షల కోట్ల కంటే ఈ ఏడాది ఆరునెలల్లోనే రెట్టింపు మొత్తం విత్‌డ్రాలుచేసారు. త్రైమాసిక ఫలితాల్లో క్షీణత, రూపాయి పతనం, గ్లోబల్‌మార్కెట్లలో మరింత ఆకర్షణీయ పెట్టుబడులకు అవకాశాలు టెక్నాలజీ, ఎఐ, స్పేస్‌రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు వస్తుండటంతోఆ దిశగా ఇన్వెస్టర్లు రూటు మార్చారు. గ్లోబల్‌ఇన్వెస్టర్లు భారీ ఎఐ సంబంధిత మార్కెట్ అవకాశాలపై ఎక్కువ ఫోకస్‌పెంచుతున్నారు. స్పేస్‌ఎక్స్



ఐపిఒకోసం ఇప్పటినుంచే సిద్ధం అవుతున్నారు. ఒక్క ఫిబ్రవరిలో మినహా మిగిలిన అన్ని మాసాల్లోను ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ మొగ్గుచూపించారు. ఫిబ్రవరిలోమాత్రం ఇన్వెస్టర్లు రూ.22,615 కోట్లుపెట్టుబడులుపెట్టారు. అదే మార్చి నెలలో 1.17 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. ఏప్రిల్‌లో 60,847కోట్లు, మేనెలలో 32,963 కోట్లు చొప్పున విత్‌డ్రా చేసుకున్నారు. అదే జూన్‌నెల మొదటి వారంలోనే రూ.42,927 కోట్లు విత్‌డ్రా అయ్యాయంటే భారత్ ఈక్విటీలపై గ్లోబల్ ఇన్వెస్టర్ల ఫోకస్ మారిందనే చెప్పాలి. భారతీయ కరెన్సీ 2026లో సుమారు ఆరుశాతం క్షీణించింది. గత ఏడాదితోపోలిస్తే 10శాతం క్షీణించింది.అయితే ఇది ఎంతోకాలం ఉండదని, ప్రభుత్వం ఎల్టీసీజీని పూర్తిగా మినహాయించడం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పన్నులు మినహాయింపు వంటి వాటితోపాటు ఆర్బీఐ ఇటీవల సడలించిన పరిమితులతో ఇన్‌ఫ్లోలు మరింతగా పెరుగుతాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ చెప్పారు. ఆర్బీఐ ఇటీవలే ఎన్‌ఆర్‌ఐలు, ఓసిఐలకు ఈక్విటీల్లో పెట్టుబడుల పరిమితులను పెంచింది. అయితే జూన్ మొదటి వారంలో ఎఫ్‌పిఐలు ఫుల్లీ యాక్సెసిబుల్‌రూట్‌లో 2600 కోట్లుపెట్టుబడులుపెట్టారు.ఈరూటులో మొత్తం పెట్టుబడులు ఇప్పటివరకూ 17,230 కోట్లవరకూ ఉన్నట్లు జియోజిత్ వెల్లడించింది.

# మ్యూచువల్ ఫండ్‌లోకి రెండు కొత్త ఆఫర్లు




**ముంబయి, జూన్7:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఈ వారం మరో రెండు కొత్త పథకాలు అందుబాటులోకి వచ్చాయి. తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను పూరించి, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు తగినట్లుగా మ్యూచువల్ ఫండ్‌హౌస్‌లు కొత్త ఫండ్స్ లాంచ్ చేశాయి.ఈ రెండు కొత్త ఫండ్స్‌లో ఒకటి యాక్టివ్ ఫండ్ ఉండగా రెండోది పాసివ్ ఫండ్ ఉంది. ఒకటి అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్‌గా వస్తే మరొకటి ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్‌గా ఉంది. డబ్ల్యూఓసీ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నేడు అందుబాటులోకి వస్తోంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 22వ తేదీ వరకు అందుబాటులోఉంటుంది.అలాగే ఇందులో కనీస పెట్టుబడి రూ.500 గా నిర్ణయించారు. ఐసీఐసీఐ ప్రూ ఏఎంసీ నుంచి మరో కొత్తఫండ్‌ను కూడా ప్రారంభిస్తున్నారు. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీనుంచి ఈ కొత్త స్కీమ్ లాంచ్ అవుతోంది. అదే ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఈటీఫ్ ఫండ్. ఈ కొత్త ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల9వ తేదీన ప్రారంభమవుతోంది. సబ్‌స్క్రిప్షన్ అనేది ఈనెల 16వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. ఆ తర్వాత వెయ్యి చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు.

# ఖనిజాల అన్వేషణకు ఎఐ డేటా హబ్‌లు



**న్యూఢిల్లీ, జూన్ 7:** దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు కేంద్రం కృత్రిమ మేధ ఎఐ ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్‌ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నెలకొల్పుతోంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ లభ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది.ఎలక్ట్రిక్ వాహనాలు,పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన ఖనిజాల కోసం ఇతరదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇదొక ముందడుగు. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఇదొక వేగవంతమైన మలుపు అని అధికారులు చెపుతున్నారు.

# ధరలు పెంచినా సిలిండర్‌పై

# ఇప్పటికీ రూ.700 భారం



**ముంబయి, జూన్ 7:** వంటగ్యాస్ సిలిండర్లపై రెండోసారి రూ.29లు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రతిసిలిండర్‌పైనే రూ.700 అదనపు భారం తప్పడంలేదని పెట్రోలియం మంత్రిత్వశాఖ ప్రకటించింది. మూడునెలల్లోనే రెండోసారి సిలిండర్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. సౌదీ కాంట్రాక్టుధర ప్రకారం సిలిండర్ సరఫరా ధర రూ.1600కి పెరిగింది. అలాగే గత ఫిబ్రవరి 28నుంచి ఎల్పీజీ దరచూస్తే సిలిండరుకు రూ.46 పెరిగిందని మంత్రిత్వశాఖ మోప్‌ఎన్‌జి ప్రకటించింది. ఈప్రకారంచూసేనత కమర్షియల్ సిలిండర్లు ఢిల్లీలో 3113.50గా ఉంది. కిలోకు 164గా ఉంది. గృహావసరాలకు అయితే కిలోకు రూ.66గా భారం పడుతోంది. ఉజ్వల సిలిండర్లకు ఈ పెంపుతో రూ.642గా మారితే జనరల్ కస్టమర్లకు రూ.942గా ఉంది. గత సంవత్సరం చివరినాటికి డొమెస్టిక్ ఎల్పీజీ భారం రూ.60వేల కోట్లకు చేరిందని, అంతకు ముందు ఏడాది కేవలం రూ.1338కోట్లుమాత్రమే ఉందని పెట్రోలియం మంత్రిత్వశాఖ చెప్పింది. ఇందుకు కేంద్ర కేబినెట్ చమురు కంపెనీలకు రూ.30వేల కోట్ల పరిహారం కూడా ప్రకటించాయి. ప్రస్తుతం ఉజ్వల సిలిండర్లు అంతర్జాతీయ ధరలతో పోలిస్తే 60 శాతం డిస్కౌంట్‌కే పంపిణీ చేస్తున్నారు. ఇక సాధారణ సిలిండర్లు అంతర్జాతీయ ధరల్లో 45 శాతం డిస్కౌంట్‌ధరలకే దేశంలో రూ.942కి అందిస్తున్నట్లు మోప్‌ఎన్జీ వెల్లడించింది. ఎలీపజీ సరఫరా మొత్తం 54శాతం హార్ముజ్ జలసంధి గుండానే వస్తుండటంతో పశ్చిమాసియా సంక్షోభం ఎల్పీజీ, పెట్రోడీజిల్‌రంగాలపై అధికంగా పడిందని పెట్రోలియంగ్యాస్ మంత్రిత్వశాఖ మోప్‌ఎన్జీ వెల్లడించింది.

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

## కిలో వెండి రూ. 2.70 లక్షలు




**ముంబయి, జూన్ 7:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు తోడవడమే కాకుండా, దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. ఆదివారం నాటి ట్రేడింగ్‌లో, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి, రూ.1,52,730 వద్దకు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1.40 లక్షల వద్ద కొనసాగింది.

నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1. 42 లక్షలుగా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.40లక్షల వద్ద కొనసాగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగింది.ముందురోజు భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా, వెండి ధరలోనూ రూ.10,000 మేర కోత పడింది.

# గడువులోపే ఐటి రిటర్నులు దాఖలు ఎంతోమేలు

## పన్ను చెల్లింపుదారులకు ఐటి శాఖ సూచనలు

**ముంబయి, జూన్ 7:** పన్నురిటర్నులను గడువు తేదీవరకూ వేచిచూడకుండా సత్వరమే దాఖలుచేస్తే పలు ప్రయోజనాలు కూడా ఉంటాయని, గడువు దాటాక చేస్తే జరిమానాలు, వడ్డీలు కూడా తప్పవని పన్నులరంగ నిపుణులు చెపుతున్నారు. 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. పన్ను చెల్లింపుదారులు గడువు తేదీ వరకు వేచి చూడకుండా, వీలైనంత త్వరగా రిటర్నులు సమర్పించాలని ఆదాయపన్ను శాఖ, ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తుగా ఫైలింగ్ చేయడం వల్ల జరిమానాల నుంచి తప్పించుకోవడమే కాకుండా, కీలకమైన ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. నిర్ణీత గడువు తర్వాత రిటర్న్లు దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది.వార్షిక ఆదాయం 5 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి రూ. 5,000, రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రూ. 1,000 జరిమానా విధిస్తారు. వీటితో పాటు చెల్లించాల్సిన పన్నుపై సెక్షన్ 234ఏప్రకారం ప్రతి నెల ఒక శాతం చొప్పున అదనపు వడ్డీ భారం పడుతుంది. స్టాక్స్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఆస్తుల విక్రయాలు లేదా వ్యాపారాల్లో నష్టాలు సంభవిస్తే, వాటిని భవిష్యత్తులో వచ్చే లాభాలతో సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనం ఉంటుంది. ఆలస్యంగా ఫైల్‌చేస్తే ఈ కీలక ప్రయోజనాన్ని కోల్పోవాల్సి వస్తుంది.గృహ, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు లేదా విదేశీ ప్రయాణాల కోసం వీసా దరఖాస్తు చేసుకునే సమయంలో ఐటీఆర్ పత్రాలు




ప్రధాన ఆదాయ ధృవీకరణగా ఉపయోగపడతాయి. సకాలంలో రిటర్నులు సమర్పించడం పన్ను చెల్లింపుదారుల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇది రుణ, వీసా ఆమోద ప్రక్రియలను మరింత సులభతరం చేస్తుంది. ఆఖరి నిమిషంలో ఈఫైలింగ్ పోర్టల్‌పై రద్దీ పెరిగి సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, రిటర్నులను ఫైల్ చేయడం ఉత్తమమని ట్యాక్స్ నిపుణులు సూచిస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.